PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 349 | విజయవాడ, బుధవారం 19 జులై 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 19 July 2023 | Rs

బదిలీలకు తాత్కాలిక బ్రేక్ !

- రేషనలైజేషన్‌కు లింక్
- నిరాశలో వ్యవసాయ అనుబంధరంగాల ఉద్యోగులు

లోపలి పేజీలో..

రాయితీ టమోటాల కోసం బారులు

ప్రజాశక్తి - కడప అర్బన్

టమోటా ధరలు అమాంతం పెరిగిపోవడంతో వినియోగదారులు లబోదిబోమంటున్నారు. కడప రైతు బజార్‌లో రెండు టన్నుల టమోటాను సబ్సిడీపై కిలో రూ.50కు విక్రయించడంతో నగరవాసులు బారులు తీరారు. సుమారు రెండు కిలోమీటర్ల మేర క్యూలో నిల్చున్నారు. పోలీసు బందోబస్తు మధ్య విక్రయాలు సాగాయి.

లోపలి పేజీలో..

సంక్షేమ మహాయజ్ఞం

జగనన్న తోడు నిధుల విడుదలలో సిఎం



జగనన్న తోడు నమూనా చెక్కును విడుదల చేస్తున్న సిఎం జగన్మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

చేతివృత్తి చేసుకునే నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మహాయజ్ఞం చేపట్టిందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. నాలుగోఏడాది జగనన్న తోడు కార్యక్రమాన్ని మంగళవారం తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయం నుండి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ దీనిలో భాగంగా 5.10 లక్షల మందికి 549.70 కోట్ల రూపాయల వడ్డీలేని రుణాలు ఇస్తున్నట్లు చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా చిరువ్యాపారులను ఆదుకుంటున్నామన్నారు. దేశం మొత్తం మీద ఎందరు లబ్ధిదారులున్నారో అంతమంది ఒక్క ఎపిలోనే ఉన్నారని చెప్పారు. రుణాలతోపాటు, గతేడాది ఇచ్చిన వడ్డీ మాఫీ రూ.11.03 కోట్లు కూడా బ్యాంకుల్లో వేసినట్లు సిఎం తెలిపారు. చిరువ్యాపారులతో పాటు హస్త కళాకారులకూ ఈ పథకం వర్తిస్తుందని పేర్కొన్నారు. గతేడాది రుణం తీసుకున్న 5,10,412 మంది వ్యాపారులు, చేతివృత్తుల వారిలో 4,54,267 మంది సకాలంలో రుణాలు చెల్లించి మరలా రూ.10 వేలు రుణంగా పొందారని తెలిపారు. సకాలంలో రుణం చెల్లించిన వారికి రూ.10 వేల నుండి రూ.13 వేలకు పెంచామని పేర్కొన్నారు. కొత్తగా 56 వేలమంది ఈ రుణాలు పొందుతున్నారని పేర్కొన్నారు. అర్హత ఉన్న వారు ఒక్కరు కూడా మిగిలిపోకూడదనే ఉద్దేశంతోనే రుణాలు ఇస్తున్నామని చెప్పారు. తీసుకున్న వారందరూ క్రమశిక్షణతో రుణాలు తిరిగి చెల్లించాలని కోరారు.

ముఖ్యమంత్రితో నీల్ రహేజా భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కె రహేజా గ్రూపు ప్రెసిడెంట్ నీల్ రహేజా మంగళవారం క్యాంపు కార్యాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులపై సిఎంతో రహేజా ప్రతినిధులు చర్చించారు. విశాఖలో ఇనార్బిట్ మాల్ నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమానికి సిఎంను కె రహేజా గ్రూపు ప్రతినిధులు ఆహ్వానించారు. ఈ సమావేశంలో ఐటిశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎపిఐఐసి మేనేజింగ్ డైరెక్టరు ప్రవీణ్‌కుమార్, కె రహేజా గ్రూపు ఆంధ్ర, తెలంగాణ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసరు జి శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

బెంగళూరులో రెండు రోజుల పాటు నిర్వహించిన సమావేశం అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతున్న మల్లికార్జున ఖర్గే, వేదికపై రాహుల్, శరద్‌పవార్, ఏచూరి, రాజా, కేజ్రీవాల్, ప్రభృతులు

ప్రతిపక్షాల కూటమి 'ఇండియా'

26 ప్రతిపక్ష పార్టీల ఏకగ్రీవ నిర్ణయం

ముంబయిలో తదుపరి భేటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వచ్చే ఏడాది జరగనున్న లోక్‌సభ ఎన్నికల కోసం ఒకే వేదికపైకి వచ్చిన ప్రతిపక్ష పార్టీలు తమ నూతన కూటమికి భారత జాతీయాభివృద్ధి సమిష్టి కూటమి (ఇండియా) అనే పేరు ఖరారు చేశాయి. ఐ - ఇండియన్, ఎన్ - నేషనల్, డి - డవలప్‌మెంటల్, ఐ - ఇంక్లూజివ్, ఎ - అలయెన్స్ (ఐఎన్‌డిఐఎ)గా అభివర్ణించాయి.

బెంగళూరులో రెండు రోజులపాటు జరిగిన ప్రతిపక్ష పార్టీల సమావేశం మంగళవారం ముగిసింది. కూటమి పేరును ఇండియాగా 26 ప్రతిపక్ష పార్టీలు ఏకగ్రీవంగా నిర్ణయించాయి. ఈ సమావేశంలో కాంగ్రెస్, టిఎంసి, డిఎంకె, ఆప్, జెడియు, సిపిఎం, సిపిఐ, ఆర్‌జెడి, జెఎంఎం, ఎన్‌సిపి, శివసేన (ఉద్ధవ్ ఠాక్రే), సమాజ్‌వాదీ పార్టీ, ఆర్‌ఎల్‌డి, అప్నాదళ్ (కె), నేషనల్ కాన్ఫరెన్స్, పిడిపి, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్, ఆర్‌ఎస్‌పి, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్, ఎండిఎంకె, విసికె, కెఎండికె, ఎంఎంకె, ఐయుఎంఎల్, కేరళ కాంగ్రెస్ (ఎం), కేరళ కాంగ్రెస్ (జోసఫ్) పార్టీలు పాల్గొన్నాయి.

అనంతరం ఏర్పాటు చేసిన ఉమ్మడి విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ ఇండియా కూటమి తదుపరి సమావేశం ముంబయిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కూటమి సమన్వయానికి 11 మందితో కూడిన కో-ఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేయాలనినిర్ణయించామన్నారు. ఆ కమిటీ కూర్పు, కన్వీనర్ పేరు తరువాత ప్రకటిస్తామని చెప్పారు. తదుపరి సమావేశం ముంబయిలో జరుగుతుందని, తేదీలను

మిగతా 7లో

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలంటే బిజెపిని గద్దె దించాల్సిందే : ఏచూరి

బెంగళూరులో ప్రతిపక్ష పార్టీల నేతల సమావేశ సారాంశాన్ని సిపిఎం ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి వివరించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమాల్లో ఒక వీడియోను పోస్టు చేశారు. ఆయన మాటల్లోనే.. 'బెంగళూరు సమావేశానికి హాజరైన పార్టీల మధ్య ఉన్న లౌకిక ప్రత్యామ్నాయ అవగాహన ఏదైతే ఉందో అది ఇండియా (ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇన్‌క్లూజివ్ అలయన్స్)గా రూపుదిద్దుకుంది. ఇది ప్రధానమైనది. రాజ్యాంగ లౌకిక, ప్రజాతంత్ర లక్షణాలను దెబ్బతీసేందుకు మోడీ సర్కార్ పాల్పడుతున్న వినాశకర చర్యల నుంచి పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. రాజ్యాంగాన్ని రక్షించుకోవాలంటే కేంద్రంలోనూ, రాష్ట్రాల్లోనూ అధికారం నుంచి బిజెపిని గద్దె దించాల్సిందే. ఈ దిశగా అన్ని పార్టీలూ సహకరించుకోవాలని సమావేశంలో నిర్ణయించాం. రాష్ట్రాల పరిధిలో సహకరించుకోవడం ద్వారా మాత్రమే ఇది పనిచేస్తుందని సమావేశం ఏకాభిప్రాయానికి వచ్చింది. ఈ దిశగా సంబంధిత రాష్ట్రాల్లోని పార్టీలు చర్చలు చేపట్టాలి. బిజెపి వ్యతిరేక ఓటు సాధ్యమైనంత మేరకు చీలిపోకుండా ఎత్తుగడలు రూపొందించాలని, అలాగే గత పదేళ్ళుగా వ్యతిరేక ఓటు చీలికను తనకు అనుకూలంగా మలచుకొని బిజెపి ఏ విధంగా లబ్ధి పొందుతూ వస్తున్నదో.. దానికి ఫుల్‌స్టాప్ పెట్టాలని సమావేశంలో నిర్ణయించాం. ఈ దిశగా రాష్ట్రాల్లో సంప్రదింపులు మొదలుకానున్నాయి. ముంబయిలో వచ్చేనెలలో నిర్వహించే తదుపరి సమావేశానికి మహారాష్ట్ర వికాస్ అఘాది కూటమి ఆతిథ్యమివ్వనుంది.' అని ఏచూరి పేర్కొన్నారు.

ప్రధాని మోడీకి గజమాలతో సత్కరిస్తున్న ఎన్‌డిఎ నేతలు

అంతా మోడీనే..

గజ మాలలు, గ్రూప్ ఫొటోలు

- ఎన్‌డిఎ భేటీలో దృశ్యం
- 38 పార్టీలు హాజరు
- ఎపి నుంచి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ హాజరు
- మాది కాల పరీక్షకు నిలిచిన కూటమి : ప్రధాని మోడీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

"పేరుకే ఎన్‌డిఎ భేటీ. ఆద్యంతం మోడీ భజనే. మోడీకి గజమాల. ఆయనకు సత్కరించడంలోనే నేతలు తలమునకలవ్వడం. ఆయనే నాయకుడు. అక్కడ ఎన్‌డిఎ కన్వీనర్ ఎవరో ఎవరికీ తెలియదు. అందరూ గ్రూప్ ఫొటో దిగారు" మంగళవారం నాడిక్కడ బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ సమావేశంలో కొట్టొచ్చినట్టు కనబడిన దృశ్యమిది. ప్రతిపక్షాల సమావేశానికి పోటీగా దేశ రాజధాని న్యూఢిల్లీలోని అశోక హోటల్‌లో ఎన్‌డిఎ భాగస్వామ్య పార్టీల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 38 పార్టీల నేతలు పాల్గొన్నారు. వీటిలో చాలావరకు చిన్న మిత్ర పక్షాలే ఉన్నాయి. కొన్ని పార్టీలకు ఒక్క ఎంపి కూడా లేరు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మాట్లాడుతూ తమది కాల పరీక్షకు నిలిచిన కూటమి అని అన్నారు. ఎన్‌డిఎ ప్రాంతీయ ఆకాంక్షల అందమైన ఇంద్రధనస్సు అని, ఇది బలవంతపు కూటమి కాదని అన్నారు. ఎన్‌డిఎ సంకీర్ణం బలవంతం చిహ్నం కాదని, సంకీర్ణం, సహకారం చిహ్నమని చెప్పారు. ఎన్‌డిఎలో ఏ పార్టీ చిన్నది లేదా పెద్దది కాదు. మనమందరం ఒకే లక్ష్యం వైపు కలిసి నడుస్తున్నామని ప్రధాని మోడీ అన్నారు. రాజకీయాల్లో పోటీ ఉండాలి కానీ నాయకులు శత్రువుల్లా ప్రవర్తించకూడదని అన్నారు. ప్రతిపక్షాల ఏకైక గుర్తింపు 'ఎన్‌డిఎ'పై దుష్ప్రచారం చేయడమేనని పేర్కొన్నారు. ఎన్‌డిఎ ప్రభుత్వం అవినీతిని, ప్రభుత్వ పథకాల లీకేజీని అరికట్టిందని అన్నారు. "ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా సానుకూల రాజకీయాలు చేశాం. ప్రతిపక్షంలో మేము అప్పటి ప్రభుత్వాల కుంభకోణాలను బయటపెట్టాం. కానీ, ప్రజల తీర్పును ఎప్పుడూ అవమానించలేదు. పాలక ప్రభుత్వాలకు వ్యతిరేకంగా మేం ఎప్పుడూ విదేశీ శక్తుల సహాయం తీసుకోలేదు. దేశానికి ఉద్దేశించిన అభివృద్ధి పథకాల్లో మేం ఎప్పుడూ అడ్డంకులు సృష్టించలేదు" అని అన్నారు. ఎన్‌డిఎ అంటే న్యూ ఇండియా, డెవలప్‌మెంట్, ఆస్పిరేషన్ అని ప్రధాని మోడీ అన్నారు. ఈ సమావేశంలో బిజెపి అధ్యక్షులు జెపి నడ్డా, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, నితీన్ గడ్కరీ (బిజెపి), నాగాలాండ్ సిఎం నీఫియు రియో (ఎడిపిపి), మేఘాలయా సిఎం సంగ్మా (ఎన్‌పిపి), మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే (శివసేన షిండే), పుదుచ్చేరి సిఎం ఎన్.రంగస్వామి (ఎఐఎన్‌ఆర్ కాంగ్రెస్), అజిత్ పవార్, ప్రఫుల్ పటేల్ (ఎన్‌సిపి పవార్), అనుప్రియా పటేల్ (అప్నాదల్), పవన్ కళ్యాణ్ (జనసేన),

మిగతా 7లో

రానున్న 48 గంటల్లో బంగాళాఖాతంలో అల్పపీడనం

- 4 రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు

కూనవరం - విఆర్.పురం వద్ద పెరిగిన గోదావరి, శబరి ప్రవాహం - వార్త 3లో..

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రానున్న 48 గంటల్లో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టరు బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ఐఎండి అంచనా ప్రకారం వాయువ్య బంగాళాఖాతంపై ఒడిశా తీరం ఆనుకుని ఆవర్తనం కొనసాగుతోందన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో రానున్న నాలుగు రోజులు అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసేటప్పుడు వ్యవసాయ పనుల్లోని రైతులు, కూలీలు, గొర్రెల కాపరులు చెట్ల కింద ఉండరాదని సూచించారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ నెల 19న అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్‌టిఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. 20న శ్రీకాకుళం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు, గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో, 21న శ్రీకాకుళం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, వైఎస్‌ఆర్, అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశముంది. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉంది.

ఈ నెల 22న శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, వైఎస్‌ఆర్, అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉంది.

తాగునీటికి నీరు విడుదల చేయండి

- మాకు అన్యాయం జరుగుతోంది
- కృష్ణా బోర్డు సమావేశంలో ఎపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులకు తోడు ప్రధాన నదుల్లో నీటి లభ్యత లేనందున ప్రాజెక్టుల నుండి తక్షణం ఆంధ్రప్రదేశ్ తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేయాలని కృష్ణా నదీ యజమాన్య బోర్డుకు రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. కృష్ణా నదీ యజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశం మంగళవారం వర్చువల్ విధానంలో జరిగింది. కెఆర్‌ఎంబి సభ్య కార్యదర్శి రాయిపురే నిర్వహించిన ఈ సమావేశానికి ఎపి ఇఎన్‌సి నారాయణరెడ్డి హాజరుకాగా, తెలంగాణ ఇఎన్‌సి మురళీధర్ గైర్హాజరయ్యారు. నాగార్జునసాగర్‌లో జరుగుతన్న అన్యాయాన్ని రాయిపురే దృష్టికి నారాయణరెడ్డి తీసుకెళ్లారు. ప్రాజెక్టులను కెఆర్‌ఎంబి పరిధిలోకి తీసుకోనందున తెలంగాణ తమ నీటి వాటాకు గండి కొడుతోందని వివరించినట్లు తెలిసింది. తాగునీటి అవసరాల కోసం తమకు రోజూ 5500 క్యూసెక్కుల చొప్పున ఐదు టిఎంసిల నీటిని ఇవ్వాలని కోరినట్లు సమాచారం. మరోసారి సమావేశమై పూర్తి స్థాయిలో చర్చిద్దామని రాష్ట్ర అధికారులతో రాయిపురే అన్నట్లు తెలిసింది.

చెప్పకముందే చేసేశాం!

- అదనపు నిధులు ఇవ్వండి
- పట్టణ సంస్కరణలపై కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వ నివేదిక

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

అదనపు నిధుల కోసం కేంద్ర ప్రభుత్వం ముడిపెట్టిన పట్టణ సంస్కరణలను ఇప్పటికే పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదించింది.కేంద్రం సూచించిన సంస్కరణలన్నింటినీ అమలు చేస్తున్నందున అదనపు నిధులను తక్షణమే విడుదల చేయాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు పట్టణ ప్రాంతాల్లో ఇప్పటికే అమలవుతున్న వివిధ రకాల సంస్కరణలను, వాటి ఫలితాలను వివరిస్తూ ఒక సుదీర్ఘ నివేదికను కేంద్రానికి పంపింది. కేంద్రం నిర్ధేశించిన లక్ష్యాలకన్నా ఎక్కువగానే పట్టణ సంస్కరణలను అమలు చేస్తున్నట్లు, ఫలితంగా రాష్ట్ర ఖజానాకు మంచి ఆదాయం వస్తున్నట్లు ఈ నివేదికలో పేర్కొంది. పట్టణాల్లో సంస్కరణలను అమలు చేస్తే అదనపు రుణాలను వడ్డీ లేకుండా ప్రోత్సాహకంగా ఇస్తామని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ప్రతిపాదించిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను కొద్ది రోజుల క్రితం ప్రజాశక్తి ప్రచురించింది. ఆ లేఖకు తాజాగా బదులిచ్చిన రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం సూచించిన సంస్కరణలన్నింటిని ఇప్పటికే అమలు చేస్తున్నట్లు తెలిపింది.జ ఆస్తి పన్నును 20 శాతం పెంచాలని కేంద్రం సిఫార్సు చేయగా, అంతకన్నా ఎక్కువే పెంచినట్లు రాష్ట్ర ప్రభుత్వం తన నివేదికలో పేర్కొంది. 2021-22 ఆర్థిక సంవత్సరం కన్నా 2022-23 ఆర్థిక సంవత్సరంలో కేంద్రం చెప్పిన దానికన్నా అధికంగా ఆస్తిపన్నులో వృద్ధి సాధించినట్లు రాష్ట్రం పేర్కొంది. కొన్ని మున్సిపాల్టీల్లో ఏకంగా 80 శాతం కన్నా ఎక్కువ వృద్ధి ఉందని, మరికొన్ని మున్సిపాల్టీల్లో 50 శాతం కన్నా అధికంగా వృద్ధి ఉందని పేర్కొంది. . ఇక ఐదు లక్షల జనాభా దాటిన నగరాల్లో ఈ ఆస్తి పన్ను సంస్కరణలపై దృష్టి పెట్టాలని కేంద్రం సూచించిగా రాష్ట్రంలో ఇటువంటి నగరాలు విశాఖపట్నం, విజయవాడ, రాజమండ్రి, నెల్లూరు, గుంటూరు ఉండగా, ప్రభుత్వం మాత్రం చిన్న పట్టణాలతోసహా మొత్తం 123 పట్టణ స్థానిక సంస్థల్లో ఆస్తిపన్ను సంస్కరణలను అమలులోకి తీసుకువచ్చినట్లు తెలిపింది.

డిసెంబర్ నాటికి అంతా

ఆస్తులను గుర్తించేందుకు, వసూళ్లను పూర్తి స్థాయిలో సాధించేందుకు డిసెంబర్ 31 లక్ష్యంగా సాగుతున్నట్లు నివేదికలో ప్రభుత్వం వివరించింది. దీనికోసం, వసూళ్లను పెంచేందుకుగాను సిబ్బందికి కూడా శిక్షణ పూర్తి చేసినట్లు వివరించింది. మొత్తం ఆస్తులను జిఐఎస్‌తో అనుసంధానం చేస్తూ భూమి రికార్డులను

మిగతా 2లో

కేరళ మాజీ ముఖ్యమంత్రి ఊమెన్ చాందీ కన్నుమూత

- గవర్నర్, సిఎం సహా పలువురు నేతల సంతాపం

లోపలి పేజీలో..

కదంతొక్కిన ఆశాలు

సమస్యలు పరిష్కరించాలని డిఎంహెచ్‌ఒ కార్యాలయాలు, కలెక్టరేట్ల వద్ద ధర్నా

- ఉమ్మడి సమావేశం ఏర్పాటుకు అధికారుల హామీ
- శ్రీసత్యసాయి జిలాల్లో అరెస్టులకు పాల్పడిన పోలీసులు

విజయవాడలో ఆశా వర్కర్ల ధర్నాలో మాట్లాడుతున్న ధనలక్ష్మి

ప్రజాశక్తి- యంత్రాంగం

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలు కదంతొక్కారు. కొన్ని జిల్లాల్లో డిఎం అండ్ హెచ్‌ఒ కార్యాలయాల వద్ద, ఇంకొన్ని జిల్లాల్లో కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. అధికారుల బెదిరింపులకు వెరకుండా, కొన్ని జిల్లాల్లో వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వందలాదిగా తరలివచ్చారు. ఆన్‌లైన్ పనుల భారం తగ్గించాలని, బాగా పనిచేసే సెల్‌ఫోన్లు ఇవ్వాలని, సంబంధంలేని పనులు చేయించవద్దని, రాజకీయ నాయకుల, అధికారుల బెదిరింపులు, వేధింపులు ఆపాలని, సచివాలయాల్లో రెగ్యులర్‌గా ఉండాలని ఒత్తిడి చేయరాదని, సెలవులు అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, సంక్షేమ పథకాలు అమలు చేయాలని నినాదాలు చేశారు. శ్రీసత్యసాయి జిల్లాలో పోలీసులు అరెస్టులకు పాల్పడ్డారు. పలు జిల్లాల్లో ఆశా వర్కర్లు ర్యాలీలు నిర్వహించారు. అధికారులకు వినతిపత్రం అందజేశారు. పలు జిల్లాలో అధికారులు ధర్నా వద్దకు వచ్చి వినతిపత్రం తీసుకున్నారు. సమస్యల పరిష్కారానికి ఉమ్మడి సమావేశం ఏర్పాటు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఆశాల ధర్నాలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు, సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు.

శ్రీసత్యసాయి జిల్లాలోని వివిధ మండలాల నుంచి ధర్నాలో పాల్గొనడానికి వస్తున్న ఆశా వర్కర్లను పోలీసులు ఎక్కడికక్కడే అడ్డుకొని అరెస్టు చేశారు. దీంతో, పోలీసుల చర్యలను నిరసిస్తూ ఆశాలు రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు.

ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలోని ధర్నా చౌక్‌లో ఆశా వర్కర్ల ధర్నాలో ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

మిగతా 7లో

బదిలీలకు తాత్కాలిక బ్రేక్ !

- రేషనలైజేషన్‌కు లింక్
- నిరాశలో వ్యవసాయ అనుబంధరంగాల ఉద్యోగులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న వ్యవసాయ అనుబంధరంగాల ఉద్యోగుల బదిలీలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. ప్రభుత్వం వీరి బదిలీలకు రేషనలైజేషన్‌కు లింక్ పెట్టడంతో ప్రక్రియ ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో కొంత కాలం బదిలీల ప్రక్రియ నిలిచిపోయినట్లేననే అభిప్రాయం ఉద్యోగ వర్గాల్లో వ్యక్తమవుతోంది. ఫలితంగా వ్యవసాయ అనుబంధరంగాలకు చెందిన అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరీ కల్చర్, ఫిషరీస్, యానిమల్ హజ్‌బెండరీ అసిస్టెంట్లకు సంబంధించిన బదిలీలకు ప్రక్రియ నిలిచిపోవడంతో ఆయా ఉద్యోగులు తీవ్ర నిరాశ నిస్పృహలకు లోనవుతున్నారు. తమ తోటి గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పూర్తి అయ్యిందని తమకు మాత్రమే రేషనలైజేషన్‌తో లింక్ పెట్టడంతో బదిలీల ప్రక్రియ ఎప్పుడు జరుగుతుందో? ఒక వేళ బదిలీల ప్రక్రియ ప్రారంభమయ్యే పక్షంలో ఎప్పుడు మొదలవుతుందో తెలియని అయోమయ పరిస్థితి ఉద్యోగుల్లో నెలకొని ఉంది. ప్రభుత్వ వర్గాల నుంచి అందుతున్న సమాచారం మేరకు ఆయా గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో వ్యవసాయ విస్తీర్ణం కొన్ని ప్రాంతాల్లో ఎక్కువగా ఉండటం, మరి కొన్ని ప్రాంతాల్లో విస్తీర్ణం తక్కువగా ఉండటంతో సిబ్బంది కొన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో సిబ్బందిని సర్దుబాటు చేయకుండా బదిలీల ప్రక్రియ ప్రారంభిస్తే పాలన గాడి తప్పే అవకాశాలు ఉంటాయని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తి చేస్తే పని భారం ఉన్న సచివాలయాలకు సిబ్బందిని సర్దుబాటు చేయడం, పని భారం తక్కువగా ఉన్న సచివాలయాలకు సిబ్బందిని కుదించే ప్రక్రియ తొలుత చేపట్టాలని ప్రభుత్వం, గ్రామ వార్డు సచివాలయాల శాఖ భావిస్తోంది. ఇది ఇలా ఉంటే సుదూర ప్రాంతాల నుంచి ఉద్యోగం కోసం జాయిన్ అయిన వారు, కుటుంబాలకు దూరంగా ఉన్న వారు, ఆరోగ్య సమస్యలు ఉన్న ఉద్యోగులు బదిలీల కోసం సుమారుగా 1500 మంది ఉంటారని ఓ అంచనా.

రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తి కాగానే బదిలీలు

గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన ఉద్యోగుల బదిలీలు రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తి కాగానే ఉంటాయని గ్రామ వార్డు సచివాలయాలశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్‌జైన్ తెలిపారు. బదిలీల విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

గ్రామ వార్డు సచివాలయాలశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్‌జైన్

ఎపిఇఎపిసెట్ రిజిస్ట్రేషన్‌కు ఆగస్టు 3 చివరితేదీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇంజనీరింగ్ ప్రవేశాల కోసం నిర్దేశించిన ఎపిఇఎపిసెట్‌లో అర్హత పొందిన అభ్యర్థులు జులై 24 నుండి ఆగస్టు మూడోతేదీ లోపు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కన్వీనర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ఆగస్టు మూడతేదీలోపు రిజిస్ట్రేషన్‌తోపాటు ఫీజు కూడా చెల్లించాలని సూచించారు. జులై 25వ తేదీ నుండి ఆగస్టు నాలుగోతేదీ వరకూ సహాయ కేంద్రాల ద్వారా ధృవపత్రాల పరిశీలన ఉంటుందని, ఆగస్టు మూడోతేదీ నుండి ఎనిమిదో తేదీ వరకూ ఐదురోజులపాటు అభ్యర్థులకు వెబ్ ఆప్షన్లను ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుందని, 9వతేదీన ఒక్కరోజు మార్పునకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఆగస్టు 12న సీట్లు కేటాయింపులు ఉంటుందని తెలిపారు. విద్యార్థులు 13, 14 తేదీల్లో వ్యక్తిగతంగా సీట్లు పొందిన కళాశాలల్లో రిపోర్టు చేయాలని, ఆగస్టు 16వ తేదీన నుండి తరగతులు ప్రారంభం అవుతాయని వివరించారు. పూర్తి వివరాల కోసం సిఇటిఎస్.ఎపిఎస్‌సిహెచ్ఇ.ఎపి.జిఒవి.ఇన్ వెబ్‌సైట్లో సందర్శించాలని కోరారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

మార్గదర్శి చిట్ గ్రూప్‌ల చందాదారులకు ఊరట

ప్రజాశక్తి-అమరావతి

మార్గదర్శి చిట్ గ్రూపులను మూసివేస్తూ చిట్ రిజిస్ట్రార్లు ఇచ్చిన ఉత్తర్వుల అమలును హైకోర్టు నిలిపేసింది. చందాదారులకు ఎలాంటి నోటీసులు జారీ చేయకుండా ఏకపక్షంగా చిట్ రిజిస్ట్రార్లు జారీ చేసిన ఉత్తర్వులను తప్పుపట్టింది. చందారులకు నోటీసు ఇవ్వకుండా చిట్ గ్రూపులను మూసివేయడం సరికాదని, సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని పేర్కొంది. మంగళవారం హైకోర్టు న్యాయమూర్తి ఎన్ జయసూర్య మధ్యంతర ఉత్తర్వులు వెలువరించారు. చిట్ గ్రూపులను మూసివేస్తూ రిజిస్ట్రార్లు జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ చందాదారులు దాఖలు చేసిన వేర్వేరు వ్యాజ్యాలను హైకోర్టు విచారణ జరిపింది. చిట్ గ్రూపుల మూసివేతకు సంబంధించి రిజిస్ట్రార్లు జారీ చేసిన ఉత్తర్వుల్లో తదుపరి చర్యలన్నీ నిలిపేసింది. చిట్ గ్రూపులను యథాతథంగా నిర్వహించుకునేందుకు అనుమతించింది.

పోలీస్ శాఖలో కులవివక్ష

- వర్ల రామయ్య ఆరోపణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోలీస్ శాఖలో కులవివక్షను అధికార వైసిపి పెంచి పోషిస్తోందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ఆరోపించారు. మంగళగిరిలోని టిడిపి కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందని, పోలీస్ శాఖ తమ ఉనికిని కోల్పోయే పరిస్థితులు కనిపిస్తున్నాయని అన్నారు. అధికార పార్టీ చేతిలో బందీగా మారిందని విమర్శించారు. పోస్టింగులు, ప్రాధాన్యతలపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పోలీస్ శాఖలో ఒకే కులానికి ప్రధాన స్థానంలో పోస్టింగులు ఇస్తూ మిగిలిన ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు అప్రాధాన్యత పోస్టింగులు ఇస్తున్నారని విమర్శించారు. మూడు రోజుల క్రితం అనంతపురం జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టి సంఘాలు డిఐజి అమ్మిరెడ్డిని కలిసి పోస్టింగులన్నీ రెడ్డి కులస్తులకే ఇస్తున్నారని, ఎస్‌సి, ఎస్‌టిలను అప్రాధాన్యత పోస్టుల్లో పెడుతున్నారని విన్నవించారని వర్ల రామయ్య తెలిపారు. రాష్ట్రంలో రౌడీలకు పోలీసులు భయపడే పరిస్థితులు వచ్చాయన్నారు. సూళ్లూరుపేటలో దళిత పోలీస్ అధికారి రవిబాబుపై దాడిని ఖండిస్తూ వర్ల రామయ్య డిజిపికి లేఖ రాశారు.

రేపటి నుంచి విజయనగరంలో అగ్నిపథ్ ర్యాలీ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఈ నెల 20 నుంచి (బుధవారం అర్ధరాత్రి) అగ్నిపథ్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ విజయనగరంలో ప్రారంభం కానుంది. ఆగస్టు రెండో తేదీ వరకు ఈ ర్యాలీ కొనసాగుతుంది. శ్రీకాకుళం నుంచి కృష్ణా వరకు మొత్తం 13 జిల్లాలకు చెందిన పది వేల మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. రోజూ రాత్రి 12.30 గంటల నుంచి ర్యాలీ ప్రారంభం కానుందని, 12 గంటలకే గ్రౌండ్‌కు చేరుకోవాలని, రోజుకు 1000 మంది అభ్యర్థులను గ్రౌండ్‌లోకి అనుమతిస్తామని ఆర్మీ అధికారులు పేర్కొన్నారు. అభ్యర్థులకు నామమాత్రపు రుసుంతో వసతి ఏర్పాట్లు, ఉచితంగా అల్పాహారం వంటి సదుపాయాలు కల్పించినట్టు విజయనగరం అధికార యంత్రాంగం పేర్కొంది.

బిజెపి విధానాలతో రాష్ట్రం అధోగతి పాలు

- సిపిఎం

ప్రజాశక్తి-కొత్తవలస (విజయనగరం జిల్లా)

కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి సర్కారు కలిసి రాష్ట్రాన్ని అధోగతి పాల్జేశాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు విమర్శించారు. విజయనగరం జిల్లా కొత్తవలస మండలంలోని ఉత్తరాపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మంగళవారం మాట్లాడారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించడంలోగానీ, విభజన హామీలను అమలు చేయడంలోగానీ బిజెపికి చిత్తశుద్ధి లేదన్నారు. మరోవైపు రాష్ట్ర అభివృద్ధిలో కీలకంగా ఉన్న విశాఖ ఉక్కు పరిశ్రమను అమ్మకానికి పెట్టిందన్నారు. బిజెపి విధానాలకు రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు వత్తాసు పలకడం సరికాదని తెలిపారు.

రాష్ట్రంలో విద్యుత్ ఉద్యమం తరువాత కరెంటు ఛార్జీలు పెంచడానికి ఏ ప్రభుత్వమూ సాహసం చేయలేదని, కానీ, వైసిపి సర్కారు రూ.15 వేల కోట్ల భారం మోపిందని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వ షరతులకు తలొగ్గి విద్యుత్తు ఛార్జీలు పెంచిందని, వెంటనే ప్రజలపై మోపిన భారాలను ఉపసహరించుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో పేదలకు ఇచ్చిన ప్రభుత్వ భూములను తిరిగి లాక్కొని పెత్తందారులకు కట్టబెట్టే ప్రయత్నాలను ప్రభుత్వం ఆరంభించిందని విమర్శించారు. కోనేరు రంగారావు కమిటీ ప్రకటించిన విధంగా రాష్ట్రంలో ఉన్న వేలాది ఎకరాల మిగులు భూములను పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. వలంటీర్ వ్యవస్థ పంచాయతీ అజమాయిషీలో పనిచేయాలని సూచించారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టి.వి.రమణ, వి.లక్ష్మి, పి.శంకరరావు పాల్గొన్నారు.

బహిరంగ సభలో మాట్లాడుతున్న లోకేష్

మోటార్లకు మీటర్లు బిగిస్తే పగలగొట్టండి

- యువగళం పాదయాత్రలో లోకేష్

ప్రజాశక్తి - ఒంగోలు బ్యూరో, పొన్నలూరు

వైసిపి పాలనలో తొమ్మిదిసార్లు విద్యుత్ ఛార్జీలు, మూడుసార్లు బస్ ఛార్జీలు, ఇంటి పన్ను, చెత్తపన్ను, నిత్యావసర ధరలు పెరిగాయని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ విమర్శించారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగిస్తే పగలకొట్టాలని..రైతులకు టిడిపి అండగా ఉందని అన్నారు. ఆయన చేపట్టిన యువగళం పాదయాత్ర మంగళవారం ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గం నుంచి ప్రారంభమై కనిగిరిలోకి ప్రవేశించింది. పొన్నలూరు మండలం, కె.అగ్రహారంలో జరిగిన బహిరంగ సభలో లోకేష్ మాట్లాడుతూ.. బడిలో పాఠాలు చెప్పే మాస్టార్‌కు, పోలీసులకు వైసిపి పాలనలో భద్రత లేదని విమర్శించారు. గతంలో బిసిలు, దళితులు, మైనార్టీలపై దాడి చేశారని...ఇప్పుడు ప్రజలు, పోలీసులపై దాడి చేస్తున్నారని..ఇంకా చూస్తూ ఉరుకుందామా? పోరాడదామా? అని ప్రశ్నించారు. జగన్ వద్ద రెండు బటన్స్ ఉంటాయని, ఒకటి బ్లూ బటన్, రెండోవది రెడ్ బటన్ అని..బ్లూ బటన్ నొక్కగానే మీ అకౌంట్‌లో రూ.పది పడతాయని, రెడ్ బటన్ నొక్కగానే మీ అకౌంట్ నుంచి రూ.వంద పోతాయని తెలిపారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి ఏడాది జాబ్ నోటిఫికేషన్ ఇస్తామని, పెండింగ్ పోస్టులు అన్ని భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. వైసిపి పాలనలో 27 దళిత సంక్షేమ కార్యక్రమాలు రద్దు చేశారన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే దళితులను వేధించిన వారిని కఠినంగా శిక్షిస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు, అద్దంకి, కొండపి ఎమ్మెల్యేలు గొట్టిపాటి రవికుమార్, డిబివి స్వామి పాల్గొన్నారు.

వైఎస్సార్ మెడికల్ వర్సిటీ ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేం

- సింగిల్ జడ్జి ఉత్తర్వులు రద్దు

ప్రజాశక్తి-అమరావతి

ఎంబిబిఎస్ 4వ ఏడాది సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు డాక్టర్ వైఎస్సార్ మెడికల్ యూనివర్సిటీ ఉత్తర్వుల అమలును నిలిపేసేందుకు హైకోర్టు నిరాకరించింది. అనేక విషయాల పరిశీలన తర్వాతే వర్సిటీ పరీక్షల షెడ్యూల్‌ను ఖరారు చేసిందని చెప్పింది. పరిపాలనాపరమైన నిర్ణయాల్లో జోక్యానికి ఆస్కారం లేదని తేల్చింది. విచక్షణా నిర్ణయాల్లో జోక్యం చేసుకోబోమని స్పష్టం చేసింది. అభ్యర్థుల వినతి మేరకు పరీక్షలు నిర్వహించి, ఆగస్టు 8లోపు ఫలితాలను వెల్లడించాలంటూ వర్సిటీని గతంలో సింగిల్ జడ్జి ఆదేశించారు. దీనిని వర్సిటీ సవాల్ చేసిన అప్పీల్ పిటిషన్‌ను తాత్కాలిక చీఫ్ జస్టిస్ ఎవి శేషసాయి, జస్టిస్ ఆర్.రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ విచారణ జరిపి తీర్పు చెప్పింది.

సింగిల్ జడ్జి ఉత్తర్వులను బెంచ్ రద్దు చేసింది. వర్సిటీ దాఖలు చేసిన అప్పీల్‌ను అనుమతించింది. 2022-23 విద్యా సంవత్సరంలో 4వ ఏడాది ఎంబిబిఎస్ పార్టు-2 సప్లిమెంటరీ (థియరీ) పరీక్షలను 10.05.2023 నుంచి 24.05.2023 వరకు, ప్రాక్టికల్ పరీక్షను 5.06.2023 నుంచి నిర్వహించేందుకు వీలుగా వర్సిటీ నోటిఫికేషన్ ఇచ్చింది. కోర్టు ఆదేశాల కారణంగా ప్రాక్టికల్ పరీక్షను తిరిగి నిర్వహించాల్సి వచ్చింది. ఫలితంగా సప్లిమెంటరీ పరీక్షలను వాయిదా వేసింది. ఆపై, వచ్చే నెల 9 నుంచి 23వ తేదీ వరకు థియరీ, ఆగస్టు 26 నుంచి ప్రాక్టికల్ పరీక్ష నిర్వహణ కోసం నోటిఫికేషన్ వెలువరించింది. ఆగస్టులో సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తే తాము ఓ విద్యా సంవత్సరం నష్టపోతామని, కాబట్టి ముందుగా పరీక్షలు నిర్వహించాలని కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. వర్సిటీ వాదనను బెంచ్ అనుమతించింది.

ప్రైమరీ పరీక్ష జనవరిలో నిర్వహించారని, మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం ప్రైమరీ పరీక్ష ఫలితాలు వెల్లడైన తేదీ నుంచి ఆరు నెలల తరువాత ఎలాంటి పరీక్షలు నిర్వహించరాదని, కాబట్టి ముందే పరీక్షలు నిర్వహించాలన్నది విద్యార్థుల వాదన. ఈ ఏడాది ఆగస్టు 11లోపు తాము ఎంబిబిఎస్ 4వ సంవత్సరం పరీక్ష పాస్ కాకుండా 2024లో నిర్వహించే నీట్ పరీక్షకు హాజరయ్యేందుకు అర్హత సాధించలేమన్నారు. ఆగస్టు 8లోపు ఫలితాలను వెల్లడించాలని వర్సిటీని ఆదేశిస్తూ గతంలో సింగిల్ జడ్జి మధ్యంతర ఉత్తర్వులిచ్చారు. దీనిపై వర్సిటీ దాఖలు చేసిన అప్పీల్‌ను అనుమతిస్తూ డివిజన్ బెంచ్ తీర్పు చెప్పింది. పిటిషనర్లకు అనుకూలంగా సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్లు తెలిపింది.

చేనేతకు ద్రోహం చేస్తున్న మోడీ

- ఎపి చేనేత కార్మిక సంఘం విమర్శ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

చేనేతలకు కేంద్రంలో మోడీ ప్రభుత్వం ద్రోహం చేస్తోందని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం విమర్శించింది.ఈ మేరకు మంగళవారం ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ విడుదల చేసిన ప్రకటనలో గుజరాత్ కార్పొరేట్లకు అనుకూలంగా జరీపై జిఎస్‌టి 12 శాతం నుండి ఐదుశాతానికి కేంద్ర ప్రభుత్వం తగ్గించిందని పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా కోట్లాది మంది చేనేత వృత్తిలో బతుకుతున్నారని, వారంతా చేనేతపై జిఎస్‌టిని వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. అయినా మోడీ ప్రభుత్వం పవర్‌లూమ్‌లకు అనుకూలంగా వ్యవహరించడం వల్ల మగ్గాలు మూలనపడ్డాయని తెలిపారు. చేనేత కార్మికులు పనులు లేక ఆకలిచావులకు గురవుతున్నారని, ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నూలుపై ఐదుశాతం, జరీపై 12 శాతం, రంగులపై 18 శాతం, రసాయనాలపై 18 శాతం జిఎస్‌టి విధించి వారి నడ్డి విరిచిందని మండిపడ్డారు. దీనిపై దేశవ్యాప్తంగా ఆందోళనలు జరిగినా ప్రభుత్వం పట్టించుకోలేదని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం జిఎస్‌టిని తగ్గించి చేనేతలను కాపాడాలని ఆయన కోరారు. లేనిపక్షంలో కేంద్రానికి చేనేతలు తగు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

నిలకడలేని వ్యక్తి పవన్

- సిపిఐ నారాయణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పవన్ నిలకడలేని వ్యక్తి అని, కదలకుండా మూడు నిమిషాలు మాట్లాడగలిగితే ఆ తర్వాత పవన్ రాజకీయ స్థిరత్వం గురించి మాట్లాడవచ్చని సిపిఐ పార్టీ జాతీయ కార్యదర్శి కె నారాయణ ఎద్దేవా చేశారు.గతంలో విప్లవకారుడు చేగువేరా టీషర్టులు వేసుకుని సోషలిజంపైన గళం విప్పిన పవన్ ఇప్పుడు మితవాద సంస్కరణల సావర్కర్ వైపు దారి తప్పి నడవడం సరికాదన్నారు. న్యూఢిల్లీలో జరుగుతున్న ఎన్‌డిఎ మిత్రపక్ష కూటమికి పవన్ హాజరైన నేపథ్యంలో నారాయణ ఈ వ్యాఖ్యలు చేశారు. మతవాద పార్టీ అయినటువంటి బిజెపితో పవన్ చేతులు కలపడం ప్రజాస్వామ్యానికి, లౌకిక వాదానికి ప్రమాదకరమని అన్నారు. బిజెపి, టిడిపిల మధ్య మధ్యవర్తిత్వం చేయడం రాజకీయాలకు మంచిది కాదని సూచించారు. ప్రత్యేక ప్యాకేజీని పాచిపోయిన లడ్డూలతో పోల్చి.. నేడు ఎన్‌డిఎలో ఎలా చేరుతున్నాడో చెప్పాలంటూ పవన్‌ను ప్రశ్నించారు.

జిఓ 423ను రద్దు చేయాలని పిటిషన్

ప్రజాశక్తి-అమరావతి

వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీల పనివేళల మార్పునకు సంబంధించిన జిఓ 423ను రద్దు చేయాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. కడప జిల్లా, ప్రొద్దుటూరు మున్సిపాల్టీలోని వార్డు శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీగా పనిచేస్తున్న బి సుమలత దాఖలు చేసిన రిట్‌లో ప్రతివాదులుగా గ్రామ, వార్డు సచివాలయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, మున్సిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనరు, జిల్లా కలెక్టరును చేర్చారు. ఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకు లేదా ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు బయట పనులు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బయట, కార్యాలయ పనులు అవసరాన్ని బట్టి నిర్వహించాలని పేర్కొంటూ జిఓ వెలువడింది. ఇది సర్వీస్ రూల్స్‌కు వ్యతిరేకమని పిటిషనరు వాదన. సవరించిన పనివేళల్లో మహిళలు పనిచేయడం కష్టమన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పనివేళలు నిర్ణయించాలన్నారు. ఈ పిటిషన్‌ను హైకోర్టు విచారించనుంది.

నల్లపాడు పోలీసు స్టేషన్ వద్ద అరెస్ట్ అయిన నాయకులు, పరామర్శకు వచ్చిన నాయకులు

గుంటూరు ఛానల్ విస్తరణకు.. మహాధర్నాపై ప్రభుత్వ నిర్బంధం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకూ విస్తరించాలని నల్లమడ రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట గత 21 రోజులుగా జరుగుతున్న నిరాహార దీక్షల్లో భాగంగా మంగళవారం చేపట్టిన మహాధర్నాపై ప్రభుత్వం నిర్బంధం ప్రయోగించింది. ఛానల్ విస్తరణ పరిధిలోని 50 గ్రామాల ప్రజలు ధర్నాకు తరలిరావాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను మండలాల నుండి గుంటూరుకు చేరుకునే రహదారుల్లో పలుచోట్ల పోలీసు తనిఖీలు చేపట్టారు. దీక్షల్లో పాల్గొనేందుకు వస్తున్న రైతుల్ని అడ్డుకున్నారు. కలెక్టరేట్ వద్ద దీక్షా శిబిరం వద్ద ఉన్న రైతులు, ప్రజా సంఘా నాయకుల్ని అరెస్ట్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. నల్లమడ రైతు సంఘం నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహన్, మాజీ ఎంపిపి నర్రా బాలకృష్ణ, కాంగ్రెస్ రైతు నాయకులు లావు అంకమ్మచౌదరి, తెలుగు యువత నాయకుడు సాయి సహా సుమారు 20 మందిని పోలీసులు అరెస్ట్ చేసి నల్లపాడు పోలీసుస్టేషన్‌కు తరలించారు. వీరిని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు వివిధ పార్టీల నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, తూమాటి శివయ్య పరామర్శించారు. దశాబ్దాలుగా నీటి కోసం పోరాడుతున్న రైతుల న్యాయమైన డిమాండ్ పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. భూసేకరణకు తక్షణమే నిధులు విడుదల చేసి, ఛానల్ విస్తరణ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు జె రామకృష్ణ అన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 887వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ సిఎంఎం, సిఆర్‌ఎంపి, సిఇడి, లూబ్రికెంట్ విభాగాల ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. మతోన్మాద రాజకీయాలను వ్యతిరేకించడం, ప్రభుత్వ రంగ పరిశ్రమలను కాపాడుకోవడం నేటి తరుణంలో దేశ ప్రజల ప్రధాన కర్తవ్యమన్నారు. దేశంలో మతోన్మాదాన్ని పెంచి పోషిస్తూ, ఐక్య ఉద్యమాలకు విఘాతం కలిగించేందుకు బిజెపి ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించకుండా, ఇతర ప్రాంతాల నుంచి రా మెటీరియల్ అందకుండా చేసి కర్మాగారాన్ని నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తోందన్నారు. దీనికి వ్యతిరేకంగా కార్మికవర్గం యావత్తూ ఉద్యమిస్తోందని తెలిపారు. రానున్న కాలంలో ఈ పోరాటం మరింత ఉధృతమవుతుందని స్పష్టం చేశారు.

తాడేపల్లికి రామచంద్రపురం పంచాయితీ

- సిఎంతో పిల్లి సుభాష్, మిథున్‌రెడ్డి భేటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజకవర్గ అధికార వైసిపి పంచాయితీ తాడేపల్లికి చేరింది. రామచంద్రపురం నియోజకవర్గంలో మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎంపి పిల్లి సుభాష్ చంద్రబోస్ మధ్య విభేదాలు రోడ్డున పడ్డ అంశం తెలిసిందే. పోటాపోటీ కార్యక్రమాలతోపాటు ఇరువర్గాలు భౌతికదాడులకు పాల్పడ్డారు. పిల్లి సుభాష్ చంద్రబోస్ వర్గీయులు ఆదివారం ద్రాక్షారామలో సమావేశమై చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణపై అసమ్మతి గళం వినిపించారు. పిల్లి సుభాష్ చంద్రబోస్ తనయుడు సూర్యప్రకాష్‌కు కాకుండా వేణుకు ఎమ్మెల్యే టికెట్ ఇస్తే ఆయనను ఓడించి తీరతామని సభలోనే ప్రకటన చేయడం, అలాగే సోమవారం మంత్రి సమక్షంలో జరిగిన సభలో మంత్రి అనుచరుడు శివాజీపై సుభాష్ చంద్రబోస్ దాడికి పాల్పడటం, మనస్థాపానికి గురైన శివాజీ ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన వైసిపిని కలవరపాటుకు గురిచేసింది. దీంతో సుభాష్ చంద్రబోస్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లికి పిలిపించారు. ఈ సందర్భంగా రామచంద్రపురం నియోజవర్గంలో మంత్రి చెల్లుబోయిన, ఆయన వర్గీయుల వ్యవహారశైలిని ముఖ్యమంత్రికి వివరించినట్లు తెలిసింది. ఈ భేటీలో సుభాష్ చంద్రబోస్‌పై జగన్ అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. తన కుమారుడుకు సీటు ఆశిస్తున్న విషయం ముందుగా ఎందుకు చెప్పలేదని బోస్‌ను జగన్ ప్రశ్నించినట్లు తెలుస్తోంది. మంత్రికి సీటును ప్రకటించాక ఇప్పుడు అసహనం వ్యక్తం చేయడం సబబేనా అని బోస్‌ను జగన్ ప్రశ్నించినట్లు సమాచారం. వారసుల విషయంలో ఇప్పటికిప్పుడు ఏ నిర్ణయమూ తీసుకోలేమని, పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించి రోడ్డుకెక్కడం సరికాదని హెచ్చరించినట్లు తెలిసింది. అలాగే గోదావరి జిల్లాల పార్టీ ఇన్‌ఛార్జి మిథున్‌రెడ్డితో భేటి అయి పరిస్థితిని సిఎం సమీక్షించినట్లు సమాచారం.

సిఎంతో ఉద్యోగ సంఘం నేతల భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో విఆర్‌ఒల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు, ఎపి గవర్నరమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఛైర్మన్ వెంకటరామిరెడ్డి, ఎపి రెవెన్యూ జెఎసి ఛైర్మన్ విఎస్ దివాకర్, సిఆర్‌పి రాష్ట్ర అధ్యక్షులు గోవర్ధన్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం భేటీ అయ్యారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎపి గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం కొత్త కార్యవర్గం సిఎంను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. నూతన కార్యవర్గాన్ని సిఎం అభినందించారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని వారు సిఎంకు అందజేశారు. అనంతరం భూపతిరాజు రవీంద్రరాజు మీడియాతో మాట్లాడుతూ.. సీనియర్ అసిస్టెంట్ పోస్టుల్లో ఖాళీగా ఉన్న పోస్టులు వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌గా విఆర్‌ఒలతో భర్తీ చేయాలని సిఎంను కోరినట్లు చెప్పారు. గతంలో ఉన్న రేషియోను 70 శాతానికి పెంచాలని కోరామన్నారు. తమ సమస్యలపై సిఎం సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. సిఎంను కలిసిన వారిలో గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అప్పలనాయుడు ఉన్నారు.

టిటిడి అటవీ కార్మికులకు సంఘీభావంగా 27న రాష్ట్రవ్యాప్త నిరసనలు

- సిఐటియు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

ఉద్యోగ భద్రత కల్పించాలని తిరుపతిలోని హరేరామ హరేకృష్ణ రోడ్డులోని టిటిడి అటవీ కార్మికులు చేస్తున్న రిలే నిరాహారదీక్షలు ఈ నెల 27 నాటికి వెయ్యి రోజులకు చేరుకోనున్న నేపథ్యంలో సంఘీభావంగా రాష్ట్రవ్యాప్త నిరసనలకు సిఐటియు పిలుపునిచ్చింది. సిఐటియుకు అనుబంధంగా ఉన్న అన్ని కార్మిక సంఘాలు నిరసన తెలపాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి కోరారు. ఈ నెల 20 నుంచి ప్రతిరోజూ పత్రికా ప్రకటనలు, సంఘీభావ ప్రకటనలు, రౌండ్‌టేబుల్ సమావేశాలు, కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమాలను అన్ని మండలాల్లో చేపట్టాలన్నారు. కార్మికుల కుటుంబాలకు స్వాంతన చేకూరడానికి, యూనియన్ల వారీగా విరాళాలు ఇచ్చి సంఘీభావం ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగారావు పాల్గొంటారని తెలిపారు.

చెప్పకముందే చేసేశాం!

(మొదటి పేజీ తరువాయి)

మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించింది. ఈ ఆస్తులను డిజిటలైజేషన్ చేసేందుకు కూడా చర్యలు పూర్తి చేసినట్లు వివరించారు.

అన్ని బిల్లులూ ఏకీకరణ

సంస్కరణల్లో భాగంగా అన్ని బిల్లులనూ ఒకే తాటిపైకి తీసుకువస్తున్నామని ప్రభుత్వం కేంద్రానికి నివేదించింది. ఆస్తి పన్ను రిజిస్టర్‌ను ఇతర విద్యుత్ బిల్లులు, నీటి బిల్లులు వంటి వాటితో అనుసంధానం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే నీటి బిల్లులను అనుసంధానం పూర్తి చేయగా, విద్యుత్ బిల్లుల అనుసంధాన ప్రక్రియ అధ్యయనంలో ఉందని పేర్కొన్నారు. ఆస్తి పన్ను రిజిస్టర్‌ను స్టాంప్స్ రిజిస్ట్రేషన్ శాఖ, రెవెన్యూ శాఖలతో అనుసంధానం చేసే ప్రక్రియ ఇంకా చేపట్టాల్సి ఉందని ప్రభుత్వం నివేదించింది. ఆస్తి పన్నుపై స్వీయ అధ్యయనం అన్నది కూడా పాక్షికంగా పూర్తి చేసినట్లు వివరించింది.

ఇకపై ఆటోమేటిక్ బిల్లులు

ఆస్తి పన్నుపై బిల్లులు ఇకపై డిజిటల్ బిల్లులుగా రానున్నాయి. ఈ బిల్లులను ఆన్‌లైన్‌లో అనుసంధానం చేయడం ద్వారా యజమానులకు నేరుగా బిల్లులు చేరు కోవడం, ఆన్‌లైన్‌లోనే వసూళ్లు చేయడం జరుగుతుందని కేంద్రానికి ఇచ్చిన నివేదికలో పేర్కొన్నారు. ఆస్తి పన్ను ధరలను పెంచేందుకు కేంద్రం 2024 జనవరి వరకు గడువుగా నిర్దేశించగా, ఆ సంస్కరణలను తాము పూర్తి చేసినట్లు రాష్ట్రం నివేదించింది.

ప్రత్యేక నిధిపైనా సిద్ధం

రింగ్ ఫెన్సింగ్ విదానంలో ఆస్తి పన్నును అమృత్ నగరాల్లో, అమృత్ నగరాల జాబితాలో లేని పట్టణాల్లో కూడా 10 శాతం నిధులను ప్రత్యేక ఖాతాలో జమచేసి, ఆ స్థానిక సంస్థలు తీసుకునే రుణాలను భవిష్యత్తులో తీర్చేందుకు చర్యలు తీసుకోవాలన్న కేంద్రం సిఫార్సులను కూడా త్వరలోనే అమలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఇలా కేంద్రం పేర్కొన్న పలు అంశాలతో కూడిన రోడ్ మ్యాప్‌లను తాము తూచ అమలు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంటూ కేంద్రం చెప్పిన ప్రోత్సాహకాలను విడుదల చేయాలని నివేదికలో కోరారు.

కంటితుడుపుగా పునరావాసం, పరిహారం

పోలవరం నిర్వాసితులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం

గోదావరి వరదకు విఆర్.పురంలో దెబ్బతిన్న నివాసాలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

పోలవరం నిర్వాసితుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేరపూరిత నిర్లక్ష్యం వహిస్తున్నాయి. ఈ ప్రాజెక్టు కోసం భూములిచ్చిన నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ 11 శాతం మాత్రమే ఇచ్చాయి. నాడు టిడిపి, నేడు వైసిపి ప్రభుత్వం గడువు తేదీలు ప్రకటించి మభ్యపెట్టాయి. 2005లో అప్పటి ప్రభుత్వం భారీ అంచనాలతో పోలవరం పనులు ప్రారంభించింది. ముంపు గ్రామాలను ఖాళీ చేయించి ప్రజలకు పరిహారం, పునరావాసం కల్పించడానికి అధికార యంత్రాంగాన్ని ఆదివాసీ పల్లెలకు పంపింది. రూ.34 వేల కోట్లకుపైగా అంచనా వ్యయం వేయగా తాజా అంచనాల ప్రకారం అది రూ.50 వేల కోట్లు దాటింది. ప్రాజెక్టు కోసం భూములిచ్చిన నిర్వాసితులకు పునరావాసం, పరిహారం చెల్లించిన తర్వాతే నిర్మాణం చేపట్టాలని చట్టాలు చెబుతున్నాయి. ఈ నిబంధనలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గోదాట్లో తొక్కేశాయి. ఈ ప్రాజెక్టు జాతీయ ప్రాజెక్టు అయినప్పటికీ బిజెపి ప్రభుత్వం మాట మార్చింది. కేంద్రాన్ని నిలదీయడంలోనూ, ప్రాజెక్టుకు పూర్తి స్థాయి నిధులు సాధించడంలోనూ టిడిపి, వైసిపి ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయి. ఈ ప్రాజెక్టుకు 41.15, 45.75 కాంటూరు లెక్కలు వేసి ముందుకు సాగారు. నాడు ప్రాజెక్టు కోసం 1,67,765 ఎకరాల భూమి అవసరమని అధికారులు లెక్క తేల్చారు. దాదాపు రెండు దశాబ్దాల్లో 1,13,119 ఎకరాలు సేకరించారు. నాటి ఉభయగోదావరి జిల్లాల్లో 1.06 లక్షల కుటుంబాలను నిర్వాసిత జాబితాలోకి తెచ్చారు. ఇప్పటికి 11,677 (11 శాతం) మందికి మాత్రమే పునరావాసం కల్పించారు. తొలిదశ 41.15 పరిధిలోని సుమారు 20 వేల కుటుంబాలదే తమ బాధ్యతంటూ గతేడాది వరద బాధితులను పరామర్శించేందుకు చింతూరు వచ్చిన సందర్భంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రకటించడం పోలవరం నిర్వాసితులను మరింత ఆందోళనకు గురిచేసింది.

అమలు కాని ముఖ్యమంత్రి హామీలు

ప్రతిపక్ష నేతగా 2019కి ముందు జగన్ పాదయాత్రలో పోలవరం ముంపు మండలాల్లో పర్యటించారు. గతంలో ఎకరాకు రూ.1.25 లక్షలు, రూ.1.40 లక్షలు, రూ.1.50 లక్షలు చొప్పున భూ పరిహారం ఇచ్చారని, దీనివల్ల నిర్వాసితులకు అన్యాయం జరిగిందని, మరో రూ.5 లక్షలు సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ రూ.6.30 లక్షలకు బదులు రూ.10 లక్షల చొప్పున ఇస్తామని ప్రకటించారు. గ్రామాలు ఖాళీ చేసే నాటికి 18 సంవత్సరాల వయసున్న ప్రతి ఒక్కరికీ యూత్ ప్యాకేజీ ఇవ్వాలనే నిర్వాసితుల డిమాండ్‌ను పాలకులు పట్టించుకోవడం లేదు. మరోవైపు జాబితాల పేరుతో జరిగిన కాలయాపనతో దళారుల జోక్యం పెరిగింది. దేవిపట్నంలో మండల స్థాయి రెవెన్యూ అధికారిపై అనేక ఆరోపణలు వచ్చాయి. ఈ అవినీతిలో పాలనా యంత్రాంగం దళారులతో కుమ్మక్కైందన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. దళారులతో ఇబ్బందుల పాలవుతున్నా, అధికారుల నిర్లక్ష్యంతో తంటాలు పడుతున్నా ముఖ్యమంత్రి ఎందుకు చొరవ తీసుకోలేకపోయారనేదే ఇప్పుడు అందరి ప్రశ్న. కనీసం మంత్రులుగానీ, ఎమ్మెల్యేలుగానీ తమ బాధను తీర్చేందుకు ఎక్కడా అధికారులతో సమీక్షలు జరపడం లేదని, ముఖం చాటేస్తూ వస్తున్నారని నిర్వాసితులు వాపోతున్నారు. సిఎంకు చిత్తశుద్ధి ఉంటే కేంద్రంతో పోరాడి పునరావాసానికి, పరిహారానికి నిధులు రాబట్టేవారన్నారు. గ్రామసభలు పెట్టడం, పదేపదే తనిఖీలు, సర్వేల పేరిట ఇబ్బందులకు గురిచేస్తుండడం దారుణమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

30 శాతం మందికే వరద సాయం

గతేడాది జులై నుంచి సెప్టెంబరు వరకూ కొనసాగిన గోదావరి వరద విలీన మండలాలను ముంచెత్తింది. వేలమందిని గూడుకు దూరం చేసింది. ఒక్కో కుటుంబానికీ లక్షల్లో నష్టం వాటిల్లింది. వరద ముంపు తగ్గిన తర్వాత చింతూరులో సభ నిర్వహించి వరద బాధితులను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించారు. 'ప్రభుత్వం అండగా ఉంటుంది. ప్రతి ఇంటికీ రూ.10 వేల నష్టపరిహారం నెల రోజుల్లోనే అందిస్తాం' అని ప్రకటించారు. ఆచరణలో కేవలం 30 శాతం మందికి మాత్రమే వరద సాయం అందింది. పూర్తిగా కూలిన ఇళ్లు, గుడిసెలు ఎన్ని, పాక్షికంగా నష్టపోయిన గృహాలెన్ని, గృహోపకరణాలకు వాటిల్లిన నష్టమెంత? నష్టపోయిన ఇతర ఆస్తుల విలువెంత? ఇంట్లో అప్పటికే నిల్వ చేసిన ధాన్యం, ఇతర వాణిజ్య పంటలకు జరిగిన నష్టమెంత? ఏక మొత్తంగా దెబ్బతిన్న రోడ్లు, కూలిన కరెంటు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు వంటి వాటి నష్టమెంతనేది ఇప్పటికీ ప్రకటించలేదు. గోదావరికి వరుసగా మూడుసార్లు వరదలు రాగా, తొలి వరదల్లో మాత్రమే బాధితులకు రెండు వేలు, ఐదు కేజీల బియ్యం, కాసిన్ని కూరగాయలు ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకుంది.

ఆఖరి మజిలీకీ కష్టాలు

- పునరావాస కాలనీల్లో శ్మశాన వాటికల సమస్య
- నిర్వాసితులకు అడుగడుగునా కష్టాలు

ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరం సమీపంలోని తూటికుంట నిర్వాసిత కాలనీకి శ్మశానం లేకపోవడంతో కాలువ గట్టున ఖననం చేస్తున్న నిర్వాసితులు (ఫైల్)

ప్రజాశక్తి- యంత్రాంగం

ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వం త్యాగం చేసి పునరావాస కాలనీలకు తరలివచ్చిన త్యాగధనులకు ఆఖరి మజిలీకీ కష్టాలు తప్పడం లేదు. పునరావాస కాలనీలకు వచ్చి ఏళ్ళు గడుస్తున్నా శ్మశాన వాటికలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పునరావాస కాలనీల్లో శ్మశాన వాటికల సమస్య తీవ్రంగా ఉండడంతో చనిపోయిన తమ వారి అంతిమ సంస్కారాలు నిర్వహించుకోడానికి నిర్వాసితులు అష్టకష్టాలు పడుతున్నారు. రహదారి, నీటి వసతి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అల్లూరి జిల్లా 41.15 కాంటూరు పరిధి తొలి దశలో దేవిపట్నం మండలంలోని 36 గ్రామాలకు దేవిపట్నం, గోకవరం మండలాల్లో 14 పునరావాస కాలనీలు నిర్మించి అక్కడికి తరలించారు. పెద్దభీంపల్లి-2 పునరావాస కాలనీలో 67 ఇళ్లు నిర్మించి 40 గిరిజన కుటుంబాలకు ఇళ్లు కేటాయించారు. పునరావాస కాలనీల్లో శ్మశాన వాటికలు లేవు. నిర్వాసితుల కుటుంబాలలో ఎవరైనా చనిపోతే అంత్యక్రియలు నిర్వహించడానికి మృతదేహాన్ని దేవిపట్నం తీసుకెళ్లాల్సి వస్తోంది. కుళాయి నీరు రెండు రోజులకోసారి ఇస్తున్నారు.ఏలూరు జిల్లా వేలేరుపాడు మండల పరిధిలోని మొత్తం 19 గ్రామాల నుంచి 1100 కుటుంబాలు పునరావాస గ్రామాలకు తరలివచ్చాయి. సిరివాక గ్రామంలో శ్మశాన వాటికకు సంబంధించి రహదారి లేకపోవడంతో నిర్వాసితులు ఇబ్బందులు పడుతున్నారు. ములగలంపల్లిలోనూ శ్మశాన వాటికకు రహదారి సమస్య ఉంది. రాచన్నగూడెం పంచాయతీ పరిధిలో నివాసాలు ఉంటున్న శివగిరి గ్రామంలో శ్మశాన వాటికకు సంబంధించి కొన్ని ఇబ్బందులు తెలెత్తడంతో రెవెన్యూ అధికారులు మరోచోట స్థలాన్ని పరిశీలిస్తున్నారు. జంగారెడ్డిగూడెం మండల పరిధిలో ఉన్న పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు పునరావాస కాలనీలో నామమాత్రంగా శ్మశాన వాటికకు స్థలం కేటాయించినప్పటికీ కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గురవాయిగూడెం ఆర్ అండ్ ఆర్ కాలనీలో 262 కుటుంబాలకు ఇళ్లు నిర్మించారు. రెండు కిలో మీటర్ల దూరంలో కాలనీ వాసులకు శ్మశాన వాటికకు మూడు ఎకరాల స్థలం కేటాయించారు. శ్మశాన వాటికకు వెళ్లే మార్గంలేక కాలనీ ప్రజలు అవస్థలు పడుతున్నారు. పట్టణ పరిధిలోని వైఎస్ఆర్ కాలనీ సమీపంలో 65 కుటుంబాలకు రమజుజపురం సమీపంలో ఎకరం స్థలంలో శ్మశాన వాటికను నిర్మించారు. అక్కడ అవసరమైన షెడ్డు, నీటి సౌకర్యం లేకపోవడంతో మృతి చెందిన వారి అంత్యక్రియలకు కొవ్వూరు వెళ్లాల్సి వస్తోందని నిర్వాసితులు వాపోతున్నారు. తాడువాయి కాలనీకి దూరంగా శ్మశాన వాటికను నిర్మించారు. నీటి వసతి, రోడ్డు మార్గం లేకపోవడంతో అంత్యక్రియల సమయంలో నిర్వాసితులు ఇబ్బందులు పడుతున్నారు. ముప్పినవారిగూడెం సమీపంలోని చిగురుమామిడి కాలనీ నిర్వాసితులకు శ్మశానవాటిక కోసం రెండు ఎకరాలు భూమిని కేటాయించారు. కానీ శ్మశాన వాటికకు హద్దులు వేయలేదు. ఐదు నిర్వాసిత కాలనీలకు సంబంధించి రెండు ఎకరాల భూమిని మాత్రమే కేటాయించారని, ఇది సరిపోదని నిర్వాసితులు అంటున్నారు. తూటి గుంట నిర్వాసిత గ్రామానికి ఇప్పటికీ శ్మశాన వాటిక కేటాయించలేదని, అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని కాలనీ వాసులు వాపోయారు. రెడ్డి గణపవరం సమీపంలోని తెల్లదెబ్బలు నిర్వాసిత కాలనీకి శ్మశాన వాటిక లేకపోవడంతో గతంలో ఒక వ్యక్తి చనిపోతే రెడ్డిగణపవరంలోని ఒక భూస్వామికి చెందిన భూమిలో అంత్యక్రియలు నిర్వహించారు. బుట్టాయగూడెం మండలంలోని నిర్వాసిత కాలనీలకు 540 కుటుంబాలు, సింగనపల్లి కాలనీకి సంబంధించి 60 కుటుంబాలు, దొరమామిడి రెండు కాలనీలకు సంబంధించి 60 కుటుంబాలు ఇప్పటి వరకు నిర్వాసిత కాలనీలకు వచ్చారు. బుట్టాయగూడెం మండల పరిధిలో 11 పునరావాస కాలనీలు ఉండగా.. వీటిలో 720 కుటుంబాలు నిర్వాసిత కాలనీలకు తరలివచ్చారు. నివాసిత కాలనీలో కష్టాల గురించి ప్రభుత్వం, ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్వాసిత కాలనీలకు బడి, గుడి ఏర్పాటు చేయకపోవడం వలన ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల నిర్మాణం కాకపోవడం తమ చిన్నారులను దూరప్రాంతాలకు పంపించడం ఇష్టంలేక వారిని చదువుకు దూరం చేస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి నిర్వాసిత కాలనీలలో పాఠశాలల నిర్మాణం త్వరితగతిన చేపట్టాలని నిర్వాసితులు కోరుచున్నారు. పునరావాస కాలనీలకు వచ్చి ఏళ్ళు గడుస్తున్నా కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నామని, 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని, కనీస వసతులు కల్పించాలని అధికారులు, ప్రజాప్రతినిధులను నిర్వాసితులు కోరుతున్నారు.

జీడికి మద్దతు ధర ప్రకటించాలి

- ప్రభుత్వం ద్వారా తక్షణమే కొనుగోలు చేయాలి
- ఎపి రైతుసంఘం పూర్వ అధ్యక్షులు బి తులసీదాస్
- కాశీబుగ్గలో 28న నిరాహార దీక్ష

మహాధర్నాలో మాట్లాడుతున్న తులసీదాస్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, పలాస

జీడి పంటకు మద్దతు ధర ప్రకటించి తక్షణమే రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోళ్లు చేపట్టాలని ఎపి రైతుసంఘం పూర్వ అధ్యక్షులు బి తులసీదాస్ డిమాండ్ చేశారు. శ్రీకాకుళం జిల్లా పలాస మండలంలోని కాశీబుగ్గ సంతమైదానంలో జీడి రైతుసంఘం ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించిన మహాధర్నాలో ఆయన మాట్లాడారు. ఒడిశా, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు ప్రభుత్వాలు జీడి రైతులకు మేలు చేసే పద్ధతులను అనుసరిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఏమీ చేయడం లేదని విమర్శించారు. జీడి పంటకు మద్దతు ధర, ఆర్‌బికెల ద్వారా కొనుగోళ్లు వంటి డిమాండ్లతో ఈ నెల 28న కాశీబుగ్గలో 24 గంటల నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. జీడి విస్తరణ, దిగుబడులు, జీడి పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు భరోసానిచ్చే ఆదర్శవంతమైన కేరళ తరహాలో జీడి కార్పొరేషన్ లేదా బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జీడిపప్పుపై 12 శాతం జిఎస్‌టి, జీడిపిక్కలపై ఐదు శాతం నుంచి 2.5 శాతం ఎక్సైజ్ సుంకం తగ్గింపు వంటి విధానాలతో మోడీ ప్రభుత్వం జీడి రైతులను నాశనం చేసిందని విమర్శించారు. జీడి పంటకు మద్దతు ధర, ప్రభుత్వపరంగా కొనుగోళ్లపై టిడిపి తన వైఖరిని చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పండించే జీడి పంటనంతటినీ టిటిడితో పాటు అన్ని దేవస్థానాలు కొనుగోలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని, అప్పుడే పంటకు మార్కెటింగ్ గ్యారంటీ వస్తుందని అన్నారు. ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ మాట్లాడుతూ వ్యాపారులు, దళారుల మోసం వల్ల అటు వినియోగదారులకు, ఇటు పంట పండిస్తున్న రైతులకు నష్టం కలుగుతోందన్నారు. ధరల స్థిరీకరణ కోసం రూ.మూడు వేల కోట్లు కేటాయించామని చెప్తున్న ప్రభుత్వం, ఆర్‌బికెల ద్వారా ఎందుకు కొనుగోలు చేయడంలేదని ప్రశ్నించారు. జీడి రైతులు జోరు వానలో సైతం తమ ధర్నాను కొనసాగించారు. ఉద్దానం ప్రాంతంలోని పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో రైతులు తరలివచ్చారు. జీడి రైతుసంఘం కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి కె మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

కూనవరం - విఆర్.పురం వద్ద పెరిగిన గోదావరి, శబరి ప్రవాహం

ఏజెన్సీలో వర్షం

ప్రజాశక్తి - యంత్రాంగం

అల్లూరి సీతారామరాజు జిల్లాలో మంగళవారం 345.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పాడేరు ఏజెన్సీలో గాలి వానతో పలువురు ఇబ్బందులు పడ్డారు. రంపచోడవరం డివిజన్‌లో కూనవరం, చింతూరు, విఆర్ పురం, ఎటపాక, మారేడుమిల్లి, వై రామవరం మండలాల్లో వర్ష ప్రభావం ఎక్కువగా ఉంది. ఎగువున వానలు పడుతుండడంతో గోదావరి ప్రవాహం కొంచెం పెరిగింది. మరోవైపు శబరిలోనూ నీటి ప్రవాహం జోరందుకుంది. దీంతో విలీన మండలాల్లోని పోలవరం నిర్వాసితులు ఆందోళన చెందుతున్నారు. గతేడాది వరదల భయం నేటికీ వీరిని వెంటాడుతోంది. విఆర్ పురంలోని గొల్లూరు, గొందూరు, జీడిగుప్ప తదితర చోట్ల వాగులు పొంగి ప్రవహించాయి.

వస్త్ర ఎగుమతుల్లో పతనం

ఆర్థిక ఇబ్బందుల్లో నూలు మిల్లులు

న్యూఢిల్లీ : ప్రపంచ మార్కెట్లలో భారత ఉత్పత్తులకు డిమాండ్ సన్నగిల్లుతోంది. ముఖ్యంగా వస్త్ర, అభరణాల రంగాలు ప్రతికూలతను ఎదుర్కొంటున్నాయి. ప్రస్తుత ఏడాది జూన్‌లో దేశం నుంచి వస్త్రాలు, దుస్తుల ఎగుమతులు తగ్గిపోయాయి. గత సంవత్సరంతో పోలిస్తే 11.3 శాతం మేర పతనం నమోదయ్యింది. దీంతో అనేక మిల్లులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాయి. తగినంత డిమాండ్ లేకపోవడంతో దక్షిణాదిన కూడా పలు మిల్లులు ఉత్పత్తిని నిలిపివేశాయి. నూలు, బట్టలు, చేనేత ఉత్పత్తుల ఎగుమతులు 1.21శాతం మేర పడిపోయాయి. చేతి పనితో చేసే ఉత్పత్తుల రవాణా కూడా 17.22 శాతం తగ్గింది. జౌళి ఉత్పత్తులు 26.72 శాతం, కార్పెట్ల ఉత్పత్తి 15.43 శాతం తగ్గిందని భారత వస్త్ర పరిశ్రమ సమాఖ్య (సీఐటీఐ) తెలిపింది. గత సంవత్సరం జూన్‌లో 1,736 మిలియన్ డాలర్ల విలువ కలిగిన వస్త్రాలు ఎగుమతి కాగా ఈ సంవత్సరం అదే నెలలో 1,624 మిలియన్ డాలర్ల విలువైన వస్త్రాల ఎగుమతి మాత్రమే జరిగింది. అదే దుస్తుల ఎగుమతి విషయానికి వస్తే 1,501 మిలియన్ డాలర్ల నుండి 1,248 మిలియన్ డాలర్లకు తగ్గింది. రాబోయే రెండు నెలల్లో నూలు ఉత్పత్తుల ఎగుమతులు పెరుగుతాయని నూలు ఎగుమతుల అభివృద్ధి మండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిద్ధార్థ రాజగోపాల్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదిలావుండగా తమిళనాడులోని చిన్న చిన్న వస్త్ర మిల్లులు తగిన డిమాండ్ లేకపోవడంతో ఉత్పత్తిని నిలిపివేశాయి. అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాలలో మాంద్యం కారణంగా వస్త్రాలు, దుస్తుల ఎగుమతులపై ప్రభావం పడిందని సిఐటిఐ అధ్యక్షుడు టి.రాజ్‌కుమార్ తెలిపారు. ఎగుమతి చేయాల్సిన నూలు దేశీయ మార్కెట్‌లో ప్రవేశించిందని, ఇప్పటికే దేశంలో అవసరమైన దాని కంటే ఎక్కువ సరుకు ఉన్నదని ఆయన వివరించారు. 3 శాతం నుంచి 6 శాతం వరకూ లాభాలు రావాల్సిన పరిశ్రమ ఇప్పుడు 5 శాతం నుంచి 10 శాతం వరకూ నష్టాలలో కూరుకుపోయిందని చెప్పారు. మిల్లులన్నీ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాయని, గత రెండు నెలల కాలంలో పరిస్థితి మరింత దారుణంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్తి దిగుమతులపై ప్రస్తుతం విధిస్తున్న 11 శాతం సుంకాన్ని తొలగించాలని, రుణాల చెల్లింపుపై మారటోరియం విధించాలని దక్షిణ భారత మిల్లుల సంఘం ఛైర్మన్ రవి శామ్ కోరారు.

డిఇఒ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి, యువజన సంఘం నాయకులు

డిఇఒ ఉత్తర్వులను రద్దు చేయాల్సిందే

ధర్నాలో విద్యార్థి, యువజన సంఘాల ధర్నా

ప్రజాశక్తి-కడప అర్బన్

విద్యార్థులు నిరసన కార్యక్రమాలలో పాల్గొనకూడదని కడప జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవరెడ్డి జారీ చేసిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కడప జిల్లా డిఇఒ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ సమస్యలపై పోరాడేందుకు వీలు లేకుండా ప్రజాస్వామ్య హక్కులను కాలరాసేలా విద్యార్థులు ర్యాలీలు, ధర్నాలో పాల్గొనకూడదని ఉత్తర్వులను జారీ చేయడం డిఇఒ నిరంకుశత్వానికి నిదర్శనమని తెలిపారు. ప్రజాస్వామ్యంలో తమ సమస్యలపై ఆందోళన తెలిపే హక్కు ప్రతి పౌరునికీ ఉందన్నారు. ప్రభుత్వ అధికారిగా కాకుండా అధికార పార్టీ నాయకులుగా డిఇఒ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. జిల్లా వ్యాప్తంగా గుర్తింపు లేని విద్యాసంస్థలు నడుస్తున్నా ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో విచ్చలవిడిగా అధిక ఫీజులు వసూలు చేసి దోపిడి చేస్తున్నా చర్యలు తీసుకోలేని డిఇఒ విద్యార్థులను మాత్రం అడ్డుకోవాలని చూడడం విడ్డూరంగా ఉందన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి జారీ చేసిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్ర ప్రసాద్, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పవన్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి తిరుమలేసు, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు భారత్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు మామిల్ల బాబు, పిఎస్‌యు జిల్లా కార్యదర్శి నాగేంద్ర, డివైఎఫ్ఐ నగర అధ్యక్షులు షాకీర్, ఎఐవైఎఫ్ నాయకులు మైనుద్దీన్ ప్రసంగించారు.

సిసిఆర్ కార్డులు ఇవ్వకపోతే ఉద్యమం

- కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు

ప్రజాశక్తి - పలాస

రాష్ట్రంలోని ప్రతి కౌలు రైతుకు పంట సాగు హక్కు పత్రాలు మంజూరు చేయాలని, లేకుంటే ఉద్యమం తప్పదని కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కాశీబుగ్గలోని సిఐటియు కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 32 లక్షల మంది కౌలు రైతులు ఉండగా కేవలం 5.90 లక్షల మందిని లక్ష్యంగా నిర్దేశించుకుని సిసిఆర్ కార్డులను మంజూరు చేసి రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులుపుకుంటోందని విమర్శించారు. సిసిఆర్ కార్డులు మంజూరు చేయడంతో పాటు ఎకరాకు రూ. 25 వేలు పెట్టుబడి సహాయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు రూ.నాలుగు వేల కోట్ల రుణాలను మంజూరు చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదన్నారు. కౌలు రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలు మంజూరు చేయడంలేదని విమర్శించారు. కౌలు రైతులు సాగు చేస్తున్న పంటను ఇ-క్రాప్ చేయాలని డిమాండ్ చేశారు. ఒసి జాబితాలో ఉన్న కౌలు రైతులకు రైతు భరోసా ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. తక్షణమే రైతుభరోసా మంజూరు చేయాలని, రైతులు పండించిన ప్రతి పంటకు మద్దతు ధర ప్రకటించాలని కోరారు. దేవాదాయ భూములను సాగు చేస్తున్న కౌలు రైతులకు ఎండోమెంట్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారుల సమన్వయంతో సిసిఆర్ కార్డులు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి పి ప్రసాదరావు, జిల్లా ఉపాధ్యక్షులు బమ్మిడి ఆనందరావు పాల్గొన్నారు.

సహారా డిపాజిటర్లకు 45 రోజుల్లో రిఫండ్

న్యూఢిల్లీ : సహారా గ్రూపునకు చెందిన నాలుగు సంస్థలు అక్రమంగా సమీకరించిన నిధులు ఎట్టకేలకు తిరిగి డిపాజిటర్లకు చెల్లించాలని కేంద్రం నిర్ణయించింది. సహారాలోని నాలుగు కోపరేటివ్ సొసైటీల్లో ప్రజలు దాచుకున్న సొమ్మును 45 రోజుల్లో తిరిగివ్వనున్నట్లు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా వెల్లడించారు. దీనికి సంబంధించిన రిఫండ్ పోర్టల్ సిఆర్‌సిఎస్-సహారా రిఫండ్ పోర్టల్‌ను మంగళవారం అమిత్ షా ఆవిష్కరించారు. 2008, 2009 ఏడాదిలో సుబ్రతారాయ్‌కు చెందిన సహారా కోఆపరేటివ్ సొసైటీ, సహరయన్ యునివర్సల్ మల్టీపర్పస్ సొసైటీ, హుమారా ఇండియా క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ, స్టార్స్ మల్టీపర్పస్ కో ఆపరేటివ్ సొసైటీలు నిబంధనలకు విరుద్ధంగా 2.5 కోట్ల మంది వద్ద నుంచి రూ.30,000 కోట్ల మేర డిపాజిట్లను సమీకరించాయి. సహారా గ్రూప్ సంస్థ సెబీ వద్ద డిపాజిట్ చేసిన రూ.24,979 కోట్ల నుంచి రూ.5,000 కోట్లను సహారా గ్రూప్ కో-ఆపరేటివ్ సొసైటీస్ డిపాజిటర్లకు చెల్లించడానికి సుప్రీంకోర్టు ఈ ఏడాది మార్చిలో అనుమతిచ్చింది. ఆ మొత్తం సెంట్రల్ రిజిస్ట్రార్ ఆఫ్ కోపరేటివ్ సొసైటీస్ ఖాతాలో జమ అయ్యింది. ఈ మొత్తాన్ని రానున్న 9 నెలల్లో మదుపరులకు తిరిగి చెల్లిస్తామని కేంద్రం గత మార్చిలో తెలిపింది. ఈ క్రమంలోనే చెల్లింపులకు కొత్త పోర్టల్‌ను ఏర్పాటు చేశారు. రూ.10వేల వరకు డిపాజిట్లు చేసిన వారికి తొలుత చెల్లింపులు చేయనున్నామని అమిత్ షా తెలిపారు. తొలి దశలో ఈ మొత్తంతో 1.7 కోట్ల డిపాజిటర్లకు చెల్లింపులు చేయొచ్చని పేర్కొన్నారు. రూ.30 వేల వరకు డిపాజిట్ చేసిన వారు 2.5 కోట్ల మంది వరకు ఉన్నారని తెలిపారు. రూ.5వేల కోట్లు ఇచ్చిన తర్వాత మళ్లీ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామమన్నారు. మిగిలిన వారికి చెల్లింపులు చేస్తామన్నారు.

మేలు రకాల మిర్చి ధరల తగ్గుదల

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మిర్చి ధరల తగ్గుదల కొనసాగుతోంది. 15 రోజుల క్రితం వరకు మేలురకాలు తేజ, బాడిగ నాన్ ఎసి రకాలు కనిష్టంగా రూ.18 వేలు, గరిష్టంగా రూ.33 వేల వరకు పలికాయి. మంగళవారం కనిష్ట ధర రూ.9 వేలు, గరిష్ట ధర రూ.26 వేలు పలికింది. కోల్డ్ స్టోరేజీలోని తేజ, బాడిగ ధరలు కనిష్టంగా రూ.15 వేలు, గరిష్టంగా రూ.25,500 ధర పలికాయి. ఎసి.కామన్ వెరయిటీలు సగటు ధర క్వింటాలు కనిష్ట ధర రూ.11 వేలు, గరిష్ట ధర రూ.22 వేలు పలికింది. నాన్ ఎసి కామన్ వెరయిటీలు కనిష్టంగా రూ.10 వేలు, గరిష్టంగా రూ.23 వేలు వచ్చింది. ఎక్కువ సరుకు కనిష్ట ధరలకే కొనుగోలు చేస్తున్నారు. ధరల తగ్గుదలతో రైతులు కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వ చేసుకుంటున్నారని కమీషన్ ఏజెంట్లు తెలిపారు. గుంటూరు మిర్చి యార్డుకు మంగళవారం 34,482 టిక్కిలు వచ్చాయి. పాత నిల్వలతో కలిపి 33,963 టిక్కిలు అమ్ముడుపోయాయి. పాత నిల్వలతో కలిపి ఇంకా 11,803 టిక్కిలు నిల్వ ఉన్నాయి.

పొగాకు ఉత్పత్తి లక్ష్యం 142 మిలియన్ కిలోలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో 2023-24 సంవత్సరంలో పొగాకు ఉత్పత్తి లక్ష్యం 142 మిలియన్ కిలోలుగా నిర్ణయించినట్లు బోర్డు చైర్మన డివి స్వామి తెలిపారు. గుంటూరు జిల్లా బోర్డు కార్యాలయంలో మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన ఈ విషయం వెల్లడించారు. ఈ సమావేశంలో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరక్టరు డాక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు, రాజ్యసభ సభ్యులు జివిఎల్ నరసింహారావు, కేంద్ర వాణిజ్యశాఖ డిప్యూటీ సెక్రటరీ అభిమన్యుకుమార్, కేంద్ర వ్యవసాయశాఖ డైరక్టర్ డాక్టర్ జిటి పుత్రా వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమావేశంలో పాల్గొనగా బోర్డు సభ్యులు మాగుంట శేషు, పొగాకు బోర్డు వేలంనిర్వహణ డైరక్టర్ అశ్వినీ నాయుడు, ఇండియన్ టుబాకో అసోసియేషన్ అధ్యక్షులు మద్ది వెంకటేశ్వరరావు, బోర్డు కార్యదర్శి డి వేణుగోపాల్ తదితరులు హాజరయ్యారు.

సంపాదకీయం

పేదరికంపై పరిహాసం!

తిమ్మిని బమ్మిని చేయడం..లేనిది ఉన్నట్టు చూపడం..మోడీ ఏలుబడిలో సర్వసాధారణంగా మారిపోయింది. తాజాగా నీతి ఆయోగ్ అందుకు ఉపక్రమించడం విడ్డూరం. దేశంలో పేదరికం తగ్గిపోతోందంటూ ఆ సంస్థ ఇచ్చిన నివేదిక మోడీ సర్కారుకు రాజకీయ లబ్ధిచేకూర్చేందుకే. గత అయిదేళ్లలో 13.5 కోట్ల మంది పేదరికం నుంచి బయట పడినట్లు నీతి ఆయోగ్ తాజాగా సెలవిచ్చింది.

గత ఏడాది ప్రపంచ ఆకలి సూచీలో మొత్తం 121 దేశాల్లో 107వ స్థానంలో భారత్ నిలిచింది. అంతకుముందు ఏడాదితో పోల్చితే ఆరు స్థానాలు దిగజారింది. 2016 నుంచి ఈ ర్యాంకు దిగజారిపోతూనే ఉంది. తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న ఇరుగుపొరుగు దేశాలైన పాకిస్తాన్ (99), శ్రీలంక (64), నేపాల్ (81), బంగ్లాదేశ్ (84) మన కన్నా మెరుగైన స్థితిలో ఉన్నాయి. ఐదేళ్లకంటే తక్కువ వయసు పిల్లల పోషకాహార లోపం ఉన్న జనాభా నిష్పత్తి, శారీరక క్షీణత (ఎత్తుకు తగ్గ బరువు), పిల్లల్లో ఎదుగుదల లోపం (వయసుకు తగ్గ ఎత్తు), మరణిస్తున్న పిల్లల నిష్పత్తి ప్రపంచ ఆకలి సూచీ పరిగణనలోకి తీసుకున్న అంశాలు. ఈ సూచీ కంటే వాస్తవ పరిస్థితి మరింత భయంకరంగా ఉందనేది వైద్యనిపుణుల అనుభవం.

దేశంలో అధికారిక సర్వేలు, గణాంకాలు తప్పుల తడక అని, రాజకీయ జోక్యం పెరిగిపోతుండడం వల్ల గణాంకాలు విశ్వసనీయత కోల్పోతున్నాయని పలువురు ఆర్థిక వేత్తలు, మేధావుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో అన్ని రకాల ఆర్థిక సర్వేలు, గణాంకాల సమీక్షకు కొత్త స్టాండింగ్ కమిటీ వేస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులిచ్చిన మూడు రోజులకే నీతి ఆయోగ్ ఈ నివేదిక వెలువరించడం గమనార్హం. కార్పొరేట్ల ప్రయోజనాల పరిరక్షణే ధ్యేయంగా ప్రణాళికా సంఘం స్థానే పుట్టుకొచ్చిన నీతి ఆయోగ్ తాజాగా ప్రభుత్వానికి రాసిన లేఖలో ఐదేళ్లలో (2015-16, 2019-21 మధ్య) 13,54,61,035 మంది పేదరికం నుంచి బయటపడ్డారని తెలిపింది. పేదరికాన్ని కొలిచే పద్ధతులను మార్చడం, ప్రాతిపదికల్లో కొన్నిటిని తొలగించడం ద్వారా పేదరికం తగ్గినట్టు చూపడం ఆమోదయోగ్యం కాదు. పరిశీలించిన 12 అంశాల్లో... పేదరికాన్ని తగ్గించడంలో పోషకాహారంలో మెరుగుదల, పాఠశాల విద్య, పారిశుధ్యం, వంట ఇంధనం ముఖ్యమైన పాత్ర పోషించాయని నీతి ఆయోగ్ పేర్కొంది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5) సర్వే ప్రకారం మనదేశంలో 57 శాతం మంది మహిళలు, 67 శాతం మంది పిల్లలు రక్తహీనతతో బాధపడుతున్నారు. ప్రసూతి మరణాలకు, పిల్లల మరణాలకు, పిల్లల్లో ఎదుగుదలకు ప్రధాన కారణమైన రక్తహీనతను ఎన్ఎఫ్‌హెచ్ఎస్-6 సర్వే నుంచి ఎత్తివేయాలని తాజాగా కేంద్రంలోని పాలకులు నిర్ణయించారు. మనదేశంలో 21.7 శాతం సంపద ఒకశాతం శత కోటీశ్వరుల చేతుల్లో ఉండగా, 40 శాతం మంది దేశ ప్రజల చేతుల్లో ఉన్న సంపద 19.8 శాతమే. మోడీ ఏలుబడిలో ఆర్థికరంగం అస్తవ్యస్తం కావడం, సమస్తం కార్పొరేటీకరిస్తుండటం, అన్ని రంగాల్లో వైఫల్యంతో పేదరికం గణనీయంగా పెరిగింది. దీనిని కప్పిపుచ్చి, ఎన్నికల్లో రాజకీయ లబ్ధిపొందేందుకు నీతి ఆయోగ్ వంటి సంస్థల ద్వారా అనుకూల నివేదికలు తెప్పించుకోవడం పరిపాటిగా మారింది. గత ఏడాది విడుదలైన మానవాభివృద్ధి సూచిక (హెచ్‌డిఐ)లో మనదేశం 132వ స్థానంలో ఉంది. రెండేళ్ల క్రితంతో పోలిస్తే ఒక స్థానం దిగజారింది. బ్రిటన్ ఆర్థిక వ్యవస్థను అధిగమించి ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్నామని చాలాకాలంగా మోడీ సర్కారు ఊదరగొడుతోంది. మానవాభివృద్ధిలో 18వ స్థానంలో ఉన్న బ్రిటన్‌కు, మన దేశానికి మధ్య 114 స్థానాల అంతరం ఉందన్న విషయాన్ని మాత్రం దాటవేస్తూ ఉంటుంది.

పేదరికాన్ని తగ్గించడంలో మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ చట్టం కీలకపాత్ర పోషించింది. వామపక్షాల ఒత్తిడితో కేంద్రంలోని యుపిఎ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ చట్టం వల్ల 2005-06 నుంచి 2019-21 మధ్య 41.5 కోట్ల మంది దారిద్ర్యం నుంచి బయటపడ్డారని ఐక్యరాజ్యసమితి నివేదిక ఇటీవల పేర్కొంది. ఆ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు ఎత్తులు వేస్తూ ఏటా నిధులు తెగ్గోసే పరిస్థితినే మోడీ ఏలుబడిలో చూస్తున్నాం. మనకన్నా రెండేళ్లు ఆలస్యంగా స్వాతంత్ర్యం పొందిన చైనా ఇప్పటికే పేదరికాన్ని పూర్తిగా రూపుమాపింది. సర్వం కార్పొరేట్లకు దోచిపెట్టే మోడీ జమానాలో పేదరికం తగ్గిందనడం ఈ శతాబ్దంలోనే అతి పెద్ద జోక్!

మహనీయుల మాట



కార్మిక వర్గం చేసే పోరాటాల విజయం అది సాధించే తక్షణ ఫలితాలలో లేదు. ఈ పోరాటాల క్రమంలో అది సాధించే అపూర్వ ఐక్యతే అతి గొప్ప విజయం.

- కార్ల్ మార్క్స్

Karl Marx

ఉమ్మడి పౌర స్మృతి - ఎన్నికలే లక్ష్యం

విశ్లేషణ

ఎలమరం కరీం



ఉమ్మడి పౌర స్మృతి (యుసిసి) అమలు చేస్తామంటూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చేసిన ప్రకటన పూర్తిగా రాజకీయపూరితమైనది. ఏ వర్గానికి చెందినవారైనా సరే... ప్రజలు ఎదుర్కొంటున్న... ప్రతికూలతను, గురవుతున్న నిర్లక్ష్యాన్ని పరిష్కరించడం దీని లక్ష్యం కాదు. మహిళలు ఎదుర్కొంటున్న 'వివక్ష'ను అంతం చేయడం ఈ ప్రకటన ఉద్దేశం కాదు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించేందుకుగాను మెజారిటీ వర్గ వాదాన్ని బుజ్జగించడమే మోడీ లక్ష్యం.

2014లో ఏర్పడిన మోడీ ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ ప్రణాళికతో పనిచేస్తోంది. అమెరికా సామ్రాజ్యవాదం, జాతీయ కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలకు అనుగుణంగా అడుగులు వేస్తోంది. ఇది చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాల పట్ల కార్మికులు, రైతులు, నిరుద్యోగ యువత అసంతృప్తితో ఉన్నారు. వీటన్నింటిని అధిగమించేందుకు మత ఘర్షణలు సృష్టించి ప్రజల దృష్టిని మళ్లించాలన్నది మోడీ ప్రభుత్వ వ్యూహం.

అయోధ్యలో రామ మందిర నిర్మాణం, కాశ్మీర్‌కు ప్రత్యేక హోదా, రాష్ట్ర హోదా తొలగింపు, పౌరసత్వ సవరణ చట్టం, మత మార్పిడి నిషేధ చట్టం, ఘర్ వాపసీ, గోరక్ష, హిజాబ్ వివాదం, లవ్ జిహాద్ వివాదం, మత ఘర్షణలు...మొదలైనవన్నీ లౌకిక భారతదేశాన్ని 'హిందూ' రాష్ట్రంగా మార్చాలనే ఆర్‌ఎస్‌ఎస్ పథకంలో భాగమే.

ఇన్ని చేసినా 2024లో గెలుస్తారన్న గ్యారెంటీ లేదు. కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల ఎన్నికల్లోనూ, ఢిల్లీ కార్పొరేషన్ ఎన్నికల్లోనూ బిజెపి పరాజయం పాలైంది. ప్రతిపక్ష లౌకిక పార్టీలు ఐక్యత వైపు వెళ్లడం కూడా వారిని కలవరపెడుతున్నది. ఈ నేపథ్యంలో 'యూనిఫాం సివిల్ కోడ్'ను తెరపైకి తెచ్చారు.

ఈశాన్య రాష్ట్రాల్లోని బిజెపి ఫ్రంట్ లోని కొన్ని గిరిజన పార్టీలు ఉమ్మడి పౌర స్మృతిపై వ్యతిరేకత వ్యక్తం చేశాయి. దళితులు, షెడ్యూల్డ్ కులాలవారు కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. యుసిసి కి వ్యతిరేకంగా ముస్లిం, క్రైస్తవ తదితర మత సంఘాలు కూడా ముందుకు వచ్చాయి. అంతే, ఈశాన్య రాష్ట్రాలలోని గిరిజనులు, క్రైస్తవులను యుసిసి నుంచి మినహాయిస్తామని అమిత్ షా ప్రకటించారు. 'ఒకే దేశం, ఒకే ప్రజ, ఒకే చట్టం' అని చెబుతున్న సంఘ్ పరివార్ కేవలం ముస్లింలను లక్ష్యంగా చేసుకునే ఆయుధంగా యుసిసిని బయటికి తీసినట్లు దీనినిబట్టి స్పష్టమవుతోంది.

మత విశ్వాసాలు, సామాజిక నిర్మాణం, జీవనశైలి, సాంస్కృతిక భేదాలు వంటి వివిధ అంశాల ఆధారంగా వ్యక్తిగత చట్టాలు నిర్ణయించబడతాయి. ప్రభుత్వం రూపొందించిన చట్టాలు, వ్యక్తిగత చట్టాలు, హక్కులు కుటుంబ సంబంధాలకు సంబంధించి నిర్ణయించబడతాయి. ప్రతి మతానికి తనకంటూ ప్రత్యేకమైన సాంస్కృతిక అంశాలు, హక్కులు ఉంటాయి. అవసరాన్ని బట్టి అందులో మార్పులు చేసేందుకు ఆయా సంఘాల నుంచే చొరవ వచ్చేలా చూడడం అభిలషణీయం. వారసత్వ చట్టం-1925, ప్రత్యేక వివాహ చట్టం-1954 సాధారణ చట్టాలను నిర్వీర్యం చేసేందుకు...లవ్ జిహాద్‌ను నిరోధించే పేరుతో బిజెపి పాలనలో వున్న రాష్ట్ర ప్రభుత్వాలు...మతాంతర వివాహాలను అడ్డుకుంటున్నాయి. ఇది ప్రత్యేక వివాహ చట్టాన్ని తోసిపుచ్చడమే.

దేశంలో స్థానికంగా వివిధ వ్యక్తిగత చట్టాలు ఉన్నాయి. కేరళలో 1975లో హిందూ ఉమ్మడి కుటుంబ వ్యవస్థ మారిపోయింది. ముస్లిం వివాహాలు, విడాకుల నమోదు అవసరమని చెప్పే చట్టాలు బెంగాల్, బీహార్, ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాలలో వున్నాయి. కాశ్మీరీ ముస్లింలకు 'దత్తత' హక్కు ఉంది. భారతదేశంలో, ముస్లింలకు మాత్రమే కాకుండా హిందువులు, జైనులు, బౌద్ధులు, సిక్కులు, పార్సీలు, యూదులకు కూడా ప్రత్యేక వ్యక్తిగత చట్టాలు ఉన్నాయి. ఎవరికి ఏ వ్యక్తిగత చట్టం వర్తిస్తుందనేది మతపరమైన గుర్తింపు నిర్ణయిస్తుంది. ప్రత్యేక వివాహ చట్టం-1954 ప్రకారం హిందూ కమ్యూనిటీకి చెందిన స్త్రీ పురుషులు వివాహం చేసుకున్నప్పటికీ, వారికి హిందూ వ్యక్తిగత చట్టం వర్తిస్తుంది. అయితే, ప్రత్యేక వివాహ చట్టం కింద వివాహం చేసుకున్న ముస్లింలకు ముస్లిం వ్యక్తిగత చట్టం వర్తించదు.

'ఏకీకరణ' కంటే దేశ 'సమైక్యత' ముఖ్యం. భిన్నత్వంలో ఏకత్వం అనే భావనను మన దేశం సమర్థించింది. సాంస్కృతిక గుర్తింపు హక్కు సాంస్కృతిక వైవిధ్యాన్ని కాపాడుతుంది. సాంస్కృతిక వైవిధ్యాన్ని స్వీకరించే సహనశీలత భారతీయ సమాజంలో వుంది.

సంఘ్ పరివార్ అంటే చెప్పిన సూత్రాలను ఏ మాత్రం స్వీకరించడానికి సిద్ధంగా లేని వారు. ముస్లింల రక్షణ గురించి ప్రస్తావిస్తూ మోడీ మొసలి కన్నీరు కారుస్తున్నారు. పార్లమెంటు ఆమోదించిన 'ట్రిపుల్ తలాక్ నిషేధ చట్టాన్ని' సమర్థిస్తూ మోడీ ఈ వాదన చేస్తున్నారు. తలాక్ చెప్పి విడాకులిచ్చే భర్తను ట్రిపుల్ తలాక్ చట్టం ప్రకారం జైలుకు పంపుతారు. భర్త జైల్లో వుంటే విడాకుల తర్వాత ఆమెకు భరణం ఎవరిస్తారు? ముస్లింలు అనాగరికులు అని ప్రచారం చేయడమే మోడీ ఉద్దేశం.

లా కమిషన్ నివేదిక-2018 వ్యక్తిగత చట్టాలను సంస్కరించాలని చెప్పింది. కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా ఏ కమ్యూనిటీ సంస్థతోనైనా చర్చించిందా? భిన్నత్వాలు కలబోసిన ఈ భారతదేశంలో ఏకాభిప్రాయం లేకుండా కేవలం చట్టం ద్వారా మాత్రమే ఏదీ పరిష్కరించబడదు. మోడీ పాలనలో ఇలాంటి అనుచితమైన చర్యలు ఎన్నో ఉంటాయి. వీటన్నింటి ఉద్దేశ్యం "మహిళా రక్షణ" కాదు. కేవలం రాజకీయ ప్రయోజనమే. భారత రాజ్యాంగం దేశంలో అనేక పర్సనల్ చట్టాలకు చట్టబద్ధత కల్పించిన విషయాన్ని మోడీ మరచిపోయారు. తాను ప్రధానమంత్రి అయినప్పటికీ మోడీ ప్రజలను రాజ్యాంగం ప్రకారం చూడరు. ఆర్‌ఎస్‌ఎస్ దృష్టి కోణం నుంచే చూస్తారు. అందువల్లే, దేశం మీద ఉమ్మడి పౌర స్మృతిని రుద్దడం వల్ల కలిగే దుష్పరిణామాల గురించి ఆయనకు ఫికర్ లేదు.

మోడీ ప్రభుత్వం ముస్లింలను టార్గెట్ చేస్తోంది. ఇటువంటి చర్యలు ముస్లింలలో 'ఉగ్రవాదాన్ని' రెచ్చగొట్టే సంస్థలకు ఊపునిస్తాయి. 'సేవ్ ఇస్లాం' వంటి ఉద్వేగభరితమైన నినాదాలతో ఉద్రేకాలను రెచ్చగొట్టేందుకు మత మౌఢ్య శక్తులకు ఊతమిస్తుంది. లౌకిక ఉద్యమాల్లో చేరి, తమ మత విశ్వాసాలను, గుర్తింపును కాపాడుకునే వైఖరి తీసుకునే వారిని బలహీనపరుస్తుంది. అంతేగాక సమాజంలో సమయానుకూల మార్పులు కోరుకునే సమూహాన్ని బలహీనపరుస్తాయి. హిందూత్వ మతోన్మాద శక్తులు సరిగ్గా దీనినే కోరుకుంటున్నాయి. 'ఉగ్రవాదం' పేరుతో ముస్లింలను అణిచివేసేందుకు ఇదొక సాకుగా వుంటుంది.

ఆర్‌ఎస్‌ఎస్ నుంచి వస్తున్న 'అతివాద హిందుత్వ' ముప్పుపై కాంగ్రెస్ జాతీయ నాయకత్వం స్పష్టమైన వైఖరిని అవలంభించడం లేదు. బాబ్రీ మసీదు విషయంలోనూ ఇలాగే వ్యవహరించింది. యుసిసి బిల్లు పార్లమెంటుకు వచ్చిన తర్వాత దానిమీద వ్యాఖ్యానించవచ్చన్న కాంగ్రెస్ వైఖరి మోసపూరితమైనది. రాజ్యాంగ ఆదేశిక సూత్రాలలో "ఉమ్మడి పౌర స్మృతి" మాత్రమే కాదు. శ్రామికులకు జీవనోపాధి కల్పించడం, ఒకే ప్రాంతంలో సంపద కేంద్రీకరణ కాకుండా చూడడం, పరిశ్రమల నిర్వహణలో కార్మికుల భాగస్వామ్యం వంటి అంశాలు కూడా ఉన్నాయి. వాటిలో ఏ ఒక్కటి అమలు చేయడానికి ఆసక్తి చూపని మోడీ ప్రభుత్వం...హిందూ-ముస్లిం విభజనను సృష్టించి మతపరమైన విభజనలను ఓట్లుగా మార్చుకోవడానికి యుసిసి ని ముందుకు తెచ్చింది.

2019 ఎన్నికల వేళ పుల్వామా ఉగ్రదాడిని బిజెపి ప్రధాన ప్రచార అంశంగా చేసుకుంది. ఉగ్రదాడికి పాకిస్తాన్ మద్దతు ఇచ్చిందని, ఆ దేశంపై సర్జికల్ దాడుల ద్వారా ప్రతీకారం తీర్చుకున్నట్లు ప్రభుత్వం చెప్పుకుంది. దీంతో ఉద్వేగానికి లోనైన ఓ వర్గం ప్రజలు పడిన కష్టాలను మరిచిపోయి బిజెపి కి పట్టం కట్టారు. 2024లో కూడా మోడీ అదే వ్యూహాన్ని ప్రయోగిస్తున్నారు. మెజారిటీ మతాన్ని రెచ్చగొట్టడమే వారి లక్ష్యం.

(వ్యాసకర్త రాజ్యసభ సభ్యుడు)



"2014లో ఏర్పడిన మోడీ ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ ప్రణాళికతో పనిచేస్తోంది. అమెరికా సామ్రాజ్యవాదం, జాతీయ కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలకు అనుగుణంగా అడుగులు వేస్తోంది. ఇది చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాల పట్ల కార్మికులు, రైతులు, నిరుద్యోగ యువత అసంతృప్తితో ఉన్నారు. వీటన్నింటిని అధిగమించేందుకు మత ఘర్షణలు సృష్టించి ప్రజల దృష్టిని మళ్లించాలన్నది మోడీ ప్రభుత్వ వ్యూహం."

లా కమిషన్ నివేదిక-2018 వ్యక్తిగత చట్టాలను సంస్కరించాలని చెప్పింది. కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా ఏ కమ్యూనిటీ సంస్థతోనైనా చర్చించిందా? భిన్నత్వాలు కలబోసిన ఈ భారతదేశంలో ఏకాభిప్రాయం లేకుండా కేవలం చట్టం ద్వారా మాత్రమే ఏదీ పరిష్కరించబడదు. మోడీ పాలనలో ఇలాంటి అనుచితమైన చర్యలు ఎన్నో ఉంటాయి. వీటన్నింటి ఉద్దేశ్యం "మహిళా రక్షణ" కాదు. కేవలం రాజకీయ ప్రయోజనమే.

ఉక్రెయిన్‌కు క్లస్టర్ బాంబులు దిగుమతి
ప్రపంచానికి ధాన్య ఎగుమతుల బంద్!

అంతర్జాతీయం

ఎం. కోటేశ్వరరావు

శాంతి నెలకొనాల్సిన చోట మరింత అశాంతి తలెత్తేలా జో బైడెన్ సర్కార్ ఉక్రెయిన్‌కు క్లస్టర్ బాంబులు పంపింది. సంక్షోభాన్ని మరింత తీవ్రతరం కావించేందుకు, రష్యా మీద మరిన్ని ఆంక్షలతో నష్టపరిచేందుకు నాటో కూటమి పూనుకుంది. దానికి ప్రతిగా దాడులను మరింత తీవ్రం గావించటంతో పాటు, ఉక్రెయిన్ నుంచి నల్లసముద్రం ద్వారా జరుగుతున్న ధాన్య ఎగుమతుల ఒప్పందం నుంచి రష్యా తప్పుకుంది. ఆదివారంతో ముగిసిన ఒప్పందాన్ని అది పొడిగించలేదు. దీంతో 45 దేశాలకు ఉక్రెయిన్ ధాన్య ఎగుమతులపై అనిశ్చితి ఏర్పడింది. నౌకలకు భద్రత లేనందున రవాణా నిలిచిపోనుంది. గత ఏడాది టర్కీ చొరవతో ఐరాస మధ్యవర్తిత్వంలో కుదిరిన ఒప్పందం మేరకు ఉక్రెయిన్ రేవుల దిగ్బంధనాన్ని రష్యా ఎత్తివేసింది. దానికి ప్రతిగా తమ ఆహార ధాన్యాలు, ఎరువుల ఎగుమతులపై పశ్చిమ దేశాలు ఆంక్షలను తొలగించలేదని పుతిన్ విమర్శించాడు. మూడు ఉక్రెయిన్ రేవుల నుంచి వివిధ దేశాలకు 3.28 కోట్ల టన్నుల గోధుమలు, ఇతర ధాన్యాలు, పొద్దుతిరుగుడు పువ్వుల నూనె ఎగుమతి జరిగింది. వీటిలో 46 శాతం ఆసియా, 40 శాతం పశ్చిమ ఐరోపా, 12 శాతం ఆఫ్రికా, రెండు శాతం తూర్పు ఐరోపా దేశాలకు వెళ్లాయి. దాంతో గత ఏడాది మార్చి నుంచి ఇటీవలి వరకు ప్రపంచ మార్కెట్లో ఆహార ధరలు 23 శాతం వరకు తగ్గినట్లు తేలింది. తిరిగి పరిస్థితి మొదటికి రావటంతో సోమవారం నాడు చికాగో మార్కెట్లో గోధుమల ముందస్తు ధర 3.5 శాతం పెరిగింది. వెంటనే ఒప్పంద పునరుద్ధరణ జరగకపోతే భారత్‌తో సహా అనేక దేశాల మీద ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది. ఒప్పందాన్ని కొనసాగించలేదనే ఆగ్రహంతో క్రిమియా ద్వీపాన్ని రష్యా ప్రధాన భూ భాగాన్ని కలిపే వంతెన పేల్చివేసేందుకు ఉక్రెయిన్ దాడి జరిపింది. పాక్షికంగా దెబ్బతిన్న వంతెనను వెంటనే రాకపోకలకు పునరుద్ధరించినట్లు పుతిన్ సర్కార్ ప్రకటించింది. దీనికి ప్రతిగా భారీ ఎత్తున నల్లసముద్రం లోని రేవు, ఉక్రెయిన్ ఇతర ప్రాంతాల మీద రష్యా పెద్ద ఎత్తున వైమానిక దాడులు జరుపుతున్నట్లు మంగళవారం నాడు వార్తలు వచ్చాయి. తమ తూర్పు ప్రాంతంలో పరిస్థితి సంక్లిష్టంగా ఉన్నప్పటికీ తమ అదుపులోనే ఉందని ఉక్రెయిన్ మిలిటరీ అధికారి చెప్పాడు. లక్ష మందికి పైగా మిలిటరీ, తొమ్మిది వందలకు మించి ట్యాంకులను రష్యా మోహరించిందని అన్నాడు.

మానవ హక్కుల బృందాలు విమర్శించినా ఖాతరు చేయకుండా నిషేధిత క్లస్టర్ బాంబులను (పలు రకాల బాంబుల గుత్తి) ఉక్రెయిన్‌కు సరఫరా చేసి సంక్షోభాన్ని ప్రమాదకర మలుపు తిప్పేందుకు అమెరికా పూనుకుంది. ఎనభై కోట్ల డాలర్ల విలువగల ప్యాకేజీలో భాగంగా ఇప్పటికే వాటిని అక్కడకు తరలించింది. ఒకవేళ వాటిని తమ మీదకు వదిలితే తాము కూడా ప్రయోగించేందుకు తమ దగ్గర భారీగా నిల్వలు ఉన్నాయని రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్ హెచ్చరించాడు. ఒక రష్యా జర్నలిస్టుతో మాట్లాడినపుడు ఈ అంశాన్ని చెప్పాడు. గతంలో అమెరికా వీటిని ప్రయోగించిన ప్రాంతాలలో జరిగిన ప్రాణ నష్టం, వనరుల విధ్వంసం కారణంగా వాటిని నిషేధించారు. కొన్ని సందర్భాలలో కొన్ని బాంబులు పేలవు. వాటి గురించి తెలియక ఎవరైనా ముట్టుకుంటే సంవత్సరాల తరువాత కూడా మందుపాతరల మాదిరి పేలే ముప్పు ఉంది. గగనతలం నుంచి విమానాలు, భూమి, సముద్రాల మీద నుంచి కూడా వీటిని ప్రయోగించవచ్చు. గతంలో ఇవి పేలినపుడు మరణించిన వారిలో 94 శాతం మంది పౌరులు కాగా 40 శాతం మంది పిల్లలు ఉన్నారు. వీటిని రూపొందించే పద్ధతిని బట్టి ఒక్కో గుత్తిలో కొన్ని డజన్ల నుంచి గరిష్టంగా ఆరు వందల బాంబులను అమర్చవచ్చు. తక్కువ మంది మిలిటరీ, పరిమితమైన విమానాలు, ఓడలు, రాకెట్ వాహనాలతో భారీ నష్టం కలిగించవచ్చు.

ఈ బాంబులను రకరకాలుగా రూపొందిస్తున్నారు. మామూలుగా ఒక బాంబును వేస్తే ఒక చోటే నష్టం కలిగిస్తుంది. కానీ ఈ గుత్తి బాంబు వేసిన తరువాత అది అనేకంగా విడిపోయి విస్తృత ప్రాంతంలో పేలుళ్లకు కారణమౌతుంది. మనుషులను చంపటంతో పాటు రోడ్లు, వాహనాలు, విద్యుత్ లైన్లు ఇలా ఆ ప్రాంతంలో ఏవి ఉంటే వాటిని ధ్వంసం చేస్తాయి. కొన్ని సందర్భాలలో మానవాళి, పంటలకు ముప్పు కలిగించే జీవ, రసాయనాలతో కూడా బాంబులను రూపొందిస్తున్నారు. యుద్ధం, ఇతర సందర్భాలలో పౌరులను హెచ్చరించేందుకు, బెదిరించేందుకు రూపొందించిన కరపత్రాలను కూడా ఈ బాంబుల ద్వారా వెదజల్లిన ఉదంతాలు ఉన్నాయి. వివిధ దేశాల్లో ఇవి కలిగించిన అపార నష్టాన్ని చూసిన తరువాత 2008 మే 30వ తేదీన డబ్లిన్ నగరంలో 107 దేశాలు వీటి ఉత్పత్తి, వినియోగం, బదిలీ, నిల్వ చేయరాదని ఒక అవగాహనకు వచ్చాయి, అదే ఏడాది డిసెంబరు మూడున ఓస్లో నగరంలో ఒప్పందం మీద సంతకాలు చేశాయి. 2010 ఆగస్టు ఒకటి నుంచి అమల్లోకి వచ్చింది. ప్రస్తుతం 111 దేశాలు సంతకాలు చేసి పార్లమెంట్లలో ఆమోద ముద్ర వేశాయి, మరో పన్నెండు దేశాలు సంతకాలు చేసినా తదుపరి ప్రక్రియను పూర్తి చేయలేదు. మన దేశం, అమెరికా, చైనా, రష్యా, ఉక్రెయిన్, పాకిస్తాన్, ఇజ్రాయెల్ వంటి దేశాలు ఒప్పందంలో చేరలేదు. నాటోలోని ఫ్రాన్స్, బ్రిటన్, జర్మనీ వంటి పద్దెనిమిది దేశాలు కూడా ఒప్పందాన్ని అమలు చేస్తున్నవాటిలో ఉన్నాయి. అవి కూడా అమెరికాను నివారించేందుకు పూనుకోలేదు. అయిష్టంగానే తాము ఉక్రెయిన్‌కు అందచేస్తున్నట్లు జో బైడెన్ ప్రపంచాన్ని నమ్మించేందుకు చూశారు.

రష్యా ఉక్రెయిన్ మీద వేసినట్లు గతంలో నాటో కూటమి ఆధారం లేని ఆరోపణలు చేసింది. తాజాగా అమెరికా వాటిని ఇవ్వటాన్ని సమర్ధించుకొనేందుకు ముందుగానే ఈ ప్రచారం చేసినట్లు దీన్ని బట్టి అర్ధం అవుతోంది. పట్టణాల మీద వీటిని వేయకూడదని రాతపూర్వకంగా ఉక్రెయిన్ నుంచి హామీ పొందినట్లు నమ్మించేందుకు అమెరికా చూస్తోంది. కొంత మంది ఇలా అందచేతతో తలెత్తే చట్టపరమైన అంశాల గురించి చర్చలు చేస్తున్నారు. 'నాటో' లోని కొన్ని అమెరికా మిత్రదేశాల నుంచి కూడా విమర్శలు వచ్చాయి. తప్పని చెబుతూనే ఉక్రెయిన్ ఆత్మరక్షణకు ఇస్తున్నారు గనుక అర్థం చేసుకున్నామంటూ సమర్ధించాయి. ఐదు వందల రోజుల సంక్షోభం తరువాత ఎందుకు ఇప్పుడు వీటిని అమెరికా సరఫరా చేస్తున్నది అనే ప్రశ్న తలెత్తటం సహజం. రష్యా అదుపులో ఉన్న ప్రాంతాలను తిరిగి స్వాధీనం చేసుకొనేందుకు తాము ప్రతిదాడులు జరుపుతున్నట్లు జెలెన్‌స్కీ ప్రకటించాడు. దాదాపు నెల రోజులు కావస్తున్నా, ఎలాంటి పురోగతి లేకపోగా భారీ నష్టాలను చవి చూస్తున్నట్లు వార్తలు. ట్యాంకులు, శతఘ్నులను పెద్ద ఎత్తున నష్టపోయింది. దీనికి ప్రధాన కారణం ఆ ప్రాంతాలలో రష్యన్లు భారీ సంఖ్యలో మందుపాతరలను అమర్చినట్లు, కందకాలను తవ్వినట్లు వెల్లడి కావటంతో ఉక్రెయిన్, నాటో మిలిటరీ అంచనాలు తప్పాయి. వాటిని దాటుకొని ముందుకు పోవటం అంటే ప్రాణాల మీదకు తెచ్చుకోవటమే. అందుకే ఆ ప్రాంతాల మీద క్లస్టర్ బాంబులను వేయటం తప్ప మరొక మార్గం లేదనే నిర్ణయానికి వచ్చినట్లు చెబుతున్నారు. ఇవి కందకాల మీద, బహిరంగంగా ఉన్న ట్యాంకులు, శతఘ్నులను పేలుళ్ల జరిపి నష్టపరుస్తాయి. పేలని బాంబులు, వాటితో పాటు జారవిడిచే మందుపాతరలను తప్పించుకొని పుతిన్ సేనలు ముందుకు పోవటం కూడా ఇబ్బందే.

క్లస్టర్ బాంబులను గతంలో ప్రయోగించిన ప్రాంతాలన్నీ మిలిటరీ, పౌరులు కలసి ఉన్న ప్రాంతాలే కావటంతో అనేక మంది వీటిని నిషేధించాలని డిమాండ్ చేశారు. ఈ బాంబులలో రెండు నుంచి నలభై శాతం వరకు పేలే అవకాశం లేదని, చెట్లు, గుట్టలు, బురద ప్రాంతాల్లో పడినవి తరువాత ఎవరైనా వాటిని కదిలించినపుడు లేదా అవేమిటో తెలియని పిల్లలు, ఇతరులు వాటిని ముట్టుకున్నపుడు పేలి ప్రాణాలు తీస్తాయి. తాము ఉక్రెయిన్‌కు పంపిన ఈ బాంబుల్లో పేలనివి 2.35 శాతమే ఉంటుందని, ఎంతో మెరుగుపరచిన పరిజ్ఞానంతో రూపొందించినట్లు అమెరికా నమ్మించ చూస్తోంది. అయితే దాని రక్షణశాఖ జరిపిన పరీక్షల్లో పేలనివి 14 నుంచి 20 శాతం అంతకంటే ఎక్కువే ఉన్నట్లు నివేదికలు వెల్లడించాయి. ఉక్రెయిన్‌కు వాటిని అందించటమంటే అక్కడి సంక్షోభాన్ని మరో మలుపు తిప్పటమే కాదు, తీవ్ర పర్యవసానాలకూ దారి తీస్తుంది. ఉద్రిక్తతలను ఎగదోసే యుద్ధోన్మాదాన్ని ఎండగట్టాలి. ★

సంక్షోభాన్ని మరింత తీవ్రతరం కావించేందుకు, రష్యా మీద మరిన్ని ఆంక్షలతో నష్టపరిచేందుకు నాటో కూటమి పూనుకుంది. దానికి ప్రతిగా దాడులను మరింత తీవ్రం గావించటంతో పాటు, ఉక్రెయిన్ నుంచి నల్లసముద్రం ద్వారా జరుగుతున్న ధాన్య ఎగుమతుల ఒప్పందం నుంచి రష్యా తప్పుకుంది. ఆదివారంతో ముగిసిన ఒప్పందాన్ని అది పొడిగించలేదు. దీంతో 45 దేశాలకు ఉక్రెయిన్ ధాన్య ఎగుమతులపై అనిశ్చితి ఏర్పడింది. నౌకలకు భద్రత లేనందున రవాణా నిలిచిపోనుంది.

జనవాక్యం

పంట బీమా ఏదీ?

పంట బీమా మొత్తం ప్రభుత్వమే చెల్లిస్తుందని ఎన్నికల వాగ్దానం చేసి, పంట నష్టపోయిన రైతులకు మొండి చేయి చూపించడం దుర్మార్గం. బాధతో, దిక్కు తోచని స్థితిలో న్యాయం చేయమని రోడ్డెక్కిన రైతులపై కేసులు పెట్టడంతో పాలకులకు ప్రజా రంజకంగా పాలించడం చేతకాదని మరోసారి రుజువైంది. నమ్మి భూములిచ్చిన అమరావతి రైతులను పోలీసులు లాఠీలతో వేధిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు సంఘటితమై పాలకుల నిరంకుశ పోకడలను గట్టిగా ఎదుర్కోవాలి. ఇందుకు రైతు సంఘాలు మరింత చురుకైన పాత్ర పోషించాలి!

- గడ్డిపాటి శ్రీహరి, పోతునూరు.

ఉత్తుత్తి నొక్కుళ్లే

రాష్ట్ర ముఖ్యమంత్రి గారు ఎంతో ఆర్భాటంగా చివరి విడత అమ్మ ఒడి పథకం నిధుల విడుదలకు మారుమూల కురుపాం వెళ్ళి మరీ బటన్ నొక్కారు. అయితే పదిహేను రోజులు గడిచినా సగం మంది ఖాతాల్లో కూడా డబ్బు జమ కాలేదు! లబ్ధిదారులు రోజూ పనులు మానుకొని బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. ఎప్పుడు వస్తాయో, అసలు వస్తాయో రావో తెలియని అయోమయ పరిస్థితి (పనులకు వెళ్తే ఎంతోకొంత పైకమైనా వస్తుంది)!ఇలా బటన్ నొక్కుడు పేరుతో సొంత పత్రికలో భారీ ప్రకటనలు ఇచ్చుకోవడం మరో ఫార్సు! ఈ బటన్ నొక్కుడు కార్యక్రమం ఏర్పాటు చేసిన ప్రాంతంలో చెట్లు నరుకుడు, ప్రజలపై నిర్బంధాలు, కర్ఫ్యూ వాతావరణంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు! ఈ పరిస్థితి మారేదెన్నడో!

- జి.భారతీదేవి, ఏలూరు, ఏలూరు జిల్లా.

మీ రచనలను పంపాల్సిన మెయిల్ : editpageps@ gmail.com

టమాటా ధరలు ఆందోళనకరమే : ఆర్‌బిఐ

న్యూఢిల్లీ : దేశంలో విపరీతంగా పెరుగుతోన్న టమాటా ధరలు ఆందోళన కలిగిస్తున్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) తన మాస బులిటెన్‌లో పేర్కొంది. గత కొన్ని రోజులుగా భారీగా పెరుగుతోన్న టమాటా ధరల వల్ల ద్రవ్యోల్బణం ఎగిసిపడొచ్చని పేర్కొంది. టమాటా ధరల పెరుగుదల నుండి ఇతర వస్తువుల ధరలు హెచ్చు కావడంతో ద్రవ్యోల్బణాన్ని తగ్గించడం సవాల్‌గా మారొచ్చని పేర్కొంది. సరఫరా చెయిన్‌లను మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఉందని సూచించింది. జూన్‌లో కిలో టమాటా రూ.40గా పలకగా.. జులై తొలి వారం నుంచి రూ.100 పైకి ఎగిసి.. కొన్ని ప్రాంతాల్లో రూ.200 చేరిన ఘటనలు ఉన్నాయి.

ఢిల్లీ మద్యం కుంభకోణంలో మాగుంట రాఘవకు బెయిల్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం కుంభకోణంలో నిందితుడిగా ఉన్న ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి కుమారుడు మాగుంట రాఘవకు ఢిల్లీ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. అనారోగ్య కారణాలపై మాగుంట రాఘవకు నాలుగు వారాలపాటు న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. అయితే ఈసారి రాఘవకు బెయిల్ ఇవ్వడాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) వ్యతిరేకించలేదు. గతంలో ఢిల్లీ హైకోర్టు రాఘవకు బెయిల్ ఇవ్వగా, దాన్ని వ్యతిరేకిస్తూ ఇడి సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. కాగా.. మంగళవారం మాగుంట రాఘవకు ఢిల్లీ హైకోర్టు బెయిల్ ఇవ్వడాన్ని మాత్రం ఇడి వ్యతిరేకించలేదు. విచారణకు ఎప్పుడు పిలిచినా ఇడి ముందు హాజరుకావాలని రాఘవను ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. ఢిల్లీ, లేదా చెన్నై కార్యాలయాల్లో విచారణకు హాజరుకావచ్చని తెలిపింది. చెన్నై వదిలి వెళ్లవద్దని ఢిల్లీ హైకోర్టు షరతు విధించింది. ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఫిబ్రవరి 10న రాఘవను ఇడి అరెస్టు చేసిన విషయం తెలిసిందే. సౌత్ గ్రూప్‌లో కీలక పాత్రధారిగా రాఘవను ఇడి పేర్కొంది. ఢిల్లీలో పలు జోన్లకు రాఘవ ప్రాతినిధ్యం వహిస్తున్నారని ఆరోపించింది.

మూర్ఛతో చెరువులో పడి విద్యార్థిని మృతి

ప్రజాశక్తి - సీతానగరం (పార్వతీపురం మన్యం జిల్లా)

సైకిల్‌పై వెళ్తుండగా మూర్ఛ రావడంతో చెరువులో పడి విద్యార్థిని మృతి చెందిన సంఘటన పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బూర్జ పంచాయతీ పరిధిలోని ఆవాలవలస గ్రామానికి చెందిన ఆవాల శ్రావణి (14) గాదిలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఎప్పటిలాగే సైకిల్‌పై పాఠశాలకు వెళ్తుండగా మార్గ మధ్యలో మూర్ఛ (ఫిట్స్) రావడంతో చెరువులో పడింది. గమనించిన మరో విద్యార్థిని శ్రావణి కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. స్థానికులు, కుటుంబ సభ్యులు చెరువులో దిగి విద్యార్థినిని బయటకు తీశారు. అప్పటికే శ్రావణి మృతి చెందింది. ఒక్కగానొక్క కుమార్తె మరణించడంతో ఆమె తల్లిదండ్రులు సత్యం, పార్వతీ కన్నీరుమున్నీరయ్యారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మిడిల్ లెవెల్ ఆఫీసర్స్

- కమిటీ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎస్‌సి, ఎస్‌టి అధికారుల పదోన్నతుల విషయంలో మిడిల్ లెవెల్ ఆఫీసర్స్ కమిటీ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని కెవిపిఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డికి వినతిపత్రం పంపారు. రాష్ట్ర సచివాలయంలో జరిగిన మిడిల్ లెవెల్ ఆఫీసర్స్ కమిటీ సమావేశంలో రెగ్యులర్ పదోన్నతుల్లో అవకాశం ఇవ్వకుండా అసిస్టెంట్ సెక్రటరీ క్యాడర్ స్థాయి నుండి అడిషనల్ క్యాడర్ స్థాయి వరకు సృష్టించిన 23 సూపర్ న్యూమరర్ పోస్టులలో ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగులకు పదోన్నతులతో నియమించాలని ప్రతిపాదించడం సరైంది కాదన్నారు. 85వ రాజ్యాంగ సవరణ ప్రకారం ఎస్‌సి, ఎస్‌టి పదోన్నతులలో జిఓలు 5, 26ను అమలు చేయాలని కోరారు. ఎస్‌సి, ఎస్‌టి అధికారుల పదోన్నతులపై వున్న కోర్టు ఉత్తర్వులను కూడా ఉల్లంఘిస్తూ దళిత అధికారులకు అన్యాయం చేస్తున్నారని అన్నారు.

సామ్రాజ్యవాద ధోరణిని ఖండించే మార్పు రావాలి!

బ్రస్సెల్స్‌లో ముగిసిన ప్రజా సదస్సు

బ్రస్సెల్స్ : బెల్జియం రాజధాని బ్రస్సెల్స్‌లో ప్రజా సదస్సు (పీపుల్స్ సమ్మిట్) మంగళవారం ముగిసింది. లాటిన్ అమెరికా, యూరప్‌లకు చెందిన సామాజిక ఉద్యమాలు, ప్రగతిశీల శక్తులు ఈ సదస్సులో పాల్గొన్నాయి. ఒకపక్క సెలాక్, ఇయు దేశాల ప్రభుత్వాధినేతల మూడవ సమావేశం జరుగుతున్న సమయంలోనే మరోపక్క ఈ సామాజిక సదస్సు కూడా జరిగింది. సదస్సు చివరి రోజైన మంగళవారం జరిగిన చర్చలకు బ్రస్సెల్స్‌కి చెందిన ఫ్రీ యూనివర్శిటీ ఆతిథ్యమిచ్చింది. కొత్త కొత్త రూపాల్లో తలెత్తుతున్న యుద్ధం, నిరసన తెలిపే హక్కులపై చర్చలు జరిగాయి. ముగింపు సమావేశంలో తుది డిక్లరేషన్‌ను చదివి వినిపించారు.

సోమవారం నాటి సదస్సులో క్యూబా అధ్యక్షుడు మిగ్వెల్ డియాజ్ కానెల్ మాట్లాడుతూ, లాటిన్ అమెరికా, కరేబియా దేశాల్లో ప్రగతిశీల, వామపక్ష శక్తులపై సామ్రాజ్యవాద దురాక్రమణలను తీవ్రంగా తిరస్కరించారు. ప్రస్తుతం తాము నేతృత్వం వహిస్తున్న సమాజాల్లోని నయా ఉదారవాద అనుభవాల ప్రభావాలను సరిదిద్దడానికి గానూ ఈ ప్రభుత్వాలు తమదైన కొత్త పంథాలను చూపిస్తున్నాయని అన్నారు. తమ దేశంపై సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న అమెరికా మానవ హక్కుల ఉల్లంఘనలను ఆయన ఈ సందర్భంగా ఉదహరించారు. తమ దేశంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు దీన్నొక రాజకీయ సాధనంగా వాడుతూ సమర్ధించుకుంటున్నారని విమర్శించారు. అమెరికా ఆడే ఈ నీచపు క్రీడలో క్యూబా ఒక్కటే బాధితురాలు కాదని అన్నారు.

కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో సదస్సులో ప్రసంగిస్తూ, ఈ పరిస్థితులు మారాలంటే మొత్తంగా వాతావరణంలో మార్పు రావాల్సిన అవసరం వుందని అన్నారు. ప్రస్తుత ఉత్పాదకతా వ్యవస్థ, అధికార స్థానాలు, లాభాలు, పెట్టుబడిదారుల దురాశలతో ముడిపడిన సమీకరణ క్రమాలు ఇవన్నీ కలిసి మొత్తంగా వ్యవస్థనే మింగేసే శక్తిని ఉత్పత్తి చేస్తున్నాయని పెట్రో పేర్కొన్నారు. ఒకే సమయంలో అనేక సంక్షోభాలు - వ్యాధులు, యుద్ధం, ఆర్థిక సంక్షోభం, వాతావరణ సంక్షోభం, దారిద్ర్యం, ఆకలి వంటి సమస్యలన్నీ - చుట్టుముట్టడంతో అంతర్జాతీయంగా బహుళ సంక్షోభం నెలకొనే ప్రమాదముందని పెట్రో హెచ్చరించారు.

డిపిటి 3 వ్యాక్సినేషన్‌లో భారత్ ఆల్‌టైమ్ రికార్డు

- డబ్ల్యూహెచ్‌ఒ అభినందనలు

న్యూఢిల్లీ : డిఫ్తీరియా, పెర్టుసిస్, టెటానస్ వ్యాక్సిన్ల మూడో డోసు (డిపిటి 3) వ్యాక్సినేషన్‌లో భారత్ కొత్త రికార్డు నమోదు చేసింది. గత ఏడాది 2022లో ఈ వ్యాక్సినేషన్ కవరేజ్ 93 శాతానికి పెరిగింది. 2019లో నమోదు చేసిన రికార్డు 91 శాతం కవరేజ్‌ను ఇది అధిగమించింది. 2022 జాతీయ ఇమ్యునైజేషన్ కవరేజీని మంగళవారం ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఒ), యూనిసెఫ్ విడుదల చేశాయి. మొత్తంగా ఆగ్నేసియా ప్రాంతంలో డిపిటి3 కవరేజ్ రేటు 91 శాతంగా నమోదయింది. వ్యాక్సినేషన్ కవరేజ్ కరోనా మహమ్మారి ముందు స్థాయికి చేరుకోవడంపై హర్షం వ్యక్తం చేసింది. ముఖ్యంగా భారత్, ఇండోనేషియాలకు అభినందనలు తెలిపింది. ఈ ప్రాంతంలో డిపిడి డోసు ఒక్కటి కూడా తీసుకొని చిన్నారుల సంఖ్య 2021లో 4.6 మిలియన్లగా ఉండగా, 2022లో ఈ సంఖ్య సగానికి అంటే 2.3 మిలియన్లకు తగ్గడంపై భారత్, ఇండోనేషియాల కృషి ఎంతో ఉందని డబ్ల్యూహెచ్‌ఒ తెలిపింది. డబ్ల్యూహెచ్‌ఒ ఆగ్నేయాసియా ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ పూనమ్ ఖేత్రపాల్ సింగ్ ఈ విషయంపై మాట్లాడుతూ భూమి మీదకు వచ్చే ప్రతీ బిడ్డ సాధారణ రోగనిరోధకతతో ఉండి ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షించబడాలని అన్నారు. ఇండోనేషియాలో డిపిడి3 వ్యాక్సినేషన్ కవరేజ్ 2022లో 85 శాతంగా నమోదయిందని చెప్పారు.

సమర్ధవంతంగా వలంటీర్ల వ్యవస్థ : అంబటి రాయుడు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో వలంటీర్ల వ్యవస్థ సమర్ధవంతంగా పనిచేస్తోందని ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు అన్నారు. గుంటూరులోని తూర్పు నియోజకవర్గంలో మంగళవారం ఆయన పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఒక వ్యవస్థలో ఒకరిద్దరు తప్పు చేస్తే మొత్తం వ్యవస్థను తప్పుపట్టడం తగదన్నారు. తప్పులు చేసేవారు అన్నిరంగాల్లో ఉంటారని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్ల ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. కరోనా వల్ల రాష్ట్రం రెండేళ్లపాటు అభివృద్ధిలో వెనుకబడిందని ఇప్పుడే క్రమంగా వేగం పుంజుకుంటుందని చెప్పారు. నగరంలోని సమస్యలపై తాను అధ్యయనం చేస్తున్నట్టు వివరించారు. లాలాపేట, సంగడిగుంట, కూరగాయల మార్కెట్ ప్రాంతాలను సందర్శించారు. వ్యాపారులతో ముచ్చటించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. వైసిపి నాయకులు నూరి ఫాతిమా, పలువురు కార్పొరేటర్లు, వ్యాపారులు పాల్గొన్నారు.

మార్గదర్శి కేసు విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మార్గదర్శిపై దాఖలైన పిటిషన్ల విచారణ వాయిదా పడింది. మార్గదర్శిపై ఉండవల్లి అరుణ్ కుమార్, ఎపి ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. మార్గదర్శి తరపున సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే వాదనలు వినిపించారు. ఎపి ప్రభుత్వానికి పిటిషన్ వేసే అర్హత లేదని అన్నారు. దీనిని ఎపి ప్రభుత్వం, ఉండవల్లి అరుణ్ కుమార్ తరపున సీనియర్ న్యాయవాది సిఎస్ వైద్యనాథన్, న్యాయవాది అల్లంకి రమేష్ వ్యతిరేకించారు. దీనిలో ఎపి, తెలంగాణ రాష్ట్రాలు పార్టీలుగా ఉన్నాయని, తెలంగాణ ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేయలేదని అన్నారు. అయితే వచ్చే విచారణలోపు తెలంగాణ కౌంటర్ దాఖలు చేయాలని, రిజాయిండర్‌లు కూడా దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణను సెప్టెంబరు 25కు వాయిదా వేసింది. అలాగే తెలంగాణ హైకోర్టులో ఉన్న కేసులను ఎపికి బదిలీ చేయాలని దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ ఎస్‌వి భట్టీతో కూడిన ధర్మాసనం విచారించింది. తాను అదే రాష్ట్రానికి చెందిన వాడినని, అందుకే ఈ పిటిషన్‌ను వేరే ధర్మాసనం ముందు ఉంచాలని జస్టిస్ ఎస్‌వి భట్టీ అన్నారు. నాట్ బిఫోర్ మి అంటూ పేర్కొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీలో మాయాజాలం..!

- భీమవరం ప్రాజెక్టులో స్థానికేతరులకు పోస్టులు
- అధికారుల తీరుపై విమర్శల వెల్లువ

ప్రజాశక్తి- భీమవరం రూరల్

స్త్రీ, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు, హెల్పర్ల పోస్టుల నియామకంలో అధికారులు జిమ్మిక్కులు చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ పోస్టుల భర్తీలో విద్యార్హత, వయస్సుతోపాటు స్థానికులకు పోస్టు కేటాయించాలనేది నిబంధన. అయితే ప్రభుత్వ నిబంధనలకు నీళ్లొదిలిన భీమవరం ప్రాజెక్టు అధికారులు ఇష్టానుసారం నియామకాలు చేపడుతున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి విచారణ చేపడితే పోస్టులు స్థానికులకే కేటాయించారా, లేక ఇతర ప్రాంతాల వారితో భర్తీ చేశారా అనేది వెలుగులోకి వస్తుందని పలువురు చెబుతున్నారు. ప్రాజెక్టు పరిధిలో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన పలువురు అంగన్‌వాడీ పోస్టుల భర్తీ కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురుచూశారు. అంగన్వాడీ పోస్టుల భర్తీకి ప్రకటన రాగానే పలువురు సంబంధిత పత్రాలు తీసుకుని ఒకటికి రెండుసార్లు ప్రాజెక్టు కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరిగి దరఖాస్తులు అందిస్తున్నారు. అయితే అంగన్వాడీ పోస్టుల భర్తీలో రాజకీయ పలుకుబడితోపాటు పెద్దఎత్తున సొమ్ము ముట్టజెప్పే వారికే అవకాశం దక్కుతుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రాజెక్టు అధికారులు కాసులకు కక్కుర్తిపడి ఖాళీ అయిన పోస్టుల వివరాలను బట్టి ఫలానా వార్డులో కార్యకర్త లేదా హెల్పర్ పోస్టు ఉంటుందని ముందుగానే రికమండేషన్ అభ్యర్థులకు తెలియజేస్తున్నట్లు సమాచారం. దీంతో వారు ఆ ప్రాంతంలోని ఏదోక డోర్ నెంబర్‌కు ఆధార్ మార్చుకోవాలని సూచిస్తున్నారు. ఈ ప్రక్రియ అంతా పూర్తయ్యి అన్నీ సిద్ధం చేసుకున్నాక భర్తీ ప్రక్రియ తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. కొత్త పోస్టుల్లో భీమవరం అర్బన్‌కు చెందిన ఒక హెల్పర్‌కు కార్యకర్త పోస్టు ఇచ్చేందుకు ప్రాజెక్టు అధికారులు ముందుగానే ఆమెచే రిజైన్ చేయించి అన్నీ సిద్ధం చేసినట్లు సమాచారం. ఆమె కంటే కొందరు సీనియర్ హెల్పర్లు ఉన్నప్పటికీ ఆమెకు మాత్రం నేరుగా కార్యకర్త పోస్టు ఇచ్చేందుకు అధికారులు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. భీమవరం అర్బన్ పరిధిలోని వేరే వార్డులో ఉన్న అంగన్వాడీ సెంటర్లో కార్యకర్త పోస్టు ఖాళీ కావడంతో ఆమె ఆధార్ అడ్రస్‌ను ముందుగానే ఆ ప్రాంతానికి మార్చుకోవాలని అధికారులే ఆమెకు సలహా ఇచ్చినట్లు తెలుస్తోంది.

కెన్యాలో కొత్త పన్ను చట్టానికి వ్యతిరేకంగా భారీ నిరసనలు

- 23 మంది మృతి
- చట్టాన్ని స్వాగతించిన అమెరికా, ఐఎంఎఫ్

నైరోబి : కెన్యా ఫైనాన్స్ యాక్ట్ -2023లో తీసుకువచ్చిన కొత్త పన్ను చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ప్రజలు భారీఎత్తున నిరసనలు చేపడుతున్నారు. ఈ నిరసనలు, ఆందోళనలపై పోలీసులు అణచివేతకు దిగడంతో ఇప్పటివరకు 23మంది మరణించినట్లు తెలుస్తోంది. జీవన వ్యయ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేసే ఈ చట్టాన్ని ప్రజలు వ్యతిరేకిస్తుంటే అమెరికా, ఐఎంఎఫ్ మాత్రం స్వాగతించాయి. కెన్యాలో అమెరికన్లు పెట్టుబడులు పెట్టేందుకు ఈ చట్టం భద్రత కల్పిస్తుందని వ్యాఖ్యానించాయి. దేశంలో చోటు చేసుకుంటున్న హింస, అల్లర్లు, అనవసరపు బల ప్రయోగాల పట్ల ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల కార్యాలయం (ఒహెచ్‌సిహెచ్‌ఆర్) ఆందోళన వ్యక్తం చేసింది. పోలీసులు అణచివేత చర్యలకు దిగుతున్నా నిరసనలు ఏ మాత్రమూ ఆగడం లేదు. ఈ చట్టంలో తీసుకువచ్చిన పన్నులతో తమ పరిస్థితి మరింత దారుణంగా తయారవుతోందని ఆందోళనకారులు ఫిర్యాదు చేస్తున్నారు. ఇంధన ఉత్పత్తులపై వాల్యూ యాడెడ్ ట్యాక్స్ (వ్యాట్)ను రెట్టింపు చేయడం అన్నింటికంటే అప్రజాస్వామిక చర్య అని వారు విమర్శిస్తున్నారు. ప్రజల ఆందోళనలు ఏ మాత్రమూ పట్టించుకోని రీతిలో అమెరికా ఈ చర్య పట్ల హర్షం వ్యక్తం చేసింది. చట్టాన్ని స్వాగతిస్తున్నట్లు కెన్యాలో అమెరికా రాయబారి మెగ్ వైట్‌మన్ ప్రకటించారు. హైకోర్టు ఈ చట్టం అమలును జూన్ 30న తాత్కాలికంగా ఆపింది, ఆ తర్వాత జులై 10న నిరవధికంగా నిలుపుచేసింది.

అమెరికా, చైనా మధ్య సుస్థిర సంబంధాలకు చర్యలు

- వాంగ్‌యితో జాన్ కెర్రీ భేటీ

బీజింగ్ : ప్రపంచంలోనే రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన అమెరికా, చైనాల మధ్య సంబంధాలను స్థిరీకరించేందుకు బైడెన్ ప్రభుత్వం కట్టుబడి వుందని అమెరికా వాతావరణ విభాగ రాయబారి జాన్ కెర్రీ చైనాకు తెలియచేశారు. ప్రస్తుతం బీజింగ్‌లో పర్యటిస్తున్న కెర్రీ, చైనా కమ్యూనిస్టు పార్టీ విదేశీ సంబంధాల అధిపతి వాంగ్ యితో భేటీ అయ్యారు. ప్రపంచానికి గణనీయమైన మార్పు తీసుకురాగల ప్రయత్నాలను రెండు దేశాలు కలిసి సాధించగలవని బైడెన్ ఆశిస్తున్నారని చెప్పారు. ఇటీవల కాలంలో రెండు దేశాల మధ్య సంబంధాలు బాగా దెబ్బతిన్నాయి. టారిఫ్‌లపై వివాదం, సాంకేతికత అందుబాటులోకి రావడం, మానవ హక్కులు ఇలా పలు అంశాలపై ఇరు పక్షాల మధ్య సంబంధాలు క్షీణించాయి. తొలుత సమావేశాన్ని ప్రారంభిస్తూ వాంగ్, కమ్యూనికేషన్ సరిగా లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తాయని, చర్చల క్రమాన్ని పునరుద్ధరిస్తే ఏ సమస్యకైనా మనం సక్రమమైన పరిష్కారం కనుగొనగలమని చైనా నమ్ముతుందని చెప్పారు. కొన్నిసార్లు చాలా చిన్న సమస్యలే పెద్దవిగా మారతాయని అన్నారు. సమాన ప్రాతిపదికన చర్చలు జరగాలని ఆయన స్పష్టం చేశారు. మరింత మెరుగైన రీతిలో సంబంధాలను మార్చుకోవడానికి ఇదొక అవకాశమని కెర్రీ వ్యాఖ్యానించారు. జిన్‌పింగ్‌తో సంబంధాలకు బైడెన్ ఎంతో విలువనిస్తారని, జిన్‌పింగ్ కూడా అలాగే విలువనిస్తారని భావిస్తున్నట్లు కెర్రీ చెప్పారు. అనంతరం కొత్తగా ప్రధానిగా నియమితులైన లీ కియాంగ్‌ను కెర్రీ కలుసుకున్నారు. గ్లోబల్ వార్మింగ్ వల్ల మరింత తీవ్రమవుతున్న సవాలుపై చైనా, అమెరికా మరింత సన్నిహితంగా సహకరించుకోవాలన్నారు.

క్యూబాపై అమెరికా ఆంక్షలకు అంతర్జాతీయ సామాజిక కార్యకర్తల ఖండన

హవానా : క్యూబాపై సుదీర్ఘంగా ఆరు దశాబ్దాల పాటు సాగుతున్న అమెరికా ఆంక్షలను 20కి పైగా లాటిన్ అమెరికా, కరేబియా దేశాలు, యురోపియన్ దేశాలకు చెందిన సామాజిక కార్యకర్తలు తీవ్రంగా నిరసించారు. ఈ ఆంక్షలతో క్యూబాకు ఔషధాలు, సాంకేతికత, అంతర్జాతీయ మార్కెట్లు అన్నీ అందుబాటులో లేకుండా పోతున్నాయని బొలీవియా ఎంపి అమండా ఇరియర్టె విమర్శించారు. ఇకనైనా ఈ నేరపూరితమైన విధానానికి స్వస్తి పలకాల్సి వుందని అన్నారు. 150మందికి పైగా సామాజిక కార్యకర్తలు సోమవారం నిరసన తెలియచేశారు. స్పానిష్ కార్యకర్త పోల్ ఇగ్లెసియా మాట్లాడుతూ, క్యూబాపై అమెరికా ఆంక్షలను తాను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నానన్నారు. శాంతి, న్యాయం కోసం జరుగుతున్న ప్రపంచ పోరాటానికి క్యూబా ద్వీపం ఒక ఆశాకిరణమని ఆయన వ్యాఖ్యానించారు. మోంకడా రక్షణ దళంపై దాడికి 70ఏళ్ళు పూర్తవుతున్న సందర్భంగా ఈ నెల 26న శాంటియాగో డీ క్యూబా తూర్పు ప్రావిన్స్‌లో జరగనున్న కార్యక్రమానికి ఈ సామాజిక కార్యకర్తలు హాజరవుతారు. 1962లో మొదటిసారిగా క్యూబాపై అమెరికా ఆంక్షలు విధించింది. ఆ తర్వాత ట్రంప్ ప్రభుత్వం ఆంక్షలను మరింత ముమ్మరం చేసింది. మొత్తంగా ద్వీపానికి వ్యతిరేకంగా 240కిపైగా ఆర్థిక చర్యలు తీసుకున్నారు.

వైద్య కళాశాల పనులు వేగవంతం

కాంట్రాక్టు సంస్థకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి-విజయనగరం

ప్రభుత్వ వైద్య కళాశాల పనులు వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలని కలెక్టర్ నాగలక్ష్మి.. నిర్మాణ సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. విద్యా సంవత్సరం ప్రారంభమై వైద్య విద్యార్థులు వచ్చేలోగా పెండింగ్‌లోని పనులన్నీ పూర్తికావాలన్నారు. అదే సమయంలో పనుల నాణ్యతలో ఎక్కడా రాజీ లేకుండా చర్యలు చేపట్టాలని వైద్య ఆరోగ్య ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గాజులరేగ సమీపంలో నిర్మాణంలోని ప్రభుత్వ వైద్య కళాశాల భవనాలను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. గత, ప్రస్తుత పర్యటనల సమయానికి పనుల్లో సాధించిన ప్రగతిని తెలుసుకున్నారు. వైద్య కళాశాలలో ప్రథమ సంవత్సరంలో చేరే విద్యార్థులకు అవసరమైన తరగతి గదులు, లేబొరేటరీలు ఏ దశలో ఉన్నదీ పరిశీలించారు. లెక్చర్ హాళ్లు, లేబొరేటరీలు ఈ నెల 25 నాటికి పనులు పూర్తిచేసి సిద్ధం చేస్తామని నిర్మాణ సంస్థ ఎన్‌సిసి మేనేజర్ శ్రీనివాస్ వివరించారు. బోధన సిబ్బంది గదులను 27కు పూర్తిచేస్తామని తెలిపారు. ఫిజియాలజీ, ఎనటమీ గదులు మాత్రమే కొంత పనులు పెండింగ్ ఉన్నాయని, వాటిని కూడా నెలాఖరుకల్లా పూర్తిచేస్తామన్నారు. ప్రస్తుతం నిర్మాణ పనుల్లో 720 మంది కార్మికులు ఉన్నారని, నిర్మాణ పనులకు అవసరమైన పరికరాలు, సామగ్రి అంతా సిద్ధంగా ఉందని వివరించారు. విద్యార్థుల హాస్టల్ భవనాలను, డైనింగ్ గదులను కూడా కలెక్టర్ పరిశీలించారు. 27వ తేదీకి వీటి నిర్మాణం పూర్తిచేయగలమని నిర్మాణ సంస్థ ప్రతినిధులు వివరించారు. లెక్చర్ హాలులో ఇంటరాక్టివ్ ప్యానల్, స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కళాశాలకు నీటి సరఫరాపై కలెక్టర్ ఆరా తీశారు. ఇప్పటికే బోర్లు వేశామని, నెలాఖరుకల్లా నీటిసరఫరా పనులు పూర్తవుతాయని ఇంజనీర్లు వివరించారు. వైద్య కళాశాలలో ప్రవేశానికి నిర్మించనున్న రహదారిపై కలెక్టర్ ప్రశ్నించగా, రోడ్డు నిర్మాణానికి అంచనాలు రూపొందించామని డిఇ కుమార్ చెప్పారు. ఈ పర్యటనలో వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా.పద్మలీల, ఎపిఎంఎస్ఐడిసి డి.ఇ. కుమార్, వైద్య కళాశాల

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
గన్నవరం (01541) బ్రాంచి : జిఎన్‌టి రోడ్డు, రాయ్ నగర్, గన్నవరం, కృష్ణా జిల్లా - 521101

NOTICE UNDER SECTION 13 (2) OF ACT 54 OF 2002 FOR ENFORCEMENT OF SECURITY INTEREST

డిమాండ్ నోటీసు

టు : ఋణగ్రహీత : శ్రీమతి సూరం విజయలక్ష్మి, భర్త : విజయ కుమార్, 13/18, శ్రావతి స్కూల్ బజారు, రైల్వే స్టేషన్ రోడ్డు, గన్నవరం, కృష్ణా జిల్లా. కో-అప్లికెంట్ : 1) శ్రీ సూరం విజయ కుమార్, తండ్రి : విలియంపాల్, 13/18, శ్రావతి స్కూల్ బజారు, రైల్వే స్టేషన్ రోడ్డు, గన్నవరం, కృష్ణా జిల్లా. 2) శ్రీ దాసరి రాజశేఖర్, తండ్రి: సోమయ్య, హెచ్.నెం. 10-261, పంచాయితీ ఆఫీస్ వెనుకవైపు, గన్నవరం, కృష్ణా జిల్లా.

నేచర్ ఆఫ్ లిమిట్	లిమిట్స్	వ్యవధి	ది. 11-04-2023 నాటికి బకాయి మొత్తము (రూ.)
Term Loan 015430100237586	Rs. 15,00,000/-	2018-2023	Rs. 17,81,719-33

ప్రాథమిక హామీ : ఆర్.ఎస్.నెం. 119 వద్ద అవిభక్త వాటి 42.00 చ॥గ॥లతో కలిపి మొత్తం 105 చ॥గ॥ల విస్తీర్ణంలోని భూమి నందు డి.కె. ఎన్‌క్లేవ్ లో 690 చ॥అ॥ ల విస్తీర్ణంగల బిల్టప్ ఏరియా, కామన్ ఏరియాతో కలిపి ఫస్ట్ ఫ్లోర్ నందు గల నివాస ఫ్లాట్ నెం. హెచ్. 82 ఎఫ్. హద్దులు : తూర్పు : ఫ్లాట్ నెం. హెచ్. 81ఎఫ్, దక్షిణం : పొరుగువారి భూమి, పడమర : ఫ్లాట్ నెం. హెచ్. 83 ఎఫ్, ఉత్తరం : రోడ్డు.

అమ్మా / అయ్యా,
విషయం : ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టము ప్రకారము నోటీసు - మీరు మా నుండి పొందిన ఋణ సౌకర్యములకు సంబంధించి - నిరర్ధక ఆస్తులుగా వర్గీకరణ.
ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా మీరు టర్మ్ లోన్ క్రింద మా గన్నవరం బ్రాంచి వద్దనున్న మీ ఋణ బకాయిలను / వడ్డీని చెల్లించుటలో విఫలమైనందున మీ ఖాతాను ది. 11-04-2023 న నిరర్ధక ఆస్తిగా (NPA) వర్గీకరించ బడింది. ఎగువ తెలిపిన తేదిన మీ ఋణ ఖాతాల బకాయిలు మొత్తము పైన తెలుప బడినవి. అనేక మార్లు విన్నపములు చేసినప్పటికీ, మీరు మీ ఖాతాలోని బకాయి మొత్తములను చెల్లించలేదు / మీ ఋణములను చెల్లించలేదు. అందువలన సెక్యూరిటైజేషన్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 యొక్క సెక్షన్ 54 ప్రకారము మీ యొక్క బకాయి మరియు ఋణ పత్రములో అంగీకరించబడిన నియమ నిబంధనలలో ఉన్న ఒప్పందపు రేటు ప్రకారము పైన తెలుపబడిన బకాయి తేది తదుపరి నెలవారి వడ్డీ మరియు ఇతర ఖర్చులతో సహా ఈ నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసి ఉంటుందని, అట్లు చేయుటలో విఫలమైనచో మీరు మా బ్యాంకుకు హామీ ఇచ్చిన ఆస్తులపై సదరు చట్టం ప్రకారం లభించు ఏవేని లేదా అన్ని హక్కులను ప్రయోగించవలసి ఉంటుందని తెలియజేయడమైనది.
1) మీరు సదరు బకాయిలను 60 రోజులలోగా తిరిగి చెల్లించుటలో విఫలమైనచో, బ్యాంకు వారు సదరు చట్టం ప్రకారం వారికి సంక్రమించిన అన్ని హక్కులను వినియోగించి హామీ ఇవ్వబడిన ఆస్తుల విక్రయ ధనముతో బకాయిలను పూర్తిగా చెల్లించబడనప్పుడు, మిగిలిన బకాయి సొమ్ము మీ నుండి రాబట్టుకొనుటకు, న్యాయస్థానము / డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ నందు తగు న్యాయపరమైన చర్యలు తీసుకోబడునని తెలియజేయడమైనది.
2) సదరు చట్టం యొక్క సెక్షన్ 13 (8) ప్రకారము ఈ నోటీసు పొందిన అనంతరం మీరు పైన చెప్పబడిన ఆస్తులను సాధారణ వ్యాపార కార్యకలాపాలు తప్ప బ్యాంకు వారి అనుమతి లేకుండా విక్రయించరాదు. మరియు లావాదేవీలు జరుపరాదు సదరు సెక్షన్‌లో నిబంధనలలో ఏ విధమైన అతిక్రమణ జరిగిన తీవ్ర పరిణామాలకు దారి తీస్తుందని గమనించగలరు.
SARFAESI చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) ప్రకారము ఋణగ్రహీత తనఖా ఆస్తిని గడువు లోపల విడిపించుకొనుటకు గాను దృష్టిసారించవలసి ఉన్నది.

తేది : 25-05-2023 సం/- ఆథరైజ్డ్ ఆఫీసర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

POONAWALLA HOUSING FINANCE
Apna Ghar, Apni Pehchan

పూనావాలా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
(గతంలో మాగ్మా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్)
రిజిష్టర్డు ఆఫీసు: 602, 6వ అంతస్తు, జీరో వన్ ఐటి పార్కు, ఎస్ఆర్ నెం.79/1, ఘోర్‌పడి, ముంధ్వా రోడ్, పూణే -411036

SARFAESI చట్టం 2002 యొక్క సెక్షన్ 13(2) కింద
డిమాండ్ నోటీసు

ఈ క్రింద ప్రస్తావించిన రుణగ్రహీత, సహ-రుణగ్రహీత, హామీదారులైన మీరు మీ యొక్క స్థిరాస్తి తాకట్టు పెట్టడం ద్వారా ఆస్తి సౌకర్యం(లు) పై పూనావాలా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో మాగ్మా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్) "యమ్ హెచ్ ఎఫ్ ఎల్" నుంచి హోమ్‌లోన్/లోన్స్ వినియోగించుకున్నారు. వీటిని తిరిగి చెల్లించుటలో మీరు విఫలమైనారు కావున మీ యొక్క లోన్/లు నిరర్థక ఆస్తులుగా వర్గీకరించడమైనది. మొత్తం బకాయిలను తిరిగి రాబట్టుకునేందుకు సెక్యూరిటైజేషన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్ 2002 యొక్క విభాగము 13(2) క్రింద దిగువ పేర్కొనబడిన రుణగ్రహీత/హామీదారులు యొక్క చివరిగా తెలిసిన చిరునామాకు డిమాండ్ నోటీసు జారీ చేయగా అవి అందజేయబడక తిరిగి వచ్చినందున ప్రత్యామ్నాయ మార్గంగా ఇందులో ఉన్న అంశాలను సెక్యూరిటీ ఇంట్రెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నిబంధనలు, 2002 యొక్క నిబంధన 3(1) తో చదివే చట్టంలోని సెక్షన్ 13(2) ప్రకారం ప్రచురించవలసి వచ్చినది. రుణగ్రహీత, సహ-రుణగ్రహీత, హామీదారులు సెక్యూరిటీలు, బకాయి మొత్తం, సెక్షన్ 13(2) క్రింద పంపిన డిమాండు నోటీసు తేదీ, అందులో పేర్కొన్న మొత్తం యొక్క వివరాలు ఈ క్రింది వివరించబడ్డాయి.

క్ర. సం.	రుణగ్రహీత, సహ-రుణగ్రహీత, హామీదారు పేర్లు మరియు రుణ మొత్తం	సెక్యూర్డ్ అసెట్ యొక్క వివరాలు	డిమాండ్ నోటీసు తేది	బకాయి మొత్తాలు రూ.లలో
3.	షేక్.రఫి, షేక్ జహరాబీ లోన్ మొత్తం: రూ.15,50,000/- వైడ్ లోన్ ఎకౌంట్ బేరింగ్ : HM/0053/H/16/100115	కృష్ణాజిల్లా విజయవాడ, విజయవాడ జిల్లా-రిజిష్ట్రీ, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, భవానీపురం యొక్క ఆర్.ఎస్.నం.63, మున్సిపల్ వార్డు నం.31/2, ప్లాట్ నం.117, మూల్యాంకనం నం.30187/4, మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ సైట్ పరిధిలో 216 చ.గ.లు. (180-59 చ.మీ.లు.) తో పాటు అందులో గుడిసె బేరింగ్ డో.నం.76-1-1/2, ఉన్న హద్దులు: తూర్పు: రోడ్డు, దక్షిణం: రోడ్డు, పడమర: ప్లాట్ నం.116, ఉత్తరం: ప్లాట్ నం.118.	10/07/2023	రూ.16,65,583.40/- (పదహారు లక్షల అరవై ఐదు వేల ఐదు వందల ఎనభై మూడు రూపాయల నలభై పైసలు మాత్రమే) తిరిగి చెల్లించే వరకు తదుపరి వడ్డీ @18% పి.ఎ.తో పొందడం.
4.	ఎర్రంశెట్టి విజయలక్ష్మి, రాజ రంగారావు ఎర్రంశెట్టి లోన్ మొత్తం: రూ.13,30,000/- లోన్ నం.: HM/0053/H/17/100343	కృష్ణాజిల్లా, పెనమలూరు మండలం, కానూరు గ్రామం యొక్క ఆర్.ఎస్.నం.23/ఐసి లో ఉన్న మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ సైట్ పరిధిలో 72.5 చ.గ.లు. లేదా 60.61 చ.మీ.లు. ఆర్.సి.సి. రూఫ్ నిర్మాణ భవనం మరియు ప్రస్తుతం ఎర్రంశెట్టి విజయలక్ష్మి, భర్త. రాజ రంగారావు స్వాధీనం క్రింద ఉన్న సరిహద్దుల ద్వారా హద్దులు: తూర్పు: కె.సుమతి మరియు ఇతరుల ఆస్తి, దక్షిణం: సిహెచ్.సుబ్బారావు ఆస్తి, పడమర: కోరటి శకుంతల ఆస్తి, ఉత్తరం: ఆర్.బలరాం కి చెందిన సైట్ మరియు రోడ్డు.	10/07/2023	రూ.14,59,356.47/- (పద్నాలుగు లక్షల యాభై తొమ్మిది వేల మూడు వందల యాభై ఆరు రూపాయల నలభై ఏడు పైసలు మాత్రమే) తిరిగి చెల్లించే వరకు తదుపరి వడ్డీ @15.80% పి.ఎ.తో పొందడం.
5.	సుఖవాసి సుధాకర్, సుఖవాసి శివపార్వతి లోన్ మొత్తం: రూ.15,96,826.45/- లోన్ నం.: HM/0053/H/18/100257	గుంటూరు జిల్లా, మంగళగిరి సబ్ రిజిస్ట్రీ, తాడేపల్లి మండలం, తాడేపల్లి మున్సిపాలిటీ ఏరియా తాడేపల్లి వద్ద ఉన్న ఆస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ స్థలం డో.నం.147/1&1ఎ లో కొలిచే 159.0 చ.గ.లు., ప్లాట్ నం.41, బ్లాక్ నం.12, మూల్యాంకనం నం.1143006751, డో.నం.12-1350 ఉన్న హద్దులు: తూర్పు: వి. మాలకొండారెడ్డి ఆస్తి, దక్షిణం: బాలి వెంకటేశ్వరరావు ఆస్తి, పడమర: 20 అ.లు. వెడల్పు ఉమ్మడి రోడ్డు, ఉత్తరం: ప్లాట్ నం.42 లో ఎమ్.రేణుక ఆస్తి.	10/07/2023	రూ.19,38,136.57/- (పంతొమ్మిది లక్షల ముప్పై ఎనిమిది వేల ఒక వందా ముప్పై ఆరు రూపాయల యాభై ఏడు పైసలు మాత్రమే) తిరిగి చెల్లించే వరకు తదుపరి వడ్డీ @17% పి.ఎ.తో పొందడం.

ఈ నోటీసు తేదీ నుంచి పైన ప్రస్తావించినట్లుగా డిమాండ్ చేసిన మొత్తం బకాయిలను భవిష్యత్తు వడ్డీతో పాటుగా 60 రోజులలోగా చెల్లించవలసినదిగా రుణగ్రహీత/లు, సహ-రుణగ్రహీత/లు, హామీదారులైన మీకు సమాచారం ఇవ్వడమైనది. విఫలమైన పక్షంలో దిగువ సంతకందారు చట్టం ప్రకారం పైన ప్రస్తావించిన సెక్యూరిటీ/లను స్వాధీనము చేసుకొనుటకు చర్యలు తీసుకుంటారని తెలియజేయడమైనది. సదరు చట్టంలోని సెక్షన్ 13(13) ప్రకారం పైన పేర్కొన్న సెక్యూరిటీలను మా అనుమతి లేకుండా విక్రయం లేదా లీజు ఇతర మార్గాల ద్వారా బదాలీ చేయకుండా మీరు నిరోధించబడినారని దయచేసి గమనించగలరు.

ప్రదేశం : ఆంధ్రప్రదేశ్
తేది: 19.07.2023

పూనావాలా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ తరపున
(గతంలో మాగ్మా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్)
అధీకృత అధికారి

పర్యాటక కేంద్రంగా 'రాంజల'

- అన్ని హంగులతో ప్రణాళికలు సిద్ధం చేయండి
- సబ్‌కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని,కర్నూలు

కర్నూలు జిల్లా ఆదోని పట్టణ శివారులోని పురాతన చెరువు రాంజలను పర్యాటక ప్రాంతంగా గుర్తించామని ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (ఆడా) ప్రత్యేకాధికారి, సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. మంగళవారం టూరిజం శాఖ అధికారి విజయ, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, తహశీల్దార్ వెంకటలక్ష్మితో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదోని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో రాంజల చెరువు ప్రాంతాన్ని అన్ని సదుపాయాలతో పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. పర్యాటకులకు ఆహ్లాదకరమైన పార్కులు తయారు చేసి మౌలిక సదుపాయాలైన రోడ్లు, తాగునీరు, టాయిలెట్లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

'గాజులదిన్నె' కూడా..

గోనెగండ్లలోని గాజులదిన్నె ప్రాజెక్టును ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ కింద ఆహ్లాదకరంగా రూపొందించి పర్యాటక కేంద్రంగా రూపొందిస్తామని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. మంగళవారం ప్రాజెక్టు వద్ద జరుగుతున్న పనులను పరిశీలించి వివరాలను తెలుసుకున్నారు. సివిల్ పనులు జరుగుతున్న తీరును అధికారులు ఆయనకు వివరించారు.

దక్షిణమధ్య రైల్వే
మమ్మల్ని @SCRailwayindia ద్వారా అనుసరించవచ్చు, ద.మ.రైల్వేలోని టెండరు ప్రకటనల వివరాలు మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in లో చూడవచ్చు.

బహిరంగ ఇ-టెండరు ప్రకటన నం. డిఆర్ఎం/వర్క్స్/బిజడ్ఎ/19/2023 తేది: 14.07.2023 PUB/0787

భారత రాష్ట్రపతి తరపున, క్రింది సంతకందారు దిగువ పనుల కొరకు ప్రతి దానికి ఎదురుగా పేర్కొనబడిన తేదిన 15-00గం.ల వరకు ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

క్ర.సం.:1, టెండరు నం.: ఇ-37-ఈస్ట్-బిజడ్ఎ-2023, పని వివరాలు: పని పేరు: విజయవాడ డివిజన్: ఎస్‌డబ్ల్యు-1: కెఐ-బిజడ్ఎ సెక్షన్: 2.695కి.మీ.ల పూర్తి దూరం కొరకు 1660 సాంద్రతతో పిఎస్‌సి6 స్లీపర్స్ పై ప్రస్తుతమున్న 52కెజి/60కెజి/90యుటిఎస్ రేయిల్స్‌ను కొత్త 60కెజి/ఆర్260 రేయిల్స్ (ఎల్‌డబ్ల్యుఆర్) యొక్క టిఆర్ఆర్(పి), **ఎస్‌డబ్ల్యు-2)** (1) బిజడ్ఎ యార్డు- 8.505కి.మీ.ల పూర్తి దూరం కొరకు 300మి.మీ.లకు బలాస్ట్ కుషన్ పెంచుట మరియు బలాస్ట్ యొక్క డీప్ స్క్రీనింగ్ మరియు రికూప్మెంట్‌తోసహా పిఎస్‌సి న్యూ వైడర్ బేస్ స్లీపర్స్ 1660నం.లు/కి.మీ.ల పై ప్రస్తుతమున్న 90ఆర్/52కేజి(ఎస్‌హెచ్)/60కెజి(ఎస్‌హెచ్) రేయిల్స్‌ను 60కెజి/90యుటిఎస్ (ఎస్‌హెచ్) రేయిల్స్‌తో పిఎస్‌సి(ఎస్‌హెచ్) స్లీపర్స్ ఎం+7/ఎం+4 సాంద్రతతో సిటిఆర్(ఎస్), 2) 2.602కి.మీ.ల పూర్తి దూరం కొరకు బిజడ్ఎ-కెఐ సెక్షన్- 52కెజి/90యుటిఎస్ (ఎస్‌హెచ్) రేయిల్ (ఎస్‌డబ్ల్యుఆర్)తో ప్రస్తుత 52కెజి/72యుటిఎస్/ 90యుటిఎస్ (ఎస్‌హెచ్) రేయిల్స్ యొక్క టిఆర్ఆర్(ఎస్). **ఎస్‌డబ్ల్యు-3:** కెఐ-బిజడ్ఎ & బిజడ్ఎ-విఎస్‌కెపి సెక్షన్లు: టిబిఆర్: 3.52కి.మీ.ల పూర్తి దూరం కొరకు బిసిఎం ద్వారా డీప్ స్క్రీనింగ్‌తోపాటు ట్రాక్ యొక్క త్రూ బలాస్టింగ్. **ఎస్‌డబ్ల్యు-4:** బిజడ్ఎ యార్డు: టిటిఆర్ (రేయిల్స్): బిజడ్ఎ యార్డు వద్ద బిజడ్ఎ-బివిఆర్ఎం-ఎన్‌డిడి సెక్షన్లు మరియు టిటిఆర్(ఎఫ్ఎస్+టిడబ్ల్యుఎస్)=4 సెట్స్ (12లో 1= 2 సెట్లు), 8.5లో 1=2సెట్లు) మధ్య టిటిఆర్ (ఎఫ్ఎస్+టిడబ్ల్యుఎస్+డబ్ల్యుసిఎంఎస్‌సి)=8సెట్లు (12లో 1= 7 సెట్లు), (8.5లో 1=1సెట్) ల పూర్తి సెట్ల కొరకు కొత్త 60కెజి థిక్ వెబ్ స్విచ్చులు, లీడ్ రేయిల్స్ & డబ్ల్యుసిఎంఎస్‌సి క్రాసింగ్స్‌తో రన్నింగ్ లైన్స్‌లో ప్రస్తుతమున్న 52/60కెజి స్విచ్చులు, లీడ్ రేయిల్స్& క్రాసింగ్స్ యొక్క త్రూ టర్నౌట్ రేయిల్స్ రినెవల్. **ఎస్‌డబ్ల్యు-5:** టిఆర్ఆర్(పి)- ఎడిఇఎన్/లైన్స్/బిజడ్ఎ సబ్ డివిజన్‌లో వివిధ లొకేషన్ల వద్ద అప్& డౌన్ పై 0.816కి.మీ.లు (427.103 - 427.324+ 0.221, 427.451- 427.741= 0.290 & 430.983-431.288= 0.305., **పూర్తిచేయు కాలవ్యవధి:** 12 (పన్నెండు) నెలలు, **టెండరు విలువ:** రూ.2,70,96,420/-, **ధరావత్తు:** రూ.2,85,500/-, **ముగింపు తేది:** 04.08.2023.

క్ర.సం.: 2, టెండరు నం.: ఇ-15-నార్త్-బిజడ్ఎ-2023, పని పేరు: బిజడ్ఎ-విఎస్‌కెపి సెక్షన్: డిఇఎన్/నార్త్/బిజడ్ఎ పరిధి యొక్క ఎడిఇఎన్/తుని సబ్-డివిజన్‌లో ప్రతిపాదిత రక్షిత సంబంధిత ట్రాక్ నిర్వహణా పనులు మరియు ఇతర చిన్నపాటి ట్రాక్ పనులు. **పూర్తిచేయు కాలవ్యవధి:** 12 (పన్నెండు) నెలలు, **టెండరు విలువ:** రూ.1,51,35,674/-, **ధరావత్తు:** రూ.2,25,700/-, **ముగింపు తేది:** 04.08.2023.

క్ర.సం.: 3, టెండరు నం.: ఇ-20-సౌత్-బిజడ్ఎ-2023, పని పేరు: బిజడ్ఎ డివిజన్: రైల్వే వారిచేత 37.550కి.మీ.ల పూర్తి దూరం కొరకు కెఎపిటి-విఆర్‌జెఎన్-వికెటి/కెఎంఎల్‌పి మధ్య డీప్ స్క్రీనింగ్ పని చేపట్టుట కొరకు ట్యాంపింగ్ మిషన్‌తోపాటు బిసిఎంల స్పారింగ్. **పూర్తిచేయు కాలవ్యవధి:** 06 (ఆరు) నెలలు, **టెండరు విలువ:** రూ.92,85,394/-, **ధరావత్తు:** రూ.1,85,707/-, **ముగింపు తేది:** 07.08.2023.

క్ర.సం.: 4, టెండరు నం.: ఇ-19-సౌత్-బిజడ్ఎ-2023, పని పేరు: బిజడ్ఎ డివిజన్: రైల్వేవారి చేత 37.550కి.మీ.ల పూర్తి దూరం కొరకు కెఎపిటి--విఆర్‌జెఎన్-వికెటి/కెఎంఎల్‌పి మధ్య డీప్ స్క్రీనింగ్ పని చేపట్టుట కొరకు ట్యాంపింగ్ మిషన్‌తోపాటు బిసిఎంల స్పారింగ్. **పూర్తిచేయు కాలవ్యవధి:** 06 (ఆరు) నెలలు, **టెండరు విలువ:** రూ.4,95,61,200/-, **ధరావత్తు:** రూ.3,97,800/-, **ముగింపు తేది:** 07.08.2023.

1) ఆసక్తిగల టెండరుదారులు ఏదేని టెండరు కొరకు ఏవేని మార్పులు/సవరణలను గమనించుటకు టెండరు ముగింపు తేదీకి ముందు వెబ్‌సైట్ "www.ireps.gov.in" ను దర్శించవలసిందిగా సలహా ఇవ్వబడుచున్నది.

డివిజనల్ రైల్వే మేనేజర్ (పనులు), విజయవాడ.
A1100

తదుపరి టెండర్ నియమాలు/వివరాలు మరియు టెండర్ డాక్యుమెంట్ల డౌన్‌లోడ్ కోసం దయచేసి వెబ్‌సైట్ https:www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.inని సందర్శించండి.

రాష్ట్రాలకు షాక్!

- పేదల గృహాల కేటాయింపును రద్దు చేసిన కేంద్రం
- అవన్నీ యుపికే మళ్లింపు

న్యూఢిల్లీ : ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ (పిఎంఎవై-జి) పథకం కింద పలు రాష్ట్రాలకు జరిపిన గృహ కేటాయింపులను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. పన్నెండు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు జరిపిన 1.44 లక్షల గృహ కేటాయింపులను ఉపసంహరించుకుంటూ ఉత్తర్వులు జారీ చేసింది. పైగా వాటన్నింటినీ ఉత్తరప్రదేశ్‌కు అదనంగా కేటాయించింది. రాజకీయ ప్రయోజనాల కోసం లోక్‌సభ ఎన్నికలకు ముందే... అంటే 2024 మార్చి నాటికి ఈ పథకం కింద వివిధ రాష్ట్రాలలో పేదలకు 2.95 కోట్ల నివాస గృహాలు నిర్మించి ఇవ్వాలని మోడీ ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. అయితే గడువు తేదీ అయిన జూన్ 30 లోగా నివాస గృహాలను మంజూరు చేయడంలో విఫలమయ్యాయన్న సాకు చూపి ఆయా రాష్ట్రాలకు జరిపిన కేటాయింపులను రద్దు చేసి ఆ నిధులన్నీ యూపీకి మళ్లించింది.

పథకాన్ని పర్యవేక్షిస్తున్న కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఈ విషయాన్ని ఆయా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు తెలియజేసింది. గుజరాత్, త్రిపుర, ఒడిషా, సిక్కిం, మేఘాలయ, మహారాష్ట్ర, అస్సాం, నాగాలాండ్, మిజోరం, తమిళనాడు, అండమాన్ నికోబార్ దీవులు, అరుణాచల్ ప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్, లఢక్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, కేరళ, జార్ఖండ్, పంజాబ్, హర్యానా, ఉత్తరాఖండ్‌తో పాటు తెలుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ కూడా నివాస గృహాలు మంజూరు చేయలేకపోయాయని కేంద్రం తెలిపింది.

కేంద్రం నిర్మించాలని భావిస్తున్న 2.95 కోట్ల నివాస గృహాలలో 2.04 కోట్ల గృహాలను సామాజిక ఆర్థిక కుల గణాంకాల (ఎస్ఈసీసీ) ప్రాతిపదికన రాష్ట్రాలకు కేటాయించారు. మిగిలిన 91 లక్షల గృహాలను దేశవ్యాప్తంగా 2018 జూన్-2019 మార్చి మధ్య జరిపిన ఆవాస్ సర్వే ఆధారంగా కేటాయించారు. అయితే కొన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు మాత్రం కేంద్రం విధించిన గడువు జూన్ 30 లోగా 1,44,220 గృహాలను మంజూరు చేయలేకపోయాయి. వీటిలో ఎస్ఈసీసీ గణాంకాల ఆధారంగా కేటాయించినవి 7,496 కాగా మిగిలిన 1,36,724 గృహాలు ఆవాస్ జాబితా లోనివి. ప్రారంభంలో ఉత్తరప్రదేశ్‌కు 34.72 లక్షల గృహాలు కేటాయించారు. అయితే తమకు అదనపు కేటాయింపులు జరపాలని ఆ రాష్ట్రం కేంద్రాన్ని కోరింది. ఈ మేరకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కూడా అయిన గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు లేఖ రాశారు.

గడువు ముగిసిందని...

గ్రామీణ ప్రాంతాలలో కనీసం ఇరవై ఐదు చదరపు మీటర్ల విస్తీర్ణంలో పక్కా ఇళ్లు నిర్మించాలని ఈ పథకంలో నిర్దేశించుకున్నారు. ప్రతి లబ్దిదారుకు మైదాన ప్రాంతమైతే రూ.1.2 లక్షల వరకూ, కొండ ప్రాంతమైతే రూ.75 వేల నుండి రూ.1.30 లక్షల వరకూ అందజేస్తారు. పథకానికి అవసరమయ్యే నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో భరిస్తాయి. అర్హులైన లబ్దిదారులకు నివాస గృహాలు మంజూరు చేసేందుకు కేంద్రం జూన్ 30వ తేదీ వరకూ గడువు ఇచ్చింది. గడువు ముగిసినప్పటికీ 1,44,220 గృహాలను మంజూరు చేయలేకపోయారనే సాకుతో ఇప్పుడు ఆ కేటాయింపులను కేంద్రం ఉపసంహరించుకుంది.

ప్రజాస్వామ్యంలో అధికార మార్పిడి అవసరమే : అమర్త్యసేన్

న్యూఢిల్లీ : ప్రజాస్వామ్యంలో తరచూ అధికార మార్పిడి జరుగుతుండాలని ప్రముఖ ఆర్థికవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్యసేన్ అభిప్రాయపడ్డారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల కోసం ఫెడరల్ ఫ్రంట్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ప్రయత్నాలపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల భారత పర్యటనకు వచ్చిన సందర్భంగా ఆయన ఓ వార్తాసంస్థకు ఇంటర్వ్యూ ఇస్తూ మణిపూర్‌లో శాంతి స్థాపనకు కేంద్రం జోక్యం చేసుకోవాలని సూచించారు. 'ప్రజాస్వామ్యం తరచుగా అధికార మార్పిడిని కోరుకుంటుంది. అయితే తరచుగా జరిగేది ఏమంటే అందుకు అవసరమైన బలాన్ని మెజారిటీ ఓటర్లు మైనారిటీ పార్టీలకు ఇవ్వరు' అని వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష పార్టీలు ఒంటరిగా, బలహీనంగా ఉండడం కంటే చేయీ చేయీ కలిపి అడుగులు ముందుకు వేస్తే అధికారాన్ని సమతూకం చేయవచ్చునని చెప్పారు. ఈ సందర్భంగా గత నెలలో పాట్నాలో జరిగిన ప్రతిపక్షాల సమావేశాన్ని ప్రస్తావించారు.

మణిపూర్ పరిస్థితిపై ప్రధాని నరేంద్ర మోడీ న్యాయసమ్మతమైన, సమతూకమైన స్వభావమున్న ఓ ప్రకటన చేస్తారని తాను ఆశించానని అమర్త్య చెప్పారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌పై దాఖలైన పరువునష్టం కేసుపై అడిగిన ప్రశ్నకు జవాబిస్తూ ఇలాంటి కేసులో పార్లమెంట్ సభ్యుడెవరూ అరెస్ట్ కావడం కానీ, దిగువసభలో సభ్యత్వం కోల్పోవడం కానీ తాను చూడలేదని అన్నారు. ఇది చాలా దురదృష్టకరమైన పరిణామమని తెలిపారు. ఉమ్మడి పౌరస్మృతి (యుసిసి) నిర్మాణాత్మక పాత్ర పోషిస్తే తాను ఆశ్చర్యపడతానని చెప్పారు. భారత్‌లో యుసిసి ఏం చేస్తుందనే విషయం పైన, దాని ప్రతికూల పరిణామాల పైన తాను ఆందోళన చెందుతున్నానని అమర్త్యసేన్ తెలిపారు.

ప్రపంచ అసమానతలపై చర్యలు తీసుకోండి

ఐరాస, ప్రపంచబ్యాంక్‌కు ఆర్థికవేత్తల వినతి

న్యూఢిల్లీ : ప్రపంచంలోని అసమానతలను తగ్గించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని వివిధ దేశాలకు చెందిన 236 మంది సీనియర్ ఆర్థికవేత్తలు ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి అంటోనియో గుటెర్రెస్, ప్రపంచబ్యాంక్ అధ్యక్షుడు అజయ్ బంగాలను కోరారు. ఈ మేరకు వారు ఓ లేఖ రాశారు. నోబెల్ బహుమతి గ్రహీత, కొలంబియా యూనివర్సిటీ ప్రొఫెసర్ జోసెఫ్ స్టిగ్‌లిజ్, మాసాచూసెట్స్ యూనివర్సిటీ ప్రొఫెసర్ అమ్‌హర్స్ట్ జయతీ ఘోష్ రూపొందించిన ఈ లేఖపై 67 దేశాల ఆర్థికవేత్తలు సంతకాలు చేశారు. ప్రపంచంలోని అసమానతలు సామాజిక, పర్యావరణ లక్ష్యాలను దెబ్బతీస్తున్నాయని వారు ఆ లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. లక్ష్యాల సాధనపై ప్రభావం చూపే ఆర్థిక, ద్రవ్య, సామాజిక విధానాలను అంచనా వేసుకోవాల్సిన అవసరం ఉన్నదని వారు అభిప్రాయపడ్డారు. 'గత పాతిక సంవత్సరాలలో తొలిసారిగా అటు పేదరికం, ఇటు సంపద...రెండూ పెరిగాయి. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత 2019-2020 మధ్యకాలంలో అంతర్జాతీయంగా అసమానతలు వేగవంతంగా పెరిగాయి. ప్రపంచ జనాభాలో అత్యంత సంపన్నులైన 10% మంది ప్రపంచంలోని 52% సంపదను అనుభవిస్తున్నారు. జనాభాలో సగానికి పైగా ఉన్న నిరుపేదలు అందులో 8.5% మాత్రమే సంపాదిస్తున్నారు. కోట్లాది మంది ప్రజలు పెరుగుతున్న ఆహార ధరలు, ఆకలితో ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు గత దశాబ్ద కాలంలో బిలియనీర్ల సంఖ్య రెట్టింపైంది' అని ప్రస్తావించారు. అసమానతలు సమాజంలో విచ్ఛిన్నకరమైన ప్రభావాన్ని చూపుతున్నాయని ఆర్థికవేత్తలు తెలిపారు. అసమానతలను తగ్గించాలని ప్రపంచ దేశాలు 2015లో లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ కోవిడ్ కారణంగా ఇప్పుడు పరిస్థితి మరింత దారుణంగా మారిందని వారు ఆ లేఖలో వివరించారు.

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Lenin Center, Governerpet, Vijayawada - 520002 (A.P.)
E PROCUREMENT SHORT TENDER NOTICE
NIT No. 10 /MAU61-USI0HB(OTH)/83/2023-HB, Dated: 15.07.2023
Name of Work: "Filling & levelling of the play ground located on the eastern side of the High Court building, Nelapadu, Amaravati" - **Estimate Amount:** Rs.16.00 Lakhs.
The bid can be downloaded on AP e-procurement portal **from 19.07.2023 to 24.07.2023 up to 14.00 Hrs. Due date for submission of Bid 24.07.2023 up to 15.00 Hrs, Technical bid opening 24.07.2023 @16.00 Hrs.** For further details please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in**
Sd/- Commissioner, APCRDA, Vijayawada.

'విజిలెన్స్' పత్రాలను అపహరించారు

- కేజ్రీ ప్రభుత్వంపై కేంద్రం ఆరోపణ
- ఆర్డినెన్సును సమర్ధిస్తూ సుప్రీంకోర్టులో అఫిడవిట్

న్యూఢిల్లీ : రాజధాని ఢిల్లీలో సేవలపై లెఫ్టినెంట్ గవర్నర్‌కు విశేషాధికారాలు కట్టబెట్టేందుకు ఉద్దేశించిన ఆర్డినెన్సును కేంద్ర ప్రభుత్వం గట్టిగా సమర్ధించుకుంది. జీ-20 దేశాల సమూహానికి భారత్ అధ్యక్షత వహిస్తున్నందున రాజధానిలో పెద్ద ఎత్తున అనేక అంతర్జాతీయ కార్యక్రమాలు జరుగుతాయని, ఆ సందర్భంగా పరిపాలన స్తంభించకుండా చూడడానికి ఈ ఆర్డినెన్స్ అవసరమని తెలిపింది. అంతేకాదు... కేజ్రీవాల్ ప్రభుత్వంపై తీవ్రమైన ఆరోపణలు చేసింది. విజిలెన్స్ శాఖ అధికారి కార్యాలయంలోని కీలకమైన పత్రాలను అపహరించారని తెలిపింది. ఈ మేరకు సుప్రీంకోర్టులో కేంద్ర హోం శాఖ అఫిడవిట్ దాఖలు చేసింది. 'ప్రస్తుతం రాజధానిలో అధికార యంత్రాంగం గందరగోళంలో ఉంది. అక్కడ పరిపాలన స్తంభించింది. ప్రజల స్థానిక అవసరాలను, దేశీయ అవసరాలను సమతూకం చేయాల్సి ఉంటుంది. ఆ పరిస్థితులలో దేశ ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్ష రాష్ట్రపతి ఆర్డినెన్స్ ద్వారా ప్రతిబింబించింది' అని కేంద్రం తన అఫిడవిట్‌లో తెలియజేసింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంపై కేంద్రం తీవ్ర ఆరోపణలు చేసింది. 'విజిలెన్స్ శాఖలో పని చేసే అధికారులను రాష్ట్ర ప్రభుత్వం వేధిస్తోంది. ఆ శాఖకు చెందిన ప్రత్యేక కార్యదర్శి కార్యాలయంలో చొరబడి కొన్ని ఫైళ్లను చట్టవిరుద్ధంగా తీసుకుపోయారు. ఢిల్లీ ప్రభుత్వంలోని కొందరు ముఖ్యులైన సీనియర్ మంత్రుల ప్రమేయం ఉన్న ఎక్సైజ్ కుంభకోణానికి సంబంధించిన ఫైల్‌ను తీసుకున్నారు. ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కోసం నూతనంగా నిర్మిస్తున్న భవనానికి సంబంధించిన ఖర్చుల ఫైల్‌ను కూడా ఎత్తికెళ్లారు. ఒక రాజకీయ పార్టీ కోసం ఢిల్లీ ప్రభుత్వం పెట్టిన ప్రకటనల ఖర్చుకు సంబంధించిన పత్రాలను కూడా అపహరించారు. ఫీడ్‌బ్యాక్ యూనిట్ పేరిట ఏర్పాటు చేసిన ఓ యూనిట్ పనితీరుకు సంబంధించిన ఫైలు కూడా కన్పించడం లేదు' అని ఆరోపించింది. కాగా ఆర్డినెన్స్‌ను వ్యతిరేకిస్తూ ఢిల్లీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించాల్సిన అవసరం ఉన్నదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఢిల్లీ ప్రభుత్వ ఆధీనంలో ఉన్న సేవలపై పెత్తనం చెలాయించేందుకు కేంద్రం ఈ ఆర్డినెన్సును తీసుకొచ్చిందని అంటూ దీనిని అనుమతించాలా అని ప్రశ్నించింది.

గ్రామగ్రామాన కేన్సర్ స్క్రీనింగ్ టెస్ట్‌లు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

స్విమ్స్‌లో అన్ని రకాల కేన్సర్లకు అత్యుత్తమ చికిత్స అందిస్తున్నామని, ప్రపంచంలోనే తొలిసారిగా తిరుపతి జిల్లాలో సామూహిక క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహిస్తున్నామని, గ్రామగ్రామాన స్క్రీనింగ్ టెస్ట్‌లు నిర్వహించనున్నట్లు టిటిడి ఇఒ ఎవి ధర్మారెడ్డి, జెఇఒ సదా భార్గవి, కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి ఉద్ఘాటించారు. అత్యాధునిక వైద్య వ్యవస్థలను అందుబాటులోకి తెచ్చే ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. జిల్లాలోని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లకు శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాలలో 13-22 తేదీల్లో క్యాన్సర్ అవగాహన, స్క్రీనింగ్ పరీక్షలపై శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈవో ఎవి ధర్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. క్యాన్సర్ వల్ల దేశంలో ఏటా ఏడు లక్షల మంది చనిపోతున్నారని చెప్పారు. తొలిదశలోనే గుర్తిస్తే సరైన చికిత్స అందించి అధిగమించవచ్చని అన్నారు. రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులతో పండిస్తున్న ఉత్పత్తుల వల్ల ఆ అవశేషాలు మానవ శరీరంలోకి వెళ్లి క్యాన్సర్ రావడానికి కారణం అవుతున్నాయన్నారు. ప్రాణాయామం, యోగాకు సంబంధించి శ్రీ వేంకటేశ్వర వేద విశ్వ విద్యాలయం ఆచార్యుల చేత మరో శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేస్తామన్నారు. గో ఆధారిత వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం వల్ల క్యాన్సర్‌ను దూరం చేయవచ్చన్నారు. కలెక్టర్ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ క్యాన్సర్ ప్రపంచానికి పెద్ద ముప్పు కాబోతుందని, జిల్లా జనాభాలో 10 శాతం మంది క్యాన్సర్ వ్యాధిబారిన పడుతున్నట్లు ప్రాథమిక అంచనా ఉందన్నారు. జెఇఒ మాట్లాడుతూ జిల్లాలో గూడూరు, శ్రీకాళహస్తి, చంద్రగిరి ప్రాంతాల్లో క్యాన్సర్ వ్యాధిని గుర్తించడానికి శాశ్వత కేంద్రాలను ఏర్పాటు చేయడానికి టిటిడి నిర్ణయించిందన్నారు. తిరుపతిని క్యాన్సర్ రహిత జిల్లాగా తయారు చేయడానికి జిల్లా అధికార యంత్రాంగం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమన్నారు. అనంతరం ఇఒ, కలెక్టర్, జెఇఒ ఈ కార్యక్రమానికి సంబంధించిన మాడ్యూల్స్ పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చరణ్ బి సింగ్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ నాగరాజు, బాలాజీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ ప్రత్యేకాధికారి డాక్టర్ జయచంద్రా రెడ్డి, స్విమ్స్ రిజిస్ట్రార్ అపర్ణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శ్రీహరి, జిల్లా కార్యక్రమ నిర్వాహక అధికారి డాక్టర్ శ్రీనివాసరావు, శ్రీ వేంకటేశ్వర వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్ పాల్గొన్నారు.

ఆ ఇద్దరు పిసిసి మాజీ చీఫ్‌లు ఎటువైపు?

- రఘువీరా రెడ్డి మౌనం
- టిడిపి వైపు శైలూ చూపు..?



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికలకు సమయం ఆసన్నమవుతోంది. ఈ సమయంలో నేతలు ఎవరు ఎటు ఉంటారోనన్న చర్చలు సర్వత్రా సాగుతూనే ఉంటాయి. ఇదే కోవలో ఇద్దరు మాజీ పిసిసి అధ్యక్షుల పట్ల కూడా జిల్లాలో చర్చ సాగుతుండటం గమనార్హం. జిల్లాలో సీనియర్ నాయకుల్లో మాజీ పిసిసి అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డిరు ఒకరు. ముందు నుంచి కాంగ్రెసు పార్టీలో ఉంటూ అనేక పదవులను అలంకరించి జిల్లాపై ఒక చెరగని ముద్రను వేశారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖల మంత్రిగానూ పనిచేశారు. రాష్ట్ర విభజన తరువాత కాంగ్రెసు పార్టీ ఆంధ్రప్రదేశ్‌లో పూర్తిగా దెబ్బతింది. ఈ తరుణంలో ఆయన పిసిసి అధ్యక్ష బాధ్యతలను తీసుకుని పూర్వ వైభవాన్ని తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేశారు.

అయితే ఆశించిన ఫలితాలు మాత్రం రాలేదు. 2014, 2019 ఎన్నికల్లోనూ ఉమ్మడి జిల్లాలో పెనుకొండ, కళ్యాణదుర్గంలోనూ ఆయన పోటీ చేసినప్పటికీ కాంగ్రెసుపై ఉన్న వ్యతిరేకతతో ఓటమిని చవిచూడక తప్పలేదు. 2019 ఎన్నికల తరువాత నుంచి పిసిసి పదవి నుంచి కూడా తప్పుకుని రాజకీయాలకు దూరంగా ఉంటూ వచ్చారు. అయితే ఇటీవల జరిగిన కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన కాంగ్రెసు పార్టీ తరపున అక్కడ ప్రచారం చేశారు. తిరిగి ఆయన యాక్టివ్ అయ్యారని భావించారు. కాని ఇప్పటికీ రాష్ట్ర రాజకీయాల పట్ల మాత్రం మౌనంగానే ఉంటూ వస్తున్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లోపు అయినా ఇక్కడి రాజకీయాల వైపు దృష్టి సారిస్తారా లేక దూరంగానే ఉంటారా అన్న చర్చ ఉమ్మడి జిల్లా వాసుల్లో చర్చ నడుస్తూ ఉంది. ఇక రఘువీరారెడ్డి పిసిసి అధ్యక్షతల నుంచి తప్పుకున్న తరువాత మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజనాథ్‌కు ఆ బాధ్యతలు అప్పగించారు. ఆయన 2004లో వైద్యవృత్తిని వదిలి రాజకీయరంగ ప్రవేశం చేశారు. 2012లో కాంగ్రెసు పార్టీ హయంలోనే విద్యా శాఖ మంత్రి అయ్యారు. రఘువీరారెడ్డి పిసిసి అధ్యక్ష పదవి నుంచి తప్పుకున్నాక ఆయన పిసిసి అధ్యక్షులయ్యారు. మొన్నటి వరకు ఆయన పిసిసి అధ్యక్షులుగా ఉంటూ వచ్చారు. కాని ఇటీవల ఆయన స్థానంలో గిడుగు రుద్రరాజును నియమించారు. అప్పటి నుంచి ఆయన కొంత వరకు కాంగ్రెసుకు దూరంగా జరుగుతున్నారన్న ప్రచారం రాజకీయవర్గాల్లో నడుస్తోంది. ఇక రాష్ట్రంలో కాంగ్రెసు ఇప్పట్లో పుంజుకునే పరిస్థితి లేదన్న ఉద్దేశంతో ఇతర పార్టీల వైపు దృష్టి సారించినట్టు తెలుస్తోంది. ఈ మేరకు ఆయన పూర్వపు నియోజకవర్గమైన శింగనమలలో ఇటీవలి కాలంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ముందున్న పరిచయాలతో ముఖ్యమైన వారిని గ్రామాల వారీగా కలుస్తూ, వచ్చే ఎన్నికల్లో తనకు సహకారం అందివ్వాలని కోరుతున్నారు. అయితే ఏ పార్టీ తరపున అన్నది స్పష్టంగా వారికి మాత్రం చెప్పడం లేదు. అయితే ఆయన తెలుగుదేశం పార్టీలోకి త్వరలో చేరే అవకాశముందన్నది మాత్రం ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఈ మేరకు ఇటీవల కాలంలో ఆయన ఆ పార్టీ ముఖ్య నేతలతో మంతనాలు జరిపారన్న ప్రచారమూ ఉంది.

ఇప్పటికే తెలుగుదేశం పార్టీలో ఆ నియోజకవర్గంలో గ్రూపు తగాదాలు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో వీటిని చెక్ పెట్టేందుకు ఆయన్ను తీసుకొస్తే బాగుంటుందన్న ఆలోచనలోనూ తెలుగుదేశం పార్టీ ఉన్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మాజీ పిసిసి అధ్యక్షులు డాక్టర్ శైలజనాథ్ తెలుగుదేశం పార్టీ వైపు చూస్తున్నట్టు తెలుస్తోంది. అయితే రఘువీరారెడ్డి ఎటు అన్నదే ఇప్పటికీ స్పష్టత లేదన్నది రాజకీయవర్గాల్లో సాగుతున్న చర్చ.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (Union Bank of India; Andhra; Corporation)
అమీర్‌పేట్ శాఖ
7-1-58, దివ్య శక్తి కాంప్లెక్స్, లాల్ బంగ్లా ఎదురుగా, అమీర్‌పేట్-500016.
Email id:ubin0802221@unionbankofindia.bank

"స్థిరాస్తి అమ్మకం కొరకు అమ్మకపు ప్రకటన"

ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)కు నియమాలతో చదువబడే ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకపు ప్రకటన.

ఇందుమూలంగా సర్వజనులకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీతలు మరియు హామీదారులకు ప్రకటన ఇవ్వడమేమనగా, దిగువ వివరించిన ఆస్తులు సెక్యూర్డ్ క్రెడిటర్‌కు తాకట్టు/చార్జ్‌చేయబడినవి, వాటిని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క అధీకృత అధికారిచేత నిర్మాణాత్మక/లాంఛనప్రాయంగా స్వాధీనంచేసుకోబడినది, దిగువ పేర్కొన్న రుణగ్రహీతల నుండి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు బకాయి మొత్తాలను రికవరీచేయుట కొరకు, "ఏది ఎక్కడ, ఎలా ఉన్నది, అక్కడ అది అలాగే ఉంటుంది" ప్రాతిపదికన విక్రయించబడుతుంది. రిజర్వుధర మరియు ధరావత్తు డిపాజిట్ ఇందు దిగువ కూడా పేర్కొనబడినవి:

రుణగ్రహీతలు: 1. ఇఖ్బాల్ పాష మహ్మద్, నం.: 1-10-147/ఎ/39, ఫ్లాట్ నం. ఎ2/53, మయూరి అపార్టుమెంట్స్, మయూర్ మార్గ్, బేగంపేట్, హైదరాబాద్-500016. & ఇఖ్బాల్ పాష మహ్మద్, డోర్ నం.22/260, మున్సిపల్ వార్డు నం.22, ఇంగ్లీష్‌పాలెం, మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్, మచిలీపట్నం, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్ పిన్-521001. సహ-రుణగ్రహీతలు: 1) రెహానా బేగం, భర్త ఇఖ్బాల్ పాష మహ్మద్, నం.: 1-10-147/ఎ/39, ఫ్లాట్ నం. ఎ2/53, మయూరి అపార్టుమెంట్స్, మయూర్ మార్గ్, బేగంపేట్, హైదరాబాద్-500016. & రెహానా బేగం, భర్త ఇఖ్బాల్ పాష మహ్మద్, డోర్ నం.22/260, మున్సిపల్ వార్డు నం.22, ఇంగ్లీష్‌పాలెం, మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్, మచిలీపట్నం, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్ పిన్-521001.
బకాయి మొత్తాలు: 15.03.2023 నాటికి రూ.21,67,792/- తదుపరి వడ్డీ, ఖర్చులు & వ్యయాలతోసహా.
డిమాండ్ నోటీసు తేది: 15.11.2022 **స్వాధీనతా ప్రకటన తేది: 17.02.2023**

ఆస్తి వివరణ: ఇంగ్లీష్‌పాలెం, మజీద్ ఎదురుగా, మచిలీపట్నం, కృష్ణా జిల్లా, ఆం.ప్ర. వద్దగల వార్డు నం.22లో 114.54చ.గ.ల పూర్తి విస్తీర్ణపు సైటు పై 89.3చ.గ.ల ప్లింత్ ఏరియా కలిగియున్న వార్డు నం.22, డోర్ నం.22/260 గల ల్యాండ్& భవనము- నివాసిత/ నివాసిత ఇల్లు మొత్తం మరియు సరిహద్దులు:
ఐటెం నం.1: కృష్ణా జిల్లా, మచిలీపట్నం, ఇంగ్లీష్‌పాలెం వద్ద భవనము డోర్ నం.22/260 తోపాటు 101.11చ.గ.ల విస్తీర్ణం. సరిహద్దులు:
తూర్పు: 2వ ఐటెం ఉమ్మడి దారి, పడమర: మున్సిపల్ రోడ్డు, ఉత్తరం: సి-షెడ్యూలు ఆస్తి, దక్షిణం: ఎం.డి. అక్బర్ పాష& ఇ-షెడ్యూలు ఆస్తి.
ఐటెం నం.2: విస్తీర్ణం 40.29చ.గ.లలో 1/3వ వాటా అనగా., 13.43చ.గ.లు. సరిహద్దులు:
తూర్పు: ఇఖ్బాల్ పాష మరియు సోదరుల ఇల్లు, పడమర: 1వ ఐటెం, సి,డి షెడ్యూలు ఆస్తులు మరియు ఎం.డి. మస్తాన్ ఇల్లు, ఉత్తరం: మున్సిపల్ రోడ్, దక్షిణం: రఫీ& ఇతరులు.

రిజర్వు ధర: రూ.29,80,000/- ధరావత్తు: రూ.2,98,000/- సంప్రదించాల్సిన నం: 9836880404
ఇ-వేలం తేది& సమయం: 24.08.2023 ఉ॥ 11:00గం.ల నుండి సా॥ 4:00గం.లు.

సదరు ఆస్తుల పై ఇతర రుణభారాల వివరాలు బ్యాంకుకు తెలియవు. అమ్మకం యొక్క వివరణాత్మక నియమాలు& నిబంధనల కొరకు, దయచేసి www.unionbankofindia.co.in.లో ఇవ్వబడిన లింకును పరిశీలించండి. రిజిస్ట్రేషన్ మరియు లాగిన్ మరియు బిడ్డింగ్ రూల్స్ కొరకు www.mstcecommerce.com/auctionhome/ibapi/index.jsp దర్శించండి

తేది: 18.07.2023 అధీకృత అధికారి
ప్రదేశం: హైదరాబాద్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

భూస్వాములతో ఇరిగేషన్ అధికారుల కుమ్మక్కు

- ఎర్ర కాలువ మిగులు భూముల పేదలపై అక్రమ కేసులు, బెదిరింపులు
- పేదలకు సాగుకు అవకాశం కల్పిస్తూ ఎక్‌సాల్ పట్టాలివ్వాలి : వ్యకాస డిమాండ్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

భూస్వాములతో కుమ్మక్కై పేదలను భయభ్రాంతులకు గురిచేస్తూ చట్టాలను ఉల్లంఘిస్తున్న రెవెన్యూ ఇరిగేషన్ అధికారులపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి డిమాండ్ చేశారు. ఏలూరులోని ఎర్రకాలువ మిగులు భూములకు ఎక్స్‌ఎల్ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా ఇరిగేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి మాట్లాడుతూ జిల్లాలో ఎనిమిదేళ్ల నుండి ఎర్రకాలువ మిగులు భూములు పేదలకు పంచాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు కుమ్మక్కై ఆ ప్రాంతంలో ఉన్న పేదలకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. చట్టం అందరికీ సమానమేనని చెబుతూ చట్టాన్ని ఉల్లంఘిస్తున్న ఇరిగేషన్ అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ఇరిగేషన్ భూముల్లో పేదలు సాగు చేసుకోవడానికి అవకాశం ఇవ్వాలని ఉన్నప్పటికీ అమలు చేయడం లేదని విమర్శిం చారు. ఈ భూములు గత 35 ఏళ్లగా స్థానిక భూస్వాములు అమ్ముకుని నేటికీ దర్జాగా వాణిజ్య పంటలు పామాయిల్, కొబ్బరి, చెరకు, మొక్కజొన్న, పొగాకు వంటి పంటలు చట్ట వ్యతిరేకంగా పండిస్తున్నా ఇరిగేషన్ అధికారులు మొద్దు నిద్రపోతున్నారని విమర్శించారు. భూస్వాములు పట్ల సానుకూలంగా వ్యవహరిస్తూ పేదలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. భూముల్లోకి వెళితే పేదలపై అక్రమ కేసులు పెట్టి, మహిళలపై దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.జీవ రత్నం, పి.రామకృష్ణ మాట్లాడుతూ టి.నరసాపురం మండలం మధ్యాహ్నపువారిగూడెం, అప్పలరాజుగూడెం, అబ్బిల్లాపురం, సాలిగూడెం, మల్లప్పగూడెం జంగారెడ్డిగూడెం మండలంలో ఎ.పోలవరం, చిన్నవారిగూడెం, తాడువాయి, వేగవరం, చక్రదేవరపల్లి, ఎర్రకాలువ ప్రాజెక్టు ఇరిగేషన్ భూముల్లో పేదలు వేసుకున్న కొబ్బరి మొక్కలు పీకేసి దళిత మహిళలపై దాడి చేసి కొట్టి కులం పేరుతో దూషించిన భూస్వాములపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇరిగేషన్ భూముల్లో పేదలు ఏడాది నుంచి కొబ్బరి మొక్కలు వేసుకుని జీవిస్తున్నారని తెలిపారు. ఇది ఓర్వలేని భూస్వాములు కొబ్బరి మొక్కలు పీకివేసి 'ఆ మొక్కలు మేమే వేశాము.. పేదలు పీకేశారు' అంటూ పోలీస్ స్టేషన్లో పేదలపై తప్పుడు కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. ఇరిగేషన్ భూముల్లో ఇరిగేషన్ అధికారులు ఫిర్యాదు చేయకుండా పేదలపై కేసులు ఎందుకు నమోదు చేశారో పోలీసులు ప్రజలకు తెలియజేయాలని కోరారు. మహిళలపై దాడి చేసిన భూస్వాములపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెలాఖరుకి సమస్యను పరిష్కరించాలని లేనిపక్షంలో ఎర్ర కాలువ పోరాటంలో ఉన్న పేదలందరితో కలిసి ఇరిగేషన్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ఆందోళనకు సన్నద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు టి.సత్యనారాయణ, ఎస్.మహంకాళిరావు, జి.సూర్యకిరణ్, యాగంటి సీత, పి.చంటి, కె.సుబ్బారావు, మొగలి మంగ, తోనం సోమాలమ్మ, రామలక్ష్మి, దుర్గమ్మ పాల్గొన్నారు.

ఈక్విటస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (equitas SMALL FINANCE BANK LTD)
(గతంలో ఈక్విటస్ ఫైనాన్స్ లిమిటెడ్ పేరుగలది)
రిజిస్టర్డు ఆఫీసు: నం.769, స్పెన్సర్ ప్లాజా, 4వ అంతస్తు, ఫేజ్-2, అన్నా శాలై, చెన్నై, టిఎన్-600 002.
 # 044-42995000, 044-42995050

స్థిరాస్తి అమ్మకం కొరకు అమ్మకపు ప్రకటన

సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)తో చదువబడే, షార్ఫసీ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.
ఇందుమూలంగా సర్వజనులకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీతలు, సహ-రుణగ్రహీతలు మరియు హామీదారులకు ప్రకటన ఇవ్వడమేమనగా, దిగువ వివరించిన స్థిరాస్తి సెక్యూర్డ్ క్రెడిటర్‌కు తాకట్టుపెట్టబడినది, వేటినైతే ఈక్విటస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిచేత భౌతిక స్వాధీనంచేసుకోబడినది, దిగువ రుణగ్రహీతల నుండి ఈక్విటస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్‌కు గల దిగువ పేర్కొన్న బకాయి మొత్తాలను రికవరీచేయుట కొరకు "ఎక్కడ ఏది ఎలా ఉన్నది, అక్కడ అది అలాగే ఉంటుంది" ప్రాతిపదికన 25.08.2023న విక్రయించబడుతుంది.

రుణగ్రహీత/ల & హామీదారు/ల పేరు& చిరునామా, నుండి పూర్తి బకాయి + వడ్డీ	సెక్యూర్డ్ అసెట్ (స్థిరాస్తి వివరణ
1. అల్లూరి శ్రీనివాస రాజు తండ్రి అల్లూరి సుబ్బరాజు, 2. శ్రీమతి అల్లూరి పరమేశ్వరి భర్త అల్లూరి శ్రీనివాస రాజు, ఇరువురి నివాసం: డోర్ నం.14-4-1, ఎండుగుపాలెం, నాదేండ్ల మండలం, ప్రభుత్వ ఎలిమెంటరీ స్కూల్ దగ్గర, గుంటూరు, ఆం.ప్ర.-522549. రుణ ఖాతా నం. ఎస్ఇజిఎన్‌టియుఆర్0322510. క్లెయించేయు బకాయి మొత్తాలు: నెలవారీ వడ్డీ చార్జీలు మరియు ఖర్చులు మొ॥వాటితో 31.03.2022 నుండి తదుపరి వడ్డీ 30.03.2022 నాటికి రూ.11,24,791/-	నర్సారావుపేట్ రిజిస్ట్రేషన్ జిల్లా, చిలకలూరిపేట్ ఎస్ఆర్ఒ, నాదేండ్ల మండలం, ఎందుగపాలెం గ్రామం& గ్రామపంచాయతి వద్దగల డోర్ నం.880లో విస్తీర్ణం: 250చ.గ.లు లేదా 209చ.మీ.లు, డోర్ నం.1-6, అసెస్మెంట్ నం.6గల నివాసిత ఇల్లు మరియు సరిహద్దులు: ఉత్తరం: తమ్మినేని వీరస్వామి దొప్పలపాడి సు ఆస్తులు, దక్షిణం: కాకర్లపూడి వెంకట రామ రాజు 100అ.ల ఆస్తి, తూర్పు: కాకర్లపూడి బంగారు రాజు 25-00అ.ల ఆస్తి, పడమర: పంచాయత్ బజార్ 20-00అ.లు, కొలతలు: నర్సారావుపేట్ రిజిస్ట్రేషన్ జిల్లా మరియు చిలకలూరిపేట్ సబ్-రిజిస్ట్రేషన్ జిల్లా పరిధిలోగల 250చ.గ.లు లేదా 209చ.మీ.ల విస్తీర్ణంతో అన్ని ఈజిమెంటరీ/మామూల్ హక్కులు మరియు నేలకు ప్రస్తుతం మరియు భవిష్యత్‌లోని ఏవేని అటాచ్‌చేయబడిన ఎర్త్ లేదా పర్మినెంట్లీ ఫాస్టెనెడ్ అన్ని భవనాలు& నిర్మాణాలతోసహా. **రిజర్వు ధర: రూ.15,00,000/- ధరావత్తు: రూ.1,50,000/- సంప్రదించాల్సిన వ్యక్తి: ఆనంద ప్రసాద్-9940009476, సాయికాంత్-7569656556**

వేలం తేది: 25.08.2023
ఇ-వేలం అమ్మకం యొక్క వివరణాత్మక నియమాలు& నిబంధనల కొరకు, దయచేసి www.equitasbank.com & https://sarfaesi.auctiontiger.net లో ఇవ్వబడిన లింకును పరిశీలించండి.

తేది: 19.07.2023 అధీకృత అధికారి,
ప్రదేశం: పన్నాలదు జిల్లా ఈక్విటస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

ఇడి, సిబిఐ, ఐటీలే వారి భాగస్వాములు

- ఎన్డీయే కూటమిపై బృందాకరత్ వ్యంగ్యాస్త్రాలు

న్యూఢిల్లీ : ఎన్‌డిఎ సమావేశానికి హాజరైనవారిలో సగానికి పైగా నేతలు కేంద్ర దర్యాప్తు సంస్థల విచారణకు భయపడి పార్టీలు ఫిరాయించి బిజెపి గూటికి చేరినవారేనని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ విమర్శించారు. ఎన్‌డిఎ సమావేశంపై పిటిఐ వార్తా సంస్థ ఆమె స్పందనను కోరగా పై విధంగా వ్యంగ్యాస్త్రాలు సంధించారు. వాస్తవానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి), కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ), ఆదాయ పన్ను శాఖ (ఐటి) యే ఎన్‌డిఎ ప్రధాన భాగస్వాములని బృందా ఎద్దేవా చేశారు. ఈ సమావేశానికి వాటి అధినేతలు ఎందుకు హాజరుకాలేదని ఆమె ప్రశ్నించారు. ఒకవేళ నిజంగా ఎన్‌డిఎ సమావేశం నిర్వహించాల్సివుంటే ఇడి, సిబిఐ, ఐటి అధికారులతో జరపాలని ఆమె సూచించారు. ఇప్పుడు జరిపిన సమావేశానికి హాజరైనవారంతా ఆ దర్యాప్తు సంస్థల బాధితులేనని, వారంతా పార్టీ ఫిరాయింపుల ద్వారా బిజెపి పంచన చేరినవారేనని ఆమె పేర్కొన్నారు.

రాహుల్ గాంధీ పిటిషన్‌పై విచారణకు 'సుప్రీం' అంగీకారం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పరువు నష్టం కేసులో గుజరాత్‌లోని సూరత్ కోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టు సమర్థించడాన్ని సవాల్ చేస్తూ రాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌ను ఈ నెల 21న విచారణ జరిపేందుకు సర్వోన్నత న్యాయస్థానం అంగీకరించింది. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో రాహుల్ గాంధీ కర్ణాటకలోని కోలార్‌లో ఓ బహిరంగ సభలో మాట్లాడారు. దొంగలందరి ఇంటిపేరు మోడీ ఎలా అవుతోందని ప్రశ్నించారు. దీనిపై గుజరాత్‌కు చెందిన పూర్ణేశ్ మోడీ స్పందిస్తూ, సూరత్ కోర్టులో పరువు నష్టం కేసు దాఖలు చేశారు. కోర్టు రాహుల్ గాంధీని దోషిగా నిర్ధారించి, రెండేళ్ల జైలుశిక్ష విధించింది. దీంతో వయనాడ్ ఎంపి అయిన ఆయన తన లోక్‌సభ సభ్యత్వాన్ని కోల్పోయారు. ఈ శిక్షను, తీర్పును నిలిపేయాలని ఆయన గుజరాత్ హైకోర్టును ఆశ్రయించారు. కానీ హైకోర్టు అందుకు నిరాకరించింది.

బిజెపిని మళ్లీ గెలిపిస్తే దేశం నాశనమే

- అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు విజయ రాఘవన్

ప్రజాశక్తి- హైదరాబాద్

'ప్రధాని మోడీకి విదేశీ పర్యటనలు, విమానాల కొనుగోలు తప్ప.. ప్రజల కష్టాలు, ధరల పెరుగుదలపై పట్టింపు లేదు.. తొమ్మిదేళ్లలో మోడీ ప్రగతి తప్ప ప్రజల ప్రగతి కనిపించడం లేదు.. ఆయన్ని మళ్లీ గెలిపిస్తే దేశం నాశనమౌతుంది' అని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు విజయ రాఘవన్ అన్నారు. తెలంగాణ రాష్ట్రం నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని విజయ్ విహార్‌లో రెండు రోజులపాటు జరగనున్న అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కమిటీ సమావేశాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ముందుగా సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం విజయ రాఘవన్ మాట్లాడుతూ.. ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్లో నిధులు తగ్గిస్తూ నిర్వీర్యం చేస్తున్నారని, భవిష్యత్తులో ఈ చట్టం లేకుండా చేయాలని లక్ష్యంతోనే మోడీ ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. దేశవ్యాప్తంగా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఉద్యమాలు, పోరాటాలపై చర్చించి భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందించేందుకు ఈ సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. శ్రమజీవుల సంఘటిత శక్తికి, దేశ సమైక్యతకు, భారతీయ ఇంజినీర్ల ప్రతిభకు నిలువెత్తు రాతి కట్టడం నాగార్జునసాగర్ ప్రాజెక్టు అని మాజీ ఎమ్మెల్యే, ఆహ్వాన సంఘం అధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సమావేశాల్లో ఆయన ప్రారంభ ఉపన్యాసం చేశారు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్, ఆల్ ఇండియా సహాయ కార్యదర్శి, ఎంపి శివ దాసన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్, రైల్వే ప్రైవేటీకరణ ఆపాలి

- విద్యుత్ బిల్లును వెనక్కి తీసుకోవాలి
- సిఐటియు జాతీయ సదస్సు తీర్మానం

సదస్సులో మాట్లాడుతున్న సిఐటియు అధ్యక్షురాలు కె.హేమలత

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

విద్యుత్, రైల్వే రంగాలను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరించడాన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్త ఆందోళనలు చేపట్టాలని సిఐటియు జాతీయ సదస్సు తీర్మానించింది. మంగళవారం నాడిక్కడ హరికిషన్‌సింగ్ సూర్జిత్ భవన్‌లో జరిగిన ఆల్ ఇండియా కన్వెన్షన్ ప్రభుత్వరంగ ప్రైవేటీకరణను నిలిపివేయాలని, నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ ప్రాజెక్టును విరమించుకోవాలని డిమాండ్ చేసింది. ఉధృతంగా సమ్మెలు చేస్తున్న విద్యుత్ ఉద్యోగులను సదస్సు కొనియాడడంతోపాటు పోరాటానికి ప్రజలందరూ మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ తీర్మానాలు ప్రవేశపెట్టారు. సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 10 వరకు జిల్లా స్థాయి సదస్సులు నిర్వహించనున్నారు. సిఐటియుకి అనుబంధంగా ఉన్న అన్ని సంఘాలు ఇందులో భాగం కావాలని పిలుపునిచ్చారు. బ్లాక్, పంచాయతీ, గ్రామస్థాయిల్లో కూడా సదస్సులు నిర్వహిస్తామన్నారు. కరపత్రాల పంపిణీతో సహా అక్టోబర్ 25 నుండి నవంబర్ 2 వరకు విస్తృత ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. నవంబర్ 3న రైల్వే స్టేషన్ల వద్ద భారీ ప్రదర్శనలు నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు.

సిఐటియు అధ్యక్షురాలు కె.హేమలత మాట్లాడుతూ విద్యుత్తు, రవాణా, వైద్యం, విద్య తదితర అంశాలకు భరోసా కల్పించాల్సిన బాధ్యత నుంచి ప్రభుత్వం వైదొలిగి ప్రైవేట్‌కు అప్పగించిందని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం విధించిన లేబర్ కోడ్‌లతోసహా నిరంకుశ ధోరణిలో ముందుకు సాగుతోందని తెలిపారు. యూనియన్ల పనికి ఆటంకం కలిగిస్తోందని అన్నారు. విద్యుత్ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్‌లో మార్కెట్ ఆధారిత సంస్కరణలన్నీ రద్దు చేయాలని, "స్మార్ట్ మీటర్"ను రద్దు చేయాలని అన్నారు. ప్రజా రవాణా, ఆరోగ్యం, విద్య, ఇతర ప్రజా సేవలను బలోపేతం చేయడానికి, వనరులను సమీకరించడానికి కార్పొరేట్ పన్నును మెరుగుపరచాలని, సంపద పన్నును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. టికెటింగ్, నిర్వహణ సేవలతో సహా కీలకమైన రైల్వే కార్యాచరణ ప్రైవేటీకరణ, అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టరైజేషన్‌ను రద్దు చేయాలని అన్నారు. ఇండియన్ రైల్వేలో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను భర్తీ చేయాలని, భద్రత, నిర్వహణపై తగిన వ్యయం చేసి ప్రయాణికుల భద్రతను పెంచాలని పేర్కొన్నారు. సిఐటియు జాతీయ కార్యదర్శులు ఎలమరం కరీం, ఎఆర్ సింధూ, ఎం.సాయిబాబా, వివిధ రాష్ట్రాల నుంచి హాజరైన సుమారు 350 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

బ్రిజ్ భూషణ్‌కు తాత్కాలిక బెయిల్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బిజెపి ఎంపి, రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యుఎఫ్ఐ) మాజీ చీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు ఢిల్లీలోని రౌస్ ఎవెన్యూ కోర్టు మంగళవారం తాత్కాలిక బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో మరో నిందితుడు, డబ్ల్యుఎఫ్ఐ సహాయ కార్యదర్శి వినోద్ తోమర్‌కు కూడా తాత్కాలిక బెయిల్ మంజూరు చేసింది. రూ.25 వేల పూచీకత్తులతో వీరిద్దరికీ రెండు రోజుల పాటు బెయిల్‌ను అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ (ఎసిఎంఎం) హర్జీత్ సింగ్ జస్పాల్ మంజూరు చేసి, తదుపరి విచారణను ఈ నెల 20కు వాయిదా వేశారు. ఢిల్లీ పోలీసులు ఈ కేసులో జూన్ 15న ఛార్జిషీటు దాఖలు చేశారు. ఈ క్రమంలోనే ఈ కేసులో నిందితుడిపై విచారణ జరిపేందుకు తగిన సాక్ష్యాలు ఉన్నాయని కోర్టు పేర్కొంది. జులై 18న కోర్టు ముందు హాజరుకావాలని బ్రిజ్ భూషణ్‌తోపాటు వినోద్ తోమర్‌కు సమన్లు జారీ చేసింది. ఈ క్రమంలోనే బ్రిజ్ భూషణ్, వినోద్ తోమర్ మంగళవారం కోర్టు విచారణకు హాజరయ్యారు. బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. నిందితులిద్దరూ రెగ్యులర్ బెయిల్ కోసం చేసుకున్న దరఖాస్తులపై ఈ నెల 20న విచారణ జరపనున్నట్లు కోర్టు తెలిపింది.

అడ్డంగా చిక్కాడు...

- అసభ్య సంభాషణ చేస్తూ దొరికిపోయిన బిజెపి నేత సోమయ్య
- మరాఠీ న్యూస్ ఛానల్‌లో వైరల్

న్యూఢిల్లీ : నైతికత, భారతీయత, సంస్కృతి సంప్రదాయాల గురించి నిత్యం సుద్దులు చెప్పే బిజెపి నేతలు అందుకు భిన్నంగా ప్రవర్తించే మరో ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. బిజెపి సీనియర్ నేత కిరిత్ సోమయ్య ఓ మహిళతో అసభ్యకరంగా సంభాషిస్తూ మరాఠీ న్యూస్ ఛానల్ 'లోక్‌షాహీ'కి చిక్కారు. తనకు, ఆ మహిళకు మధ్య లైంగిక సంబంధం ఉన్నదని అర్థమొచ్చేలా సోమయ్య ఆ వీడియోలో సంభాషించారు. అయితే ఈ వీడియో కల్పితమని సోమయ్య చెప్పారు. తనపై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. తాను ఎన్నడూ మహిళలను అవమానించలేదని అన్నారు. ఈ వ్యవహారంపై విచారణ జరపాలంటూ మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు లేఖ రాశారు. సోమయ్య అసభ్య ప్రవర్తనకు సంబంధించి సోమవారం సాయంత్రం వెలుగులోకి వచ్చిన వీడియో దృశ్యాలు రాజకీయ ప్రకంపనలు సృష్టించాయి. సోమయ్య అనేక మంది మహిళలను లైంగికంగా వేధించారని, దీనికి సంబంధించి తమకు పలు ఫిర్యాదులు అందాయని కూడా ఆ ఛానల్ తెలిపింది.

ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి ప్రభుత్వ పరిశోధనల వివరాలు

- ఎన్‌ఆర్‌ఎఫ్ బిల్లుపై ఎఐపిఎస్ఎన్ ఆందోళన
- సమగ్ర అంచనాకై స్థాయీ సంఘానికి నివేదించాలని సూచన

ఢిల్లీ : నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఎన్‌ఆర్‌ఎఫ్) బిల్లు-2023పై ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్ (ఎఐపిఎస్ఎన్) ఆందోళన వ్యక్తం చేసింది. సమగ్ర అంచనా కోసం ఈ బిల్లును కేంద్రప్రభుత్వం పార్లమెంట్ స్థాయీ సంఘానికి (ఎస్ అండ్ టి, పర్యావరణం, అడవులు) పంపాలని అది ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. ఎన్‌ఆర్‌ఎఫ్ బిల్లు 2023కు కేంద్ర మంత్రివర్గం ఇటీవల ఆమోదముద్ర వేసింది. బుధవారం వర్షాకాల సమావేశాల్లో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనుంది. సైన్స్ అండ్ ఇంజనీరింగ్ బోర్డ్ (ఎస్ఇఆర్‌బి) చట్టం- 2008 స్థానంలో తీసుకొస్తున్న దీనిని గట్టిగా వ్యతిరేకించాలని ఎఐపిఎస్ఎన్ అన్ని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేసింది. ఎఐపిఎస్ఎన్ అనేది 25 రాష్ట్రాల్లో పనిచేసే 40 ప్రజా సైన్స్ సంఘాల ఐక్యవేదిక. పబ్లిక్ ఫండింగ్, కార్పొరేట్లు, దాతృత్వ సంస్థలు, అంతర్జాతీయ సహకారంపై ఆధారపడే ఒక సంస్థను నెలకొల్పడం ఈ బిల్లు ఉద్దేశ్యం. కొత్తగా ఏర్పాటు చేసే సంస్థకు ప్రభుత్వం నుంచి 28 శాతం నిధులు మాత్రమే వస్తాయని, మిగిలిన 72 శాతం నిధులు ప్రైవేటు సంస్థలు, వ్యక్తుల నుంచి లభ్యమవుతాయని, కాబట్టి ఇటువంటి సంస్థ నిర్మాణంతో ప్రభుత్వ పరిశోధనలు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళతాయని ఎఐపిఎస్ఎన్ తెలిపింది. ఈ నేపథ్యంలో ఎన్‌ఆర్‌ఎఫ్ బిల్లును పున్ణపరిశీలించాలని ప్రభుత్వాన్ని కోరింది. అలాగే, ఈ బిల్లును సమగ్ర మదింపు కోసం సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం, అటవీ శాఖకు చెందిన పార్లమెంట్ స్థాయీ సంఘానికి పంపాలని కోరింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సైన్స్ సంస్థల ప్రతినిధులు బిల్లుపై తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరింది.

ప్రపంచంలో ఇతర దేశాలతో పోల్చితే పరిశోధన-అభివృద్ధిపై భారతదేశం పెట్టే ఖర్చు చాలా తక్కువగా ఉందని ఎఐపిఎస్ఎన్ గుర్తుచేసింది. 2022లో పరిశోధన - అభివృద్ధి కోసం దేశ జిడిపిలో కేవలం 0.65 శాతాన్ని మాత్రమే కేంద్రం కేటాయించింది. ఈ సంఖ్య ప్రపంచ సగటు 1.8 శాతం లోపే ఉందని తెలిపింది. అమెరికా (2.9 శాతం), చైనా (2.2 శాతం), ఇజ్రాయల్ (4.9 శాతం) వంటి దేశాల కంటే చాలా తక్కువగా ఉందని తెలిపింది. దేశంలోని ఉన్నత విద్యా సంస్థల్లో పరిశోధనలు అంతంత మాత్రంగానే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేసింది. భారతదేశంలో ఉన్న దాదాపు 40,000 ఉన్నత విద్యా సంస్థలలో కేవలం ఒక శాతం మాత్రమే పరిశోధనల్లో చురుకుగా పాల్గొంటున్నాయని తెలిపింది. ఈ పరిస్థితిని పరిష్కరించడానికి గానూ, శాశ్వత పోస్టుల కోసం సరైన అర్హత కలిగిన ఉపాధ్యాయులు, పరిశోధకులను నియమించడం ద్వారా ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను బలోపేతం చేయవలసిన అవసరం ఉందని ఎఐపిఎస్ఎన్ తెలిపింది. టెక్నాలజీలో భారత్ స్వావలంబన సాధించడానికి, గ్లోబల్ టెక్నాలజీ లీడర్‌గా మారడానికి పరిశోధనలు - అభివృద్ధి రంగంలో తగినన్ని పెట్టుబడులు అత్యంత కీలకమని తెలిపింది. ప్రభుత్వం సరైన రీతిలో పెట్టుబడులు పెట్టాలని ఎఐపిఎస్ఎన్ డిమాండ్ చేసింది.

వివేకా హత్య కేసులో చార్జిషీటు, పోలీస్ రికార్డులు సమర్పించాలి

- సిబిఐని ఆదేశించిన సుప్రీంకోర్టు
- అవినాష్ బెయిల్ పిటిషన్ విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మాజీ మంత్రి వైఎస్ వివేకా నంద రెడ్డి హత్య కేసులో తన ఛార్జిషీటు, పోలీస్ రికార్డులను సమర్పించాలని కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ)ను అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. వివేకా హత్య కేసులో కడప ఎంపి వైఎస్ అవినాష్ రెడ్డికి తెలంగాణ హైకోర్టు మంజూరు చేసిన ముందస్తు బెయిల్‌ను సవాల్ చేస్తూ వివేకా కుమార్తె సునీత నర్రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బేలా ఎం త్రివేదితో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. సునీత పిటిషన్‌పై సమాధానం ఇవ్వాలని సిబిఐని ఆదేశించింది. నర్రెడ్డి సునీతా తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా, న్యాయవాది జెసల్ వాహి వాదనలు వినిపిస్తూ విచారణకు హాజరుకావాలని పదే పదే నోటీసులు ఇచ్చినప్పటికీ అవినాష్ రెడ్డి సిబిఐ విచారణలో చేరేందుకు నిరాకరించారని పేర్కొన్నారు. తెలంగాణ హైకోర్టు 'మినీ ట్రయల్' నిర్వహించిందని, ప్రాసిక్యూషన్ కేసు మెరిట్‌లపై 'సిబిఐ సేకరించిన సాక్ష్యాలను పట్టించుకోకుండా' అవినాష్ రెడ్డి కథనాన్ని 'వాస్తవంగా అంగీకరిస్తూ' వ్యాఖ్యలు చేసిందని, ఇది పూర్తిగా చట్టవిరుద్ధమని ఆయన వాదించారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ.. బెయిల్ పిటిషన్‌ను విచారిస్తున్నప్పుడు కేసు మెరిట్‌లను చర్చించలేమని స్పష్టం చేసింది. 'ముందస్తు బెయిల్‌ను రద్దు చేయాలని మేము కోరుకుంటున్నాము' అని సిద్ధార్థ్ లూథ్రా వాదించారు. పిటిషన్‌లో సిబిఐ అవినాష్ రెడ్డిని అరెస్టు చేయాలని కోరుకుంది.

అయితే, సిబిఐ అలా చేయలేకపోయింది. ఎందుకంటే అవినాష్ రెడ్డి, పెద్ద సంఖ్యలో ఆయన మద్దతుదారులు, గూండాలు ఆస్పత్రి వెలుపల సిబిఐ అధికారులను అడ్డుకున్నారు. ఆయన తల్లి ఆరోగ్య సమస్యలు సాకుగా చూపి అరెస్టు కాకుండా ఉండటానికి ఆశ్రయం పొందారు' అని వాదించారు. రాష్ట్ర పోలీసుల సమక్షంలోనే నేరం జరిగిన స్థలాన్ని అవినాష్ రెడ్డితో పాటు ఇతర నిందితులు ధ్వంసం చేశారని, గుండెపోటుతో మృతి చెందినట్లు కథనాన్ని ప్రచారం చేశారని సిబిఐ తెలిపిందని సిద్ధార్థ్ లూథ్రా పేర్కొన్నారు. ఈ నేరాన్ని 'చల్లని రక్తపు హత్య' అని లూథ్రా అభివర్ణించారు.

సిబిఐ తరపున సీనియర్ న్యాయవాది రంజిత్ కుమార్ వాదనలు వినిపిస్తూ.. కేసు స్టేటస్ వివరించారు. అనంతరం ధర్మాసనం ఇప్పటికే ఉన్న ఉత్తర్వులు కొనసాగుతాయని పేర్కొంది. వెంటనే సునీత న్యాయవాది సిద్ధార్థ లూథ్రా జోక్యం చేసుకుని ఇప్పటి వరకు సిబిఐ చేసిన దర్యాప్తుకు సంబంధించిన కేసు డైరీ వివరాలను తమకు ఇవ్వాలంటూ కోరారు. దీనిపై ధర్మాసనం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. అయితే అవినాష్ కేసులో కౌంటర్ దాఖలు చేసేందుకు సమయం కావాలని న్యాయస్థానాన్ని సిబిఐ కోరింది. దీంతో రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని, దానితోపాటు చార్జిషీట్, కేసు ఒరిజినల్ ఫైల్‌ను సీల్డ్ కవర్‌లో సమర్పించాలని సిబిఐని ధర్మాసనం ఆదేశించింది. ఆ తరువాత మూడు వారాల్లో రిజాయిండర్‌ను దాఖలు చేయాలని ఆదేశాలిచ్చింది. అలాగే ఈ కేసులో ప్రతివాదులందరికీ నోటీసులు ఇచ్చింది. మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. గంగిరెడ్డి, అవినాష్ బెయిల్ పిటిషన్లు కలిపే వింటామని తెలిపింది. గంగిరెడ్డి బెయిల్ పిటిషన్ వేరుగా వినాలని గంగిరెడ్డి తరపు న్యాయవాది కోరగా.. అవినాష్ రెడ్డి బెయిల్‌తోపాటు వింటామని సుప్రీంకోర్టు ధర్మాసనం తేల్చిచెప్పింది. తదుపరి విచారణ సెప్టెంబరు 11కు వాయిదా పడింది.

(మొదటి పేజీ తరువాయి)

త్వరలో ప్రకటిస్తామని చెప్పారు.

ఐఎన్‌డిఐఎ ఉద్దేశం ఐక్యంగా పోరాడటమే అని బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ పేర్కొన్నారు.

ప్రతిపక్షాల కూటమి 'ఇండియా'

ఉమ్మడి తీర్మానం

కుల గణనను అమలు చేయాలని సమావేశం డిమాండ్ చేసింది. సమావేశ అనంతరం 26 పార్టీలు 'సామూహిక్ సంకల్ప్ (ఉమ్మడి తీర్మానం)లో విడుదల చేశాయి. "సామాజికంగా, విద్యాపరంగా, ఆర్థికంగా వెనుకబడిన అన్ని వర్గాలకు న్యాయం చేయాలి. మొదటి దశగా, కుల గణనను అమలు చేయాలి" అన్న తీర్మానాన్ని సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. "మైనారిటీలపై ద్వేషం, హింస" అలాగే "మహిళలు, దళితులు, గిరిజనులు, కాశ్మీరీ పండిట్లపై పెరుగుతున్న నేరాలను" ఓడించేందుకు తామంతా కలిసి ఒకే వేదికపైకి వచ్చామని ప్రతిపక్ష పార్టీలు పేర్కొన్నాయి. రాజ్యాంగంలో పొందుపరిచిన భారతదేశ ఆలోచనను కాపాడేందుకు దృఢ సంకల్పాన్ని వ్యక్తం చేశాయి. "మన గణతంత్ర స్వరూపంపై బిజెపి ఒక పథకం ప్రకారం దాడి చేస్తోంది. దేశ చరిత్రలో మనం అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నాము. భారత రాజ్యాంగ పునాది స్తంభాలైన లౌకిక ప్రజాస్వామ్యం, ఆర్థిక సార్వభౌమాధికారం, సామాజిక న్యాయం, సమాఖ్యవాదం ఒక పథకం ప్రకారం భయానకంగా అణగదొక్కబడుతున్నాయి" అని విమర్శించాయి.

ప్రధాని పదవిపై కాంగ్రెస్‌కు ఆసక్తి లేదు: మల్లికార్జున ఖర్గే

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రతిపక్ష పార్టీల సమావేశంలో మాట్లాడుతూ ప్రధాన మంత్రి పదవిపై కాంగ్రెస్ పార్టీకి ఆసక్తి లేదని అన్నారు. భారత దేశ ఆత్మ, రాజ్యాంగం, లౌకికవాదం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్యాలను పరిరక్షించడంపై మాత్రమే తమ పార్టీకి మక్కువ ఉందన్నారు. రాష్ట్ర స్థాయిలో తమ మధ్య విభేదాలు వున్నా, అవి అధిగమించలేనంత వేమీ కావని, ప్రజలను కాపాడటం కోసం వాటిని పక్కన పెట్టవచ్చని చెప్పారు. నిరుద్యోగం, అధిక ధరలు వంటి ప్రజా సమస్యలతో బాటు హక్కుల అణచివేతకు గురవుతున్న పేదలు, దళితులు, గిరిజనులు, మైనారిటీల కోసం వాటిని వదిలిపెట్టవచ్చునని చెప్పారు. ఈ సమావేశానికి హాజరైన 26 పార్టీలకు తగినంత రాజకీయ బలం ఉందని అన్నారు. 11 రాష్ట్రాల్లో ఈ పార్టీలు అధికారంలో ఉన్నాయన్నారు. బిజెపి 2019 లోక్‌సభ ఎన్నికల్లో 303 స్థానాలను దక్కించుకుందని, ఈ స్థానాలను ఆ పార్టీ తనంతట తాను గెలుచుకోలేదని అన్నారు.బిజెపి తన మిత్ర పక్షాల ఓట్లను పొంది, అధికారంలోకి వచ్చి, ఆ తర్వాత ఆ మిత్ర పక్షాలను వదిలేసిందని పేర్కొన్నారు. ఇప్పుడు బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా, ఇతర నేతలు రాష్ట్రాల్లో తిరుగుతూ, పాత మిత్రులతో సత్సంబంధాల కోసం దేవులాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఎన్‌డిఎ సమావేశానికి 38 పార్టీలు వచ్చాయని అంటున్నారని, అయితే అవి రిజిష్టర్ అయినవేనా? అని ఎద్దేవా చేశారు.

నవ భారతం కోసం కలలు కంటున్నాం: అరవింద్ కేజ్రీవాల్

తొమ్మిదేళ్ల క్రితం ఈ దేశ ప్రజలు నరేంద్ర మోడీకి ఓటేయడంతో దేశానికి సేవ చేసే అవకాశం వచ్చిందని, అయితే ఈ తొమ్మిదేళ్లలో ఒక్క రంగం కూడా పురోగతి సాధించలేదని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ విమర్శించారు. ఈ 26 పార్టీలు నవ భారతం కోసం కలలు కంటున్నాయని అన్నారు.

ఇది భారత్ గొంతు కోసం జరుగుతున్న పోరాటం: రాహుల్ గాంధీ

"ఈ సమావేశంలో పాల్గొనడం నాకు గౌరవం. ఇండియా అనే భావనపై దాడి జరుగుతోంది. కోట్లాది మంది భారతీయుల నుంచి ఇండియా గొంతును లాక్కొని నరేంద్ర మోడీ తన సన్నిహితులైన కొంతమంది వ్యాపారులకు అప్పగిస్తున్నారు. ఇది భారత్ గొంతు కోసం జరుగుతున్న పోరాటం. అందుకే ఇండియా పేరును ఖరారు చేశాం. ఎన్‌డిఎ వర్సెస్ ఇండియా, నరేంద్ర మోడీ వర్సెస్ ఇండియా, ఇండియా వర్సెస్ హిందుత్వ సిద్ధాంతం మధ్య పోరాటం ఇది. ఒక సమూహంగా తాము భారత రాజ్యాంగాన్ని, ప్రజల గొంతును పరిరక్షిస్తున్నాము. భారత్ అనే భావనకు ఎదురు నిలబడితే ఎవరు గెలుస్తారో మనందరికీ తెలుసు" అని రాహుల్ గాంధీ అన్నారు. దేశం పట్ల మన దృక్పథాన్ని వివరించే ఒక 'యాక్షన్ ప్లాన్'తో ముందుకు రావాలని మేము నిర్ణయం తీసుకున్నామని అన్నారు. నిరుద్యోగం పెరిగిపోతోందని, ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, వీటి గురించి తమ ఆందోళనంతా అని రాహుల్ చెప్పారు. దేశ సంపద కొద్ది మంది చేతుల్లోకి వెళుతోందని విమర్శించారు. "ఈ పోరాటం కేంద్రం, ప్రతిపక్షాల మధ్య కాదు. ఇది అణచివేయబడుతున్న భారతదేశం గొంతు కోసం పోరాటం. అందుకే మేము ఇండియా పేరును ఎంచుకున్నాము" అని రాహుల్ గాంధీ అన్నారు.

దేశం మా కుటుంబం, దాని కోసం పోరాడుతాం: ఉద్ధవ్ ఠాక్రే

'కుటుంబం కోసమే' ప్రతిపక్షాలు బెంగుళూరులో సమావేశమవుతున్నాయని ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలను మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, శివసేన (ఉద్ధవ్) అధినేత, ఉద్ధవ్ థాకరే దీటుగా తిప్పికొట్టారు. "అవును, దేశం మొత్తం మా కుటుంబం. మేము దాని కోసం పోరాడుతున్నాము" అని అన్నారు. "ప్రజల మనస్సులలో తదుపరి ఏమి జరుగుతుందో అనే భయం ఉంది. కాబట్టి చింతించకండి. మేము ఇక్కడ ఉన్నామని మేము వారికి భరోసా ఇవ్వాలనుకుంటున్నాము. ఒక వ్యక్తి, లేదా ఒక పార్టీ దేశం కాదు. దేశం ప్రజలందరిది" అని అన్నారు.

ఈ సమావేశంలో మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ (కాంగ్రెస్), సీతారాం ఏచూరి (సిపిఎం), డి.రాజా (సిపిఐ), తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ (డిఎంకె), బీహార్ సిఎం నితీష్ కుమార్ (జెడియు), పశ్చిమ బెంగాల్ సిఎం మమతా బెనర్జీ (టిఎంసి), ఢిల్లీ, పంజాబ్ ముఖ్యమంత్రులు అరవింద్ కేజ్రీవాల్, భగవంత్ మాన్ (ఆప్), జార్ఖండ్ సిఎం హేమంత్ సొరెన్ (జెఎంఎం), లాలూ ప్రసాద్ యాదవ్, తేజస్వి యాదవ్ (ఆర్‌జెడి), శరద్ పవార్ (ఎన్‌సిపి), అఖిలేష్ యాదవ్ (ఎస్‌పి), ఉద్ధవ్ ఠాక్రే (శివసేన), ఒమర్ అబ్దుల్లా (నేషనల్ కాన్ఫరెన్స్), మెహబుబా ముఫ్తీ (పిడిపి), వైకో (ఎండిఎంకె), దీపాంకర్ భట్టాచార్య (సిపిఐఎంఎల్), ఇఆర్ ఈశ్వరన్ (కెఎండికె), కెఎం ఖాద్రీ మొహిద్దీన్ (ఐయుఎంఎల్), జయంత్ చౌదరి (ఆర్‌ఎల్‌డి) తదితర పార్టీల నేతలు పాల్గొన్నారు. సమావేశం ప్రారంభమైన వెంటనే కేరళ మాజీ ముఖ్యమంత్రి ఊమెన్ చాందీ మృతికి సంతాప సూచకంగా కొద్ది సేపు మౌనం పాటించారు.

ఊమెన్ చాందీకి నివాళులర్పిస్తున్న కేరళ సిఎం విజయన్

కేరళ మాజీ ముఖ్యమంత్రి ఊమెన్ చాందీ కన్నుమూత

- గవర్నర్, సిఎం సహా పలువురు నేతల సంతాపం

తిరువనంతపురం : కేరళ మాజీ ముఖ్యమంత్రి ఊమెన్ చాందీ మంగళవారం తెల్లవారుజామున కన్నుమూశారు. ఆయన వయసు 79 సంవత్సరాలు. కేన్సర్‌తో బాధపడుతూ, చికిత్స తీసుకుంటున్న ఆయన తెల్లవారుజామున బెంగళూరు ఆస్పత్రిలో మరణించారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు వున్నారు. ఆయన కుమారుడు చాందీ ఊమెన్ ఫేస్‌బుక్‌లో ఈ విషయాన్ని పోస్ట్ చేశారు. కొట్టాయం జిల్లా పుతుపల్లి నియోజకవర్గానికి ఐదు దశాబ్దాలకు పైగా ప్రాతినిధ్యం వహించిన ఆయన ప్రజల్లో బాగా పాపులర్ అయిన నేత. 2004 నుండి 2006 వరకు, 2011 నుండి 2016 వరకు కేరళకు రెండుసార్లు ముఖ్యమంత్రిగా చేశారు. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో చాందీ కీలకమైన హోం, ఆర్థిక, కార్మిక శాఖలను నిర్వహించారు. 1943 అక్టోబరు 30న జన్మించిన చాందీ, కేరళ స్టూడెంట్స్ యూనియన్, యువజన కాంగ్రెస్ ద్వారా రాజకీయాల్లో చురుకుగా పాల్గొన్నారు. 1970లో మొదటిసారిగా అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 1982-86, 2001-2004 కాలంలో యుడిఎఫ్ కన్వీనర్‌గా కూడా వున్నారు.

ప్రజల హృదయాల్లో చెదరని స్థానం ఆయనది : సిఎం విజయన్

ఊమెన్ చాందీ మృతికి రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్, గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్ సంతాపం ప్రకటించారు. ప్రతిపక్ష నేత వి.డి.సతీశన్‌తో సహ పలువురు పార్టీ నేతలు సంతాపం తెలిపారు. ప్రజా రాజకీయ జీవితంలో తనదైన చెరగని ముద్ర వేశారని గవర్నర్ ఖాన్ వ్యాఖ్యానించారు. 1970ల్లో చాందీతో కలిసి ఎంఎల్‌ఎగా వున్న రోజులను పినరయి విజయన్ గుర్తు చేసుకున్నారు. కేరళ రాజకీయాల్లో ముఖ్యమైన అధ్యాయం ఆయన మరణంతో ముగిసిందని వ్యాఖ్యానించారు. ప్రపంచ రాజకీయ చరిత్రలో అత్యంత అరుదుగా చాలా కొద్దిమంది మాత్రమే పదే పదే ఎన్నికవుతూ వస్తారని, చాందీది అటువంటి చరిత్రేనని, ఓటమి అనేది ఎరుగకుండా ఐదు దశాబ్దాలకు పైగా ఆయన అసెంబ్లీకి ఎన్నికయ్యారని గుర్తు చేసుకున్నారు. ప్రజల హృదయాల్లో ఆయన స్థానం చెక్కుచెదరనిదని ఈ ఎన్నికల విజయాలతో రుజువైందని ముఖ్యమంత్రి తన సంతాప సందేశంలో పేర్కొన్నారు.

ఉమెన్‌చాందీ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు: గిడుగు రుద్రరాజు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేరళ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ఉమెన్‌చాందీ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటని పిసిసి రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో ఉమెన్‌చాందీ సంతాపసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి, సుంకర పద్మశ్రీ, రాకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

అంతా మోడీనే..

(మొదటి పేజీ తరువాయి)

పళని స్వామి (అన్నాడిఎంకె), దుష్యంత్ చౌతాలా (జెజెపి), థామస్ (కేరళ కాంగ్రెస్ (థామస్)), ఉపేంద్ర సింగ్ కుష్వాహా (రాష్ట్రీయ లోక్ సమతా పార్టీ), ముఖేష్ సహానీ (వికాశీల్ ఇన్సాన్ పార్టీ), జితిన్ రామ్ మాంఝీ (హిందుస్థానీ అవామ్ మోర్చా), చిరాగ్ పాశ్వాన్ (ఎల్‌జెపి), రాందాస్ అథ్వాలే (ఆర్‌పిఐ), అతుల్ బోరా (ఎజిపి), ప్రకాష్ రాజ్‌భర్ (ఎస్‌బిఎస్‌పి), సంజయ్ నిషాద్ (నిషాద్ పార్టీ) తదితరులు పాల్గొన్నారు.

టిడిపి, బిజెపి, జనసేన కలిసి పోటీ

నాకు సిఎం పదవి ముఖ్యం కాదు : జనసేన అధినేత పవన్ కల్యాణ్

వచ్చే ఎన్నికల్లో టిడిపి, బిజెపి, జనసేన కలిసి పోటీ చేసే అవకాశం ఉందని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. ఎన్‌డిఎ సమావేశంలో పాల్గొనేందుకు మంగళవారం ఢిల్లీ వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు అందరూ కలిసి పోరాడాల్సిన అవసరం ఉందని అన్నారు. తనకు ముఖ్యమంత్రి పదవి ముఖ్యం కాదని స్పష్టం చేశారు. కూటమిలో ముఖ్యమంత్రి ఎవరన్నది ఎన్నికల ఫలితాల బలాబలాలను బట్టి నిర్ణయిస్తామని అన్నారు. తమకు అండగా నిలిచేవారు కావాలని ప్రజలు కోరుకుంటున్నారని పవన్ కల్యాణ్ అన్నారు. రాష్ట్రంలో విచ్చల విడిగా అవినీతి జరుగుతోందని ఆరోపించారు. ఉద్యోగాలు లేవని, ఉద్యోగులకు ఒకటిన జీతాలు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. డేటా చోర్యం జరుగుతోందని ఆరోపించారు. రోజుకి రూ.160 జీతం ఇచ్చి పెట్టుకున్న ప్రైవేటు వ్యక్తులతో ప్రజల డేటా అంతా చోర్యం చేస్తున్నారని విమర్శించారు. ఆధార్, వేలిముద్రలు, ఐరిష్ డేటా అంతా తెలంగాణలో నిక్షిప్తం చేస్తున్నారన్నారు. ప్రజా వ్యతిరేకతను ఎదిరించే వారు కావాలని ఎపి ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. అందుకే జనసేనకు ఏపిలో ప్రజల నుంచి మద్దతు వస్తోందన్నారు. రాష్ట్రంలో ప్రజలు తీవ్ర నిరాశతో ఉన్నారన్నారు. మీడియాలో కనిపిస్తున్న దానికి వాస్తవ పరిస్థితులకు పొంతన లేదని చెప్పారు. కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించే పరిస్థితి లేదన్నారు. తనకు అనుకూలంగా ఉన్న వారికి మాత్రం పది శాతం వడ్డీతో రుణాలు తీసుకొచ్చి రాష్ట్ర సొమ్మును ధారాదత్తం చేస్తున్నారని పవన్ కళ్యాణ్ విమర్శించారు.

కదంతొక్కిన ఆశాలు

(మొదటి పేజీ తరువాయి)

కె.ధనలక్ష్మి మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతంలోని పేద గర్భిణులు, బాలింతలు, శిశువులకు ఆరోగ్య సేవలందించడంలో ఆశా వర్కర్లు ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. అధికారులకు అవసరమైన సమాచారం ఇవ్వడం, అత్యవసర సమయాలలో ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆరోగ్య సేవలందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఇంతటి సేవలందిస్తోన్న వారి పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందన్నారు. ఆశా వర్కర్లతో సంబంధం లేని పనులు చేయిస్తుండడం, నాసిరకం ఫోన్లు ఇచ్చి ఆన్‌లైన్ వర్క్ చేయాల్సిందేనని అధికారులు బెదిరించడం సరైనది కాదన్నారు. ప్రభుత్వమే రికార్డు బుక్స్ ఇవ్వాల్సి ఉండగా ఆశా వర్కర్లతోనే కొనిపిస్తున్నారని విమర్శించారు. ఆశా వర్కర్లకు ఇచ్చే రూ.10 వేలు గౌరవ వేతనం కూడా రెండుసార్లుగా ఇస్తున్నారని, ప్రభుత్వ ఉద్యోగులనే పేరుతో సంక్షేమ పథకాలకు కోత పెట్టారని, 60 సంవత్సరాల నిండిన ఆశా వర్కర్లను ఎలాంటి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ లేకుండా ఒట్టి చేతులతో ఇంటికి పంపించడం దుర్మార్గమని అన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో డిఎం అండ్ హెచ్ఒ కార్యాలయం వద్ద ధర్నాలో పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆశా వర్కర్లపై రాజకీయ వేధింపులు దారుణమన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తక్షణమే ఆశా వర్కర్ల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతపురంలోని డిఎం అండ్ హెచ్‌లో కార్యాలయం వద్ద ధర్నాలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆశాలతో జాబ్‌ఛార్ట్ ప్రకారమే పనులు చేయించాలని డిమాండ్ చేశారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ఏలూరు కలెక్టరేట్ వద్ద, విజయనగరం, పార్వతీపురం, రాజమహేంద్రవరంలో డిఎం అండ్ హెచ్ఒ కార్యాలయాల ఆశా వర్కర్లు ధర్నా చేశారు. గుంటూరు, పల్నాడు, కాకినాడ, శ్రీకాకుళం, తిరుపతి, కడప, చిత్తూరు, విశాఖ, అనకాపల్లి, కర్నూలు, నంద్యాల, నెల్లూరు, కృష్ణా డిఎం అండ్ హెచ్ఒ కార్యాలయాల వద్ద, ప్రకాశం జిల్లా ఒంగోలు, పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో కలెక్టరేట్ వద్ద, అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరులో డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఒ కార్యాలయం వద్ద ఆశా వర్కర్లు ధర్నా చేశారు.

ఆశా వర్కర్లకు అభినందనలు

తమ హక్కుల సాధన కోసం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని చోట్ల ఆందోళనకు దిగిన ఆశా వర్కర్లకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తిని భవిష్యత్తులోనూ కొనసాగించాలని సూచించారు. పోలీసులు, ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఆశాలు రోడ్డెక్కారని అభినందించారు.

మీకోసం

ఫ్రిజ్ నుంచి చెడువాసన వస్తుంటే ఒక నిమ్మకాయను సగానికి కోసి ఓ మూలన పెట్టాలి.

జీవన సౌరభం

ఒక మేధావి శ్రమ ఫలితం కొన్ని లక్షల మంది సామాన్య ప్రజలకు ప్రయోజనంగా మారుతుంది.

వానమ్మ రావే !

వానా వానా... రావమ్మా
వాకిలి తడిపి పోవమ్మా
వేయి చుక్కల ముగ్గు వేసెదము!

వానా వానా... రావమ్మా
దాహం తీర్చి పోవమ్మా
దండం నీకు పెట్టెదము!

వానా వానా... రావమ్మా
మట్టి తడిపి పోవమ్మా
మొక్కలు నాటి పెంచెదము!

వానా వానా... రావమ్మా
వాగులు నింపి పోవమ్మ
వనాల్లో ఊయల ఊగెదము!

వానా వానా... రావమ్మా
పుడమిని పచ్చగ చేయమ్మ
హారతులు నీకు పట్టెదము !

- బొనగిరి పాండురంగ,
తొర్రూరు.

తేడాలు గుర్తించండి

పిల్లలూ ఇక్కడ రెండు బొమ్మలు ఇచ్చాం. వాటి మధ్య పది తేడాలు ఉన్నాయి. అవేంటో కనిపెట్టండి చూద్దాం..

నేను గీసిన బొమ్మ

శశి మేఘన పడావుల,
8వ తరగతి,
ఆదిత్య హైస్కూలు, ఈదరపల్లి,
అంబేద్కర్ కోనసీమ జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఇల్లు అద్దెకిస్తాం

కానీ, మీకివ్వదు..

మనిషిని మనిషిలా చూడని సమాజంలో జీవిస్తున్నామని ఎప్పుడూ ఏదో ఒక సందర్భం మనకు గుర్తు చేస్తూనే ఉంటుంది. రంగు, భాషను బట్టి కులాన్ని అంచనా వేయడం, వేసుకున్న దుస్తులను బట్టి మతాన్ని ఆరాతీయడం, వ్యవహార శైలిని బట్టి గుర్తింపును ప్రశ్నించడం తమ నైతిక హక్కుగా భావించే వారెందరో ఈ సమాజంలో ఉన్నారు. అలాంటివారి ఇళ్లల్లో అద్దెకి దిగేందుకు వెళ్లిన వ్యక్తులకు ఎదురయ్యే అవమానాలు, అవహేళనలు అన్నీఇన్నీ కావు. అద్దె ఇంటి కోసం వెళితే - కులం, మతం, లింగ ఆధారిత వివక్ష ఎదురవ్వడం సమాజానికి సిగ్గుచేటు.

మీ కులమేంటి? మీరు ఏ దేవుణ్ణి కొలుస్తారు? నువ్వేంటి అలా మాట్లాడుతున్నావు? నువ్వు ఆడ, మగా? అనే ప్రశ్నలతో పాటు ఒంటి రంగును బట్టి.. మాట్లాడే భాషను బట్టి 'మీలాంటి వాళ్లకు అద్దెకి ఇవ్వమ'ని ముఖం మీదే తలుపులేసే కుటుంబాలు బోలెడు.

కన్నగినగర్.. తమిళనాడులోని ఓ దళితవాడ. చుట్టుపక్కలన్నీ అపార్టుమెంట్లే.. ఇళ్లు తుడిచేందుకు, తోటపని చేసేందుకు, ముఖ్యంగా మరుగుదొడ్లు కడిగేందుకు ఈ బస్తీ వాసులు అపార్టుమెంట్లకు వెళ్తుంటారు. అపార్టుమెంట్లలోనే కాదు.. పక్కనున్న కాలనీలకు ఈ పనుల నిమిత్తం బస్తీ వాసులు వెళ్తారు. తాగునీరు, కరెంటు వంటి కనీస సౌకర్యాలు లేని బస్తీలో ఎన్నాళ్లు ఉంటామని ఎవరైనా బయట ఇళ్లల్లో అద్దెకు దిగుదామంటే మాత్రం వారికి ఇళ్లు దొరకవు.

27 ఏళ్ల భీమ్‌జీ కన్నగినగర్ వాసి. నటన అతని వృత్తి. తమిళ దర్శకుడు పా రంజిత్ తెరకెక్కించిన పలు సినిమాల్లో నటించాడు. అతనికి ఎదురైన అనుభవం గురించి ఇలా చెబుతున్నాడు. 'నేను పని కోసం కన్నగినగర్ నుండి రోజూ 30 కిలోమీటర్ల దూరం ప్రయాణించేవాణ్ణి. ఒక్కోసారి రాత్రి బాగా పొద్దుపోయేది. అర్ధరాత్రైనా బస్తీకి వచ్చేసేవాడ్ని. ఇక్కడే నా కుటుంబం, స్నేహితులు ఉన్నారు. ఇది నా సొంత ప్రాంతంగా భావిస్తాను. ఇక్కడి నుండి వెళ్లిపోదామని ఎప్పుడూ అనుకోలేదు. కాని నాకు ఇప్పుడు పెళ్లయింది. పాప పుట్టింది. ఈ సమయంలో అంత దూరం ప్రయాణించడం సాధ్యం కావడం లేదు. అందుకే అద్దె ఇంటి కోసం వెతకడం ప్రారంభించాను.

భవిష్యత్తు ఇలా ఉండకూడదు

'అద్దె ఇంటి కోసం బయలుదేరిన నాకు, ఒంటి రంగును బట్టి, మాట్లాడే భాషను బట్టి కూడా వివక్ష ఎదురైంది. నగరంలో కూడా ఇటువంటి పరిస్థితి ఉందని నేను ఊహించలేదు. నాకు ఒక ఇల్లు బాగా

నచ్చింది. అడ్వాన్సు ఇద్దామని యజమాని ఇంటికి వెళ్లాను. ఫోన్లో ఎంతో స్నేహపూర్వకంగా, హుందాగా మాట్లాడిన యజమాని, నేను ఇంటికి వెళ్లినప్పుడు చాలా అసౌకర్యంగా కనిపించాడు. నాతో మాట్లాడేటప్పుడు మాటలు వెతుక్కుంటున్నట్లు అనిపించింది. ఒకసారి ఇల్లు చూపించమని అడిగాను. వెంటనే అతను నన్ను కింద నుండి పై వరకు ఒకసారి చూసి "మీరు కన్నగినగర్ నుండి వచ్చారా? అక్కడి వాళ్లకి మేం అద్దెకి ఇల్లు ఇవ్వం." అని ఖరాఖండీగా చెప్పేసి ఇంట్లోకి వెళ్లిపోయాడు. సౌకర్యవంతమైన ఇల్లు దొరికేసరికి రెండేళ్లు పట్టింది. నా బిడ్డ పెరిగి పెద్దయ్యేసరికి ఇటువంటి అసమాన పరిస్థితులు ఉండకూడదని ఆశిస్తున్నాను' అంటున్నాడు.

నా గుమ్మం దగ్గరకే రావొద్దు..

13 ఏళ్ల క్రితం ట్రాన్స్‌జెండర్ సుభిక్ష మదురై నుంచి చెన్నైకి వలస వచ్చింది. 'నా జెండర్‌ని బట్టి నాకు అద్దెకి ఇల్లు దొరకడం చాలా కష్టమైంది. నేను ఉన్నత విద్య చదువుకుంటున్నాను. ఈ సమయంలో నాకు ప్రత్యేకంగా ఓ ఇల్లు కావాలని అనుకున్నాను. రెంటల్ యాప్స్ ద్వారా అద్దె ఇళ్లు వెతకడం ప్రారంభించాను. కనీస వసతుల్లేని మురికివాడలు, చెత్త యార్డుల పక్కన ఉన్న గుడారాలు నాకు అనువైనవని సూచించి, మధ్యవర్తులు నన్ను చాలా అవమానించారు. అయితే ఒకసారి నా అభ్యర్ధనను ఆమోదిస్తూ ఓ ఫోను కాల్ వచ్చింది. అత్యవసర పరిస్థితిలో తన తల్లిదండ్రులను చూసుకుంటానని ఒప్పందం ఇస్తే ఇంట్లో ఉండవచ్చని కుటుంబానికి దూరంగా ఢిల్లీలో స్థిరపడ్డ ఓ యజమాని నాతో మాట్లాడాడు. తీరా అక్కడికి వెళ్తే ఆ యజమాని తల్లి నన్ను ఇంట్లోకి కూడా రానివ్వలేదు. "నీలాంటి వాళ్లకి నా ఇల్లు అద్దెకి ఇవ్వను" అని ముఖం మీదే తలుపేసింది. ఆ తరువాత చాలా కాలం నాకు ఇల్లు దొరకలేదు. నా కమ్యూనిటీ పట్ల సమాజం చాలా చిన్నచూపు చూస్తోంది. భిక్షాటన చేసేవాళ్లగానో.. సెక్స్ వర్కర్లగానో మమ్మల్ని పరిగణిస్తున్నారు. కానీ మాలో చాలామంది మెరుగైన జీవితాలను గడుపుతున్నారు. సమాజ ధోరణి మారనంత వరకు మాకు గౌరవం దక్కదు' అని సుభిక్ష చెమ్మగిల్లిన కళ్లతో చెబుతోంది.

మీ కుల దైవం ఎవరు?

ఫర్వీన్ ముస్లిం మహిళ. అద్దె ఇంటి కోసం వెతుకులాటలో ఆమె తినే తిండి, కొలిచే దేవుడు గురించి ప్రతి చోటా ప్రశ్నలు ఎదురయ్యేవి. 'అద్దె ఇంటి కోసం నేను ఫోన్లో సంప్రదించినప్పుడు చాలా మంది 'మీరు ఎవరు? అని ప్రశ్నించేవారు. కొంతమంది మీరు మాంసాహారులా అని అడిగేవారు. ఇంకొంతమంది మీ కులదైవం ఎవరు? అని ప్రశ్నించేవారు. కొంతమందైతే నా మాట తీరును బట్టి మీరు ముస్లింలా అనేవారు. ఇలా నన్ను చూడకుండా ఫోన్లోనే సవాలక్ష ప్రశ్నలు వేసేవారు. అన్నింటికీ సమాధానం చెప్పాక నాకు మళ్లీ వాళ్ల నుండి ఫోను కాల్స్ వచ్చేవి కావు. ఎదురుచూసీ చూసీ నేనే ఫోను చేస్తే రకరకాల కారణాలు చెబుతూ ఇల్లు ఇవ్వడం కుదరదని చెప్పేవారు. ఒకసారి ఒక ఇంటికి అడ్వాన్స్ ఇచ్చేందుకు సిద్ధమయ్యాం. ఇంతలో ఆ ఇంటి యజమాని మీరు పెరుమాళ్‌ని పూజిస్తారా? అని హఠాత్తుగా అడిగాడు. మాకేమీ అర్థం కాలేదు. మేము ముస్లిములమని చెప్పాం. అంతే! అతనిలో చాలా మార్పు కనిపించింది. చాలా ఇబ్బందిగా మాట్లాడుతున్నాడు. చివరికి మేము ముస్లిములకి ఇళ్లు ఇవ్వమని తెగేసి చెప్పాడు' అంటున్న ఫర్వీన్ ఇంకా ఇలా చెబుతున్నారు. 'కొంతమంది యజమానులు నా ఫోను నంబరును బ్లాక్ చేశారు. ముస్లింలు అంటే భారతీయులు కారని, ఉగ్రవాదులన్న భావన పెంచి పోషిస్తున్న మూకలు ఈ సమాజంలో చాలానే ఉన్నాయి' అంటూ ఆవేదన చెందుతున్నారు. ఏడాది ప్రయత్నాల తరువాత ఫర్వీన్ కొత్త ఇంటి కల నెరవేరింది.

చదువు కోసమో.. ఉద్యోగం కోసమో.. మెరుగైన జీవితం కోసమో ఎవరో ఒకరు.. ఎప్పుడో ఒకప్పుడు.. ఒక చోట నుండి మరో చోటికి వలస వెళ్లడం సర్వసాధారణం. అక్కడ స్థిర నివాసాలో.. తాత్కాలిక నివాసాలో ఏర్పరచుకోవడం కూడా చూస్తుంటాం. అయితే ఈ దృశ్యాల వెనుక కంటికి కనిపించని మనోవేదన ఎంతో దాగుందుంటుందని పై ఉదంతాలు తెలియజేస్తున్నాయి. సమాజం మారాలి.. మారాలి.. అంటుంటారు. కానీ మార్పు మనతోనే మొదలవ్వాలని ఎవరూ అనుకోరు. అలా అనుకోనంత వరకూ ఆ అసమానతలు ఇలానే రాజ్యమేలుతాయి.

(టైమ్స్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో)

28న పవన్ 'బ్రో' విడుదల

పవన్ కళ్యాణ్-సాయి ధరమ్ తేజ్ ఇద్దరూ కలిసి మొదటిసారి కలిసి నటిస్తున్న చిత్రం 'బ్రో'. ఈ సినిమా కోసం జీ స్టూడియోస్‌తో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ చేతులు కలిపింది. సముద్రఖని ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. త్రివిక్రమ్ స్క్రీన్ ప్లే, డైలాగ్స్ అందించారు. ఈనెల 28న విడుదల చేయటానికి చిత్ర నిర్మాతలు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. శనివారం ఈ చిత్రం నుండి మొదటి సింగిల్ విడుదలైంది. తమన్ సంగీతం అందించారు. పవన్ కళ్యాణ్, సాయి ధరమ్ తేజ్‌పై తెరకెక్కించిన 'మై డియర్ మార్కండేయ' పాటను రేవంత్, స్నిగ్ధ శర్మ ఆలపించారు. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించిన ఈ పాటకు గణేష్ స్వామి, భాను నృత్యరీతులు అందించారు.

'ప్రాజెక్ట్ కె' దీపికా

ప్రభాస్, నాగ్ అశ్విన్ కాంబినేషన్‌లో సైన్స్ ఫిక్షన్ చిత్రంగా రూపుదిద్దుకుంటోన్న 'ప్రాజెక్ట్ కె' చిత్రం నుండి తాజాగా దీపికా పదుకొణె లుక్‌ని మేకర్స్ విడుదల చేశారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొణె, దిశా పటానీ వంటి వారంతా ఈ సినిమాలో ప్రభాస్‌తో స్క్రీన్ పంచుకుంటున్నారు. ఈ సినిమాకు సంబంధించి వస్తున్న ప్రతి అప్‌డేట్ ప్రపంచవ్యాప్తంగా వైరల్ అవుతుండటం విశేషం. తాజాగా విడుదలైన దీపికా లుక్‌లో ఆమె లేడీ వారియర్ గెటప్‌లో కనిపిస్తోంది. 'ప్రాజెక్ట్ కె' టైటిల్, గ్లింప్స్ భారత్‌లో జులై 21న, అమెరికాలో జూలై 20న విడుదల చేయబోతున్నట్లుగా మేకర్స్ ఇదివరకే ప్రకటించారు. వైజయంతీ మూవీస్ నిర్మిస్తున్న బహుభాషా సైన్స్ ఫిక్షన్ చిత్రంగా ఇది తెరకెక్కుతోంది. జనవరి 12, 2024న సంక్రాంతి సందర్భంగా ఈ సినిమాని ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

చిత్రీకరణలో 'నా.. నీ ప్రేమకథ'

అముద శ్రీనివాస్ హీరోగా, స్వీయ దర్శకత్వంలో రూపొందించిన చిత్రం 'నా.. నీ ప్రేమ కథ'. కారుణ్య చౌదరి కథానాయిక. పోత్నాక్ శ్రవణ్ కుమార్ ఎంటర్ టైన్ మెంట్స్ పతాకంపై పోత్నాక్ శ్రవణ్ కుమార్ నిర్మిస్తున్నారు. రమ్య, అజయ్ ఘోష్, షఫీ, అన్నపూర్ణమ్మ, ఫిష్ వెంకట్ జబర్ దస్త్ ఫణి, నాగిరెడ్డి. బస్ స్టాప్ కోటేశ్వర రావు, మాధవి, వేములూరి రాజశేఖర్, హరి తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి డివోపీ: ఎంఎస్ కిరణ్ కుమార్, సంగీతం : ఎంఎల్ పి రాజా, ఆర్‌ఆర్ :చిన్నా, ఎడిటర్ : నందమూరి హరి.

'నచ్చినవాడు'లో పాట విడుదల

దర్శకుడిగా, హీరోగా లక్ష్మణ్ చిన్నా స్వీయ దర్శకత్వంలో తొలిసారిగా తెరకెక్కిస్తోన్న చిత్రం 'నచ్చినవాడు'. కావ్య రమేశ్ హీరోయిన్. 'నా మనసు నిన్ను చేర' పాటను చిత్ర యూనిట్ విడుదలచేసింది. మిజో జోసెఫ్ స్వరాలను అందించారు. ఏనుగంటి ఫిల్మ్ జోన్ పతాకంపై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

'జైలర్'గా రజనీకాంత్

రజనీకాంత్ కథానాయకుడిగా నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'జైలర్'. కళానిధి మారన్ సమర్పణలో సన్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. తాజాగా ఈ చిత్రం నుంచి 'నువ్వు కావాలయ్యా' పాటని విడుదల చేశారు మేకర్స్. సంగీత దర్శకుడు అనిరుధ్ ఈ పాటని స్వరపరిచారు. అరుణ్‌రాజా కామరాజ్ రాసిన ఈ పాటను శిల్పారావు, అనిరుధ్ కలిసి ఎనర్జిటిక్‌గా పాడారు. మోహన్ లాల్, శివ రాజ్‌కుమార్ రమ్య కృష్ణన్, తమన్నాతో పాటు వసంత్ రవి, నాగ బాబు, యోగి బాబు, జాఫర్ సాదిక్ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. ఆగస్టు 10న ఈ చిత్రం విడుదల కానుందని సమాచారం. రచన, దర్శకత్వం : నెల్సన్, సంగీతం : అనిరుధ్, డివోపీ: విజరు కార్తీక్ కన్నన్, ఎడిటర్: ఆర్.నిర్మల్, ఆర్ట్: డాక్టర్ కిరణ్.

మరణించిన వారు నటిస్తున్నారు ...

శంకర్ తెరకెక్కిస్తున్న 'భారతీయుడు 2' చిత్రం నుండి ఒక వార్త వైరల్ అవుతోంది. చనిపోయిన నటుల చేత శంకర్ యాక్ట్ చేయిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మూవీలో కీలక పాత్రలు పోషిస్తున్న కమెడియన్ వివేక్, నెడుముడి వేణు చనిపోయారు. కానీ వాళ్లు నటించాల్సిన పాత్ర మాత్రం ఇంకా పూర్తి కాలేదు. వేరే డైరెక్టర్స్ అయితే ఆ ప్లేస్‌లో మరొకరిని రీప్లేస్ చేసి మళ్లీ షూటింగ్ మొదలుపెట్టేవారు. కానీ టెక్నాలజీ సాయంతో వాళ్లే మళ్లీ నటించేలా చేస్తున్నారు శంకర్. హాలీవుడ్ టెక్నాలజీ ఉపయోగించి.. వివేక్, వేణు ఉన్న సీన్స్‌ను, అలాగే కమల్ హాసన్‌కి ఎలాంటి గెటప్ వేయకుండా.. గ్రాఫిక్స్ సహాయంతో యంగ్‌గా చూపించనున్నారని సమాచారం.

యువ క్రికెటర్లకు పరీక్ష

నేడు పాకిస్తాన్-ఎ తో కీలకపోరు • ఎసిసి ఎమర్జింగ్ ఆసియాకప్

మధ్యాహ్నం 2.00గం॥ల నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

కొలంబో: ఎసిసి ఎమర్జింగ్ ఆసియా కప్‌లో యువ క్రికెటర్లతో కూడిన భారత్-ఎ జట్టు నేడు పాకిస్తాన్‌తో కీలక పోరులో తలపడనుంది. గ్రూప్-బిలో ఉన్న భారత్-ఎ, పాకిస్తాన్-ఎ జట్లు రెండేసి విజయాలతో ఇప్పటికే సెమీస్‌కు చేరాయి. సెమీస్‌కు చేరే క్రమంలో ఈ రెండుజట్లు భారీ వ్యత్యాసంతో ప్రత్యర్థి జట్లను చిత్తుచేయడమే ఇందుకు ప్రధాన కారణం. భారత్-ఎ జట్టు తొలి మ్యాచ్‌లో యుఎఇపై 8వికెట్ల తేడాతో, రెండో మ్యాచ్‌లో నేపాల్‌పై 9వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఇక పాకిస్తాన్ జట్టు తొలి మ్యాచ్‌లో నేపాల్‌పై 4వికెట్ల తేడాతో, రెండో మ్యాచ్‌లో యుఎఇపై 184పరుగుల తేడాతో గెలిచి ఆ జట్టూ దుర్భేద్యఫామ్‌లోనే ఉంది. ఈ క్రమంలో భారత్-పాకిస్తాన్ జట్ల మధ్య జరిగే చివరి లీగ్ మ్యాచ్‌కు ప్రాధాన్యత సంతరించుకుంది. భారతజట్టు కెప్టెన్ యశ్ ధుల్ తొలి మ్యాచ్‌లో సెంచరీతో కదం తొక్కాడు. రెండో మ్యాచ్‌లో అభిషేక్ శర్మ 69బంతుల్లోనే 87పరుగులు చేసి తానేమీ తక్కువ కాదంటూ నిరూపించుకున్నాడు. అలాగే సాయి సుదర్శన్ (58నాటౌట్) అర్ధసెంచరీతో మెరిసాడు. ఇక బౌలింగ్‌లో నిషాంత్ సంధు(4/14), నేపాల్‌పై బౌలింగ్‌లో అత్యుత్తమ ప్రదర్శనను కనబరిచాడు. గ్రూప్-బిలో ఇరుజట్లు 4పాయింట్లతో సమంగా ఉన్నా.. భారతజట్టు (+3.79) నెట్ రన్‌రేట్‌తో అగ్రస్థానంలో, పాకిస్తాన్(+2.87) రన్‌రేట్‌తో 2వ స్థానంలో ఉన్నాయి.

సెమీస్‌కు శ్రీలంక-ఎ, బంగ్లాదేశ్-ఎ జట్లు

గ్రూప్-ఎ నుంచి సెమీస్‌కు బంగ్లాదేశ్-ఎ, శ్రీలంక-ఎ జట్లు ప్రవేశించాయి. మంగళవారం జరిగిన ఆఖరి గ్రూప్‌లీగ్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్-ఎ జట్టు 21పరుగుల తేడాతో ఆఫ్ఘనిస్తాన్-ఎపై, శ్రీలంక-ఎ జట్టు 217పరుగుల తేడాతో ఓమన్-ఎ జట్టుపై గెలిచాయి. గ్రూప్ లీగ్ దశ ముగిసిన అనంతరం బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్, శ్రీలంక జట్లు 4పాయింట్లతో సమంగా ఉన్నా.. శ్రీలంక(+1.69), బంగ్లాదేశ్(+1.26), ఆఫ్ఘనిస్తాన్(+0.41)రన్‌రేట్‌తో టాప్-3లో నిలిచాయి. దీంతో మెరుగైన రన్‌రేట్‌తో శ్రీలంక, బంగ్లాదేశ్ జట్లు సెమీస్‌కు చేరాయి. శుక్రవారం(21న) సెమీఫైనల్ పోటీలు జరగనున్నాయి.

మంధాన @ 6 ర్యాంక్

• ఐసిసి మహిళల వన్డే ర్యాంకింగ్స్

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసిసి) విడుదల చేసిన వన్డే ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన 6వ స్థానానికి ఎగబాకింది. ఐసిసి మంగళవారం విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో మంధాన 704పాయింట్లతో ఒక స్థానానికి మెరుగుపరచుకొని 6వ స్థానంలో ఉండగా.. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ రెండు స్థానాలు దిగజారి 702పాయింట్లతో 8వ ర్యాంక్‌కు పడిపోయింది. ఇక బౌలర్ల జాబితాలో ఎడమచేతి వాటం స్పిన్నర్ రాజేశ్వరి గైక్వాడ్ 9వ స్థానంలో ఉండగా.. ఆల్‌రౌండర్ల విభాగంలో దీప్తి శర్మ టాప్-10లో చోటు దక్కించుకున్నారు. దీప్తి శర్మ 322రేటింగ్ పాయింట్లతో 7వ స్థానంలో ఉండగా.. గైక్వాడ్ ఖాతాలో 611తపాయింట్లు ఉన్నాయి. శ్రీలంక కెప్టెన్ ఛమారి ఆటపట్టు 758పాయింట్లతో వన్డే బ్యాటర్స్ జాబితాలో కెరీర్ బెస్ట్ 3వ స్థానానికి చేరింది. బ్యాటర్ల జాబితాలో బెత్ మూనీ(ఆస్ట్రేలియా) 769పాయింట్లు, బౌలర్ల జాబితాలో సోఫీ ఎక్లేస్టోన్(ఇంగ్లండ్) 756 పాయింట్లు, ఆల్‌రౌండర్ల జాబితాలో నటాలీ స్కీవర్ 403పాయింట్లు టాప్‌లో ఉన్నారు.

జకోవిచ్‌కు జరిమానా

లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ నిర్వాహకులు రన్నరప్‌నొవాక్ జకోవిచ్‌కు జరిమానా విధించారు. నిబంధనలకు విరుద్ధంగా రాకెట్‌ను నెట్‌కేసి కొట్టినందుకు గాను అతనికి జరిమానా విధిస్తున్నట్లు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం జరిగిన ఉత్కంఠ ఫైనల్లో ఐదో సెట్‌లో జకోవిచ్ అలా ప్రవర్తించినట్లు ఆ ప్రకటనలో పేర్కొంది. కీలకమైన ఐదో సెట్‌లో జకో సర్వీస్‌ను అల్కరాస్ బ్రేక్ చేశాడు. ఆ తర్వాత అల్కరాస్ సర్వీస్‌ను జకోవిచ్ బ్రేక్ చేయలేకపోయాడు. ఆ సమయంలో కోపంతో జకో రాకెట్‌ను నెట్ పోస్ట్‌కు కొట్టి విరగ్గొట్టాడు. అక్కడే ఉన్న అంపైర్ జకోవిచ్‌ను మందలించడమే గాక.. నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుందని హెచ్చరించాడు. మ్యాచ్ అనంతరం జకో వ్యవహారాన్ని పరిశీలించిన నిర్వాహక కమిటీ.. అతడి చర్యను తప్పుగా తేల్చింది. వింబుల్డన్ ఆస్తులను ధ్వంసం చేసినందుకు గానూ అతడికి 8వేల డాలర్ల జరిమానా విధించినట్లు పేర్కొంది. ఈ విషయాన్ని ఆల్ ఇంగ్లాండ్ లాన్ టెన్నిస్ క్లబ్ ధ్రువీకరించింది. ఆ మొత్తాన్ని జకోవిచ్ అందుకున్న ప్రైజ్ మనీ నుంచి మినహాంచనున్నట్లు తెలిపింది.

బజరంగ్, వినేశ్‌కు ఊరట..

ట్రయల్స్‌కు హాజరుకానున్నా ఆసియా క్రీడలకు

న్యూఢిల్లీ: భారత స్టార్ రెజ్లర్లు బజరంగ్ పూనియా, వినేశ్ ఫోగాట్‌కు ఊరట లభించింది. ట్రయల్స్ లేకుండానే నేరుగా ఆసియా క్రీడల్లో పాల్గొనేందుకు అనుమతి లభించింది. "అవును.. ఈ ఇద్దరికీ ట్రయల్స్ నుంచి మినహాయింపు ఇస్తూ భారత ఒలింపిక్ సమాఖ్య అడ్ హక్ కమిటీ నిర్ణయం తీసుకుంది" అని ఓ అధికారి మంగళవారం తెలిపారు. ఇంతకుముందు ఇదే కమిటీ బజరంగ్, వినేశ్ ఒక్క బౌట్‌లో పోటీ పడితే చాలు అని చెప్పిన విషయం తెలిసిందే. జూలై 22, 23వ తేదీల్లో ఆసియా క్రీడల ట్రయల్స్ నిర్వహించనుండగా.. చైనాలోని గ్వాంఝూ వేదికగా సెప్టెంబర్‌లో ఆసియా క్రీడలు జరుగనున్నాయి.

షకీల్ డబుల్ సెంచరీ

గాలే: శ్రీలంక పర్యటనలో ఉన్న పాకిస్తాన్ జట్టు తొలిటెస్ట్‌లో ఆధిక్యత సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంక జట్టు 312పరుగులు చేయగా.. పాకిస్తాన్ జట్టు 461పరుగులు చేసింది. దీంతో పాకిస్తాన్‌కు 149పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. మంగళవారం తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన పాకిస్తాన్ జట్టును షకీల్(208) డబుల్ సెంచరీతో ఆదుకున్నాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68